నవంబర్
2024

సంపుటి : 20 సంచిక : 6

223

వెల రు. 15 /-

MARXISTU

# మార్క్సిస్టు


## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో ........

సనాతన ధర్మం
ఆచరణ - ఆలోచన ... సీతారాం ఏచూరి
వలస కార్మికులను దోపిడీ చేస్తున్న పద్ధతులు
సైను - సమాజం
సరిహద్దు వివాదంపై చైనాతో ఒప్పందం
వియత్నాం విప్లవయోధుడు ఎన్‌గుయెన్‌ఫూ ట్రాంగ్
చోళుల నౌకా బలం, జయాలూ, సంస్కృతి
భారీ పరిశ్రమలను కాపాడిన ఘనత ఏచూరిదే
తెలుగు సాహితిపై చెరగని ముద్ర ఆరుద్ర

నివాళి

# తెలుగు సాహితిపై చెరగని ముద్ర ఆరుద్ర



**సత్యాజీ**

ఒంటి చేత్తో మహా మహా రచనలు చేసిన రచయిత.. గొప్ప కఠోర పరిశోధకుడు.. అన్ని ప్రక్రియల్లోనూ అందె వేసిన చేయి ... ఆరుద్ర. అసలు పేరు భాగవతుల సదాశివశంకర శాస్త్రి. 1925లో విశాఖపట్నంలో పుట్టిన ఆరుద్రకు ఇది శత జయంతి సంవత్సరం. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి, అరసం వంటి సంస్థల ఆధ్వర్యాన ఆయన సాహిత్యంపైనా, సాహిత్య కృషిపైనా ఏడాది పాటు సభలూ, సదస్సులూ, చర్చలూ జరుపుతున్నారు. పాతికేళ్ల వయస్సు నుంచే ఆరుద్ర సాహిత్య శోధకుడై, సాధకుడై, పరిశోధకుడై ... తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసుకున్నాడు. ఆయన గొప్ప ప్రగతివాది. హేతువాది.

ఆరుద్ర సాహిత్య సవ్యసాచి. ఆయనకు ప్రవేశం లేని ప్రక్రియ లేదు. కథలూ నవలలూ కవిత్వమూ ... అన్నీ రాశాడు. అపరాధ పరిశోధన అమిత ఇష్టం. ఒక దశలో నెలకొక నవల రాసేవాడు. ఒకసారి చదరంగం నేపథ్యంలో రచన చేయాల్సి వచ్చింది. అంతే! మొత్తం చదివేశాడు. చదరంగం ఎక్కడ పుట్టిందో, ఎలా ఎదిగిందో, ఎలా ఆడాలో ఒక పెద్ద పుస్తకం రాసేశాడు. ఆయనలోని పరిశోధనాశక్తి, ఆసక్తి అంతటి పతాక స్థాయిలో ఉండేవి. కాబట్టే ఒక విశ్వవిద్యాలయం స్థాయిలో జరగాల్సిన సమగ్రాంధ్ర సాహిత్య పరిశోధనను తానొక్కడే చేశాడు. ఆరు వేల పేజీల్లో 14 సంపుటాలను వెలువరించాడు. నాలుగు వేల సినిమా పాటలు రాశాడు. 'సీత రాముడికి ఏమవుతుంది?' అని ప్రశ్నించాడు. ఏఏ దేశాల్లో, ఏఏ రామాయణాల్లో ఏముందో పరిశోధించి రాశాడు. ఆయన గొప్ప చమత్కారి. పుస్తకం అంతా పూర్తయ్యాక ఆఖర్లో అన్నాడు : సీత రాముడికి ఏమవుతుంది? అంటే – నువ్వు ఏమవుతుందని అనుకుంటున్నావో అదే అవుతుంది. ఆరుద్ర తమాషాలకు, చురకలకు ఆయన ఇంటింటి పద్యాలు, కూనలమ్మ పదాలు నిలువుటద్దాలు. పదాలతో ఆడుకోవడం ఆయనకు అమిత ఇష్టం.

ఆరుద్ర 1925 ఆగస్టు 31న విశాఖపట్నంలో పుట్టాడు. అక్కడి ఎవిఎన్ కాలేజీ హైస్కూల్లో, తర్వాత విజయనగరంలో ఎంఆర్ కళాశాలలో చదూకున్నాడు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో చదువుకు స్వస్తి పలికి 1943–47 మధ్యకాలంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో గుమస్తాగా పనిచేశాడు. కొంతకాలం సంగీతంపై దృష్టిని నిలిపాడు. తరువాత పత్రికారంగం వైపు మళ్లాడు. 1947–48లో మద్రాసు నుంచి వెలువడే వారపత్రిక ఆనందవాణిలో పనిచేశారు. అక్కడే ఉప సంపాదకురాలిగా పనిచేస్తున్న రామలక్ష్మితో పరిచయమై, ఆ తరువాత వారి వివాహానికి దారి తీసింది. ఆరుద్ర అభ్యుదయ రచయితల సంఘం (అరసం) వ్యవస్థాపకుల్లో ఒకరు. ఆరుద్ర మహాకవి శ్రీశ్రీకి వేలు విడిచిన మేనల్లుడు. చాగంటి సోమయాజులు (చాసో) తనకు మార్క్సిస్టు భావాలు నూరిపోశాడని ఆరుద్ర చెప్పేవారు. ఆయన తుదిశ్వాస విడిచేదాకా మార్క్సిస్టు దృక్పథంతోనే ఉన్నారు. 1981లో ప్రజాశక్తి దినపత్రికగా ప్రారంభమైనప్పుడు స్వాగతగేయం రాశారు. ఎక్కడికి వెళ్లినా అధ్యయనం, పరిశోధనలను చాలా ఇష్టంగా కొనసాగించారు. లండన్ వెళ్లినప్పుడు అక్కడి లైబ్రరీలో ప్రొగ్రసివ్ రైటర్స్ మేనిఫెస్టోను వెతికిపట్టుకున్నారు. ఇండియాకు వచ్చాక దానిపై ఒక వ్యాసం రాసి, ప్రజాశక్తి ద్వారా వెల్లడి చేశారు. భారత అభ్యుదయ రచయితల సంఘం ఏఏ విధివిధానాలు, లక్ష్యాలతో ఏర్పడిందో ఆ మేనిఫెస్టో వివరిస్తుంది. సమగ్రాంధ్ర సాహిత్యంపై ఆయన చేసిన పరిశోధన, కాలక్రమణిక కూర్పు చాలా గొప్పవి. నన్నయ ముందు కాలం నుంచి సాహిత్య సృజన ఎలా సాగుతూ వచ్చింది; రూపంలోనూ, సారంలోనూ ఏఏ మార్పులకు గురవుతూ వచ్చిందీ, ఏఏ అంశాలను పట్టించుకొంది వంటి అంశాలను ఒక క్రమంలో ఆయన గుది గుచ్చారు. విశ్వవిద్యాలయాల స్థాయిలో ఒక పెద్ద ప్రాజెక్టుగా చేపట్టాల్సిన కర్తవ్యాన్ని ఆయన ఒక్కడే బృహత్తర బాధ్యతగా భుజాన మోశాడు, ఒంటి చేత్తో రాశాడు.

**జీవితాంతం సాహిత్య సేవ**

విజయనగరంలో ఉంటూ, ప్రముఖ రచయిత చాగంటి సోమయాజులు (చాసో) ప్రేరణతో కమ్యూనిస్టుగా మారాడు. ఆర్థిక, సామాజిక అంతరాలు అంతరించిపోయి, మనుషులంతా సుఖసంతోషాలతో ఉండాలంటే సమ సమాజం ఏర్పడాలని బలంగా కోరుకున్నాడు. ఏ ప్రక్రియలో ఏ రచన చేసినా మార్క్సిస్టు దృక్పథంతోనే కొనసాగాడు. ఆఖరికి సినిమా పాటల్లోనూ అవకాశం ఉన్న మేర ప్రజాస్వామిక, ప్రగతిశీల భావాలను ప్రచారం చేశాడు. పత్రికారంగంలో పనిచేయటానికి మద్రాసు వెళ్లిన మొదట్లో ఆరుద్ర చాలా కష్టాలు అనుభవించాడు. తినడానికి తిండిలేక పానగల్ పార్కులో నీళ్ళు తాగి కడుపు నింపుకోవల్సి వచ్చిన సందర్భాలున్నాయని ఆయనే చెప్పారు. అయితే ఈ ఇక్కట్లు ఆయన సాహిత్య సేవకు అడ్డం రాలేదు. వందలాదిగా గేయాలు, గేయ నాటికలు, కథలు, నవలలు, సాహిత్య పరిశోధక వ్యాసాలు, వ్యంగ్య వ్యాసాలు, పుస్తకాలకు పీఠికలు, పుస్తకాలపై విమర్శలు, సినిమా పాటలు .... అలా రాస్తూనే పోయాడు. ఇంత వైవిధ్యం గల సాహిత్యోత్పత్తి చేసిన ఆధునికుడు మరొకడు లేరంటే అతిశయోక్తి కాదు.

అనేక రచనలూ అనేక పుస్తకాలూ

....

తెలుగు సాహిత్య లోకానికి ప్రాపంచిక దృష్టితోపాటు భౌతిక దృక్పథాన్ని పరిచయం

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...

1. తెలుగు సాహితిపై చెరగని ముద్ర ఆరుద్ర
సత్యాజీ...........2

2. సనాతన ధర్మం
ఎంవిఎస్ శర్మ.......4

3. ఆచరణ, ఆలోచన - సీతారాం ఏచూరి
తీస్తాసెతల్వాడ్.......8

4. వలస కార్మికులను దోపిడీ చేస్తున్న పద్ధతులు
ఎస్.పురేంద్రప్రసాద్........ 12

5. సైను - సమాజం
ఎస్.వెంకట్రావు........20

6. సరిహద్దు వివాదంపై చైనాతో ఒప్పందం
ఎ కోటిరెడ్డి........ 24

7. వియత్నాం విప్లవయోధుడు ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్
........................ 27

8. చోళుల నౌకా బలం, జయాలూ, సంస్కృతి
ఎంవిఎస్ శర్మ........29

9. భారీ పరిశ్రమలను కాపాడిన ఘనత ఏచూరిదే
సీహెచ్.నరసింగరావు.... 32



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at:cpim.org


# పెరుగుతున్న ప్రతిఘటన

సోషలిస్టు శిబిరం దెబ్బతిన్న తర్వాత తనకు ఎదురే లేదంటూ సామ్రాజ్యవాదం విర్రవీగుతూ తన దోపిడీ విధానాలని, యుద్ధనీతిని వేగంగా ముందుకు తెచ్చింది. ఒకవైపు నయా-ఉదారవాద విధానాల చట్రంలో మూడవ ప్రపంచదేశాలను ఇరికిస్తూ, వాటి సంపదను కొల్లగొడుతోంది. మరోవైపు పశ్చిమాసియాలో, ఉక్రెయిన్‌లో యుద్ధాలను ప్రేరేపించి వాటి పరిష్కారం జరగకుండా అడ్డుపడే ఎత్తుగడలు అనుసరిస్తోంది. మూడవ ప్రపంచదేశాలలో నయా-ఉదారవాద విధానాల కారణంగా ప్రజలలో పెరిగే అసంతృప్తి కారణంగా ఎటువంటి ఇబ్బందీ రాకుండా ఉండే విధంగా ఎత్తుగడలు అమలు చేసింది. ఆ దేశాలలో- భారతదేశంతో సహా- అధికారంలో ఉన్న పార్టీ లేదా కూటమి మీద అసంతృప్తి కలిగితే ప్రజలు ఎన్నుకోడానికి ఉన్న ప్రత్యామ్నాయం కూడా నయా-ఉదారవాద విధానాలను సమర్ధించేదే అయివుండేలా చూసుకుంటోంది. ప్రజల నడుమ విద్వేషాలను రెచ్చగొట్టే నయా-ఫాసిస్టు రాజకీయ శక్తులు ఈ నేపథ్యంలో పలుదేశాల్లో బలపడుతున్నాయి. కొన్ని దేశాలలో అధికారంలో కూడా ఉన్నాయి.

ఈ వ్యూహంతో తమ ఆధిపత్యానికి, దోపిడీకి ఎదురు ఉండదు అన్న ధీమాతో ఉన్న సామ్రాజ్యవాద శక్తులకు, వాటికి లొంగి వ్యవహరించే ఆయా దేశాల అధికార పార్టీలకు ఊహించని విధంగా ప్రతిఘటనలు ఎదురౌతున్నాయి. మన దేశానికి పొరుగున ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంకలో ప్రజలు పెద్దఎత్తున తిరుగుబాటు చేశారు. ప్రజాగ్రహం ఎంత తీవ్రంగా కట్టలు తెంచుకుందంటే ఆ రెండు దేశాల అధినేతలు, పార్లమెంటులో మెజారిటీ ఉన్నా దేశం వదలి పారిపోవలసివచ్చింది. రాజపక్సే శ్రీలంకను విడిచి పారిపోయిన తర్వాత అక్కడ జరిగిన ఎన్నికల్లో వామపక్ష శక్తులుగా పరిగణించబడే పార్టీల తరపున అనుర కుమార దిస్సానాయకే ఎవరూ ఊహించని విధంగా గెలుపొందడం ప్రజలు ప్రత్యామ్నాయ విధానాలను కోరుకుంటున్నారని తెలియజేస్తోంది. బంగ్లాదేశ్‌లో ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వం ముందు కూడా ఇటువంటి సవాలే ఉంది. బంగ్లాదేశ్, శ్రీలంక, కొద్ది కాలం క్రితం వరకూ ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్‌ల ముద్దు బిడ్డలుగా చెలామణీ అయాయి. ఆ దేశాలు సాధించిన ఆర్థిక విజయాలను తక్కిన దేశాలకు ఆదర్శంగా చూపించి నయా-ఉదారవాద ఆర్థిక వేత్తలు తెగ ప్రచారం చేసుకున్నారు. కాని ఆ దేశాలలో ప్రజలు తిరగబడింది సరిగ్గా ఆ విధానాల పర్యవసానాలమీదనే.

ఆసియాలోనే గాక ఆఫ్రికాలోనూ ప్రతిఘటనను సామ్రాజ్యవాదం చవిచూస్తోంది. బుర్కినా ఫాసో, మాలి, నైగర్ దేశాలలో ఎన్నికల్లో నెగ్గిన పార్టీలు ఫ్రెంచి సామ్రాజ్యవాదానికి తొత్తులుగా ఉండేవే. ఆ దేశాలలో నేటికీ ఫ్రెంచి సైన్యాలు తిష్టవేసుకుని అక్కడ సహజ సంపదలను కొల్లగొడుతూనేవున్నాయి. ఎన్నికల్లో ఎవరు నెగ్గినా తమకు ఢోకా లేదనే ధీమా సామ్రాజ్యవాదానికి మొన్నటిదాకా ఉండేది. కాని ఈ మూడు దేశాలలో సైన్యంలో తిరుగుబాట్లు జరిగాయి. తిరుగుబాటు నాయకత్వం అంతా యువకులే. వాళ్ళు ఆ మూడు దేశాలలోనూ ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసి అధికారం తమ చేతుల్లోకి తీసుకున్నారు. తక్షణమే ఫ్రెంచి సైన్యాలు తమ తమ దేశాలను విడిచిపోవాలని ఆదేశించారు. బుర్కినా ఫాసోలో ఫ్రెంచి ఆధిపత్యంలో నడిచే బంగారం గనులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

మరోవైపున పశ్చిమాసియాలో ఇజ్రాయిల్‌కు ఊహించని ప్రతిఘటన, పాలస్తీనాకు వెల్లువెత్తుతున్న అంతర్జాతీయ సంఘీభావం, ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో రష్యా బలంగా నిలబడడం...మొదలైనవి అమెరికా యుద్ధనీతిని సవాలు చేస్తున్నాయి.

నయా-ఉదారవాద విధానాలు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను మొత్తంగా సంక్షోభంలోకి నెట్టిన ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ ప్రాంతాలలో, వివిధ రూపాలలో సామ్రాజ్యవాదానికి ఎదురౌతున్న ప్రతిఘటనను విప్లవ శక్తులు గమనించాలి. అమెరికన్ సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో నడిచే మోడీ ప్రభుత్వపు లొంగుబాటు స్వభావాన్ని ప్రజలలో ఎండగట్టాలి. సామ్రాజ్యవాదపు దోపిడీకి, నయా-ఉదారవాద విధానాలకు, నయా-ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో అలనాటి జాతీయోద్యమ స్ఫూర్తిని మళ్ళీ రగుల్కొలపడానికి నడుం బిగించాలి.

**ఈ మాసం ముఖ్యాంశం**

# సనాతన ధర్మం



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

**ఎం.వి.ఎస్.శర్మ**

**(2023లో సనాతన ధర్మం మీద ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల అనంతరం కొంత దుమారం రేగింది. మళ్ళీ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, ప్రముఖ సినీ హీరో అయిన పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటలు, వ్యవహరించిన తీరు తెలుగు రాష్ట్రాల్లోనే గాక, పొరుగు రాష్ట్రాల్లో కూడా చర్చనీయంశం అయ్యాయి. ఈ నేపథ్యంలో సనాతన ధర్మం గురించిన అవగాహన ప్రజల మధ్య నిరంతరం పనిచేస్తూ వారిని చైతన్యపరిచే కమ్యూనిస్టులకు, ఇతర సామాజిక కార్యకర్తలకు, లౌకిక శక్తులకు కలిగించడం కోసం ఈ వ్యాసం కొంతైనా ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం)**

**1**

సనాతనం అంటే కాలంతోబాటు మారకుండా శాశ్వతంగా కొనసాగేది అని అర్ధం. మొత్తం భూమి చరిత్ర తో పోల్చుకుంటే 'కాలం' అనే భావన అంత సనాతనమేమీ కాదు. ఈ భూమి ప్రస్తుత రూపంలో ఏర్పడి సుమారు 450 కోట్ల సంవత్సరాలైంది. భూమి మీద ఏకకణజీవి ఏర్పడి 180 కోట్ల సంవత్స రాలైంది. నేటి ఆధునిక మానవుడికి పూర్వులైన నరవానరాలు సుమారు 23 లక్షల సంవత్సరాల క్రితం భూమిమీద ఉనికిలోకి వచ్చాయి. ఆధునిక మానవుడికి దగ్గరగా ఉండే రూపంతో ఉన్న హెూమో ఎరక్టస్‌లు అయిదారు లక్షల సంవత్స రాల క్రితం ఉనికిలోకి వచ్చాయి. ఆధునిక మానవులు అంటే కనీసం ఏదో ఒక రాతి పనిముట్టునైనా వాడేవారు, నిప్పును ఉపయో గించడం తెలిసినవారు అన్న ప్రమాణం బట్టి చూస్తే 40 వేల సంవత్సరాల క్రితం ఉనికిలోకి వచ్చారు.

ఎప్పటి ఆహారాన్ని అప్పుడు మాత్రమే సమకూర్చుకోగలిగిన పరిస్థితి నుండి పశు పోషణ, వ్యవసాయం ద్వారా కొంత 'మిగులు' ఆహారాన్ని సమకూర్చుకోగలిగిన శక్తి వచ్చాకనే మానవులకు చుట్టూ ఉన్న ప్రకృతి గురించి, దానితో తమకు గల సంబంధం గురించి అవగాహన ఏర్పరచుకోగలిగిన తీరుబాటు కుది రింది. భావాలు భాషకు అతీతంగా ఉండలేవు. అలా భాషకు అతీతంగా ఉండేవి ఎమోషన్స్ మాత్రమే. (కోపం, ఆనందం, దు:ఖం, ద్వేషం, అసూయ, పగ, ప్రేమ వంటివి) కాబట్టి భాషలు వచ్చిన తర్వాత మానవుల ఆలోచనలకు రూపం ఇవ్వడం మొదలైంది. ఆ భాషలు రాత రూపం తీసుకున్నాక ఆలోచనలను లిఖితపూర్వ కంగా భద్రపరచడం మొదలైంది.

ఇదంతా ఎందుకు అంటే, కాలం అనే భావనే సనాతనం కాదు అని చెప్పడమే నా ఉద్దేశ్యం. ఆ భావన ఈ భూమి మీదకి మానవులు వచ్చాక, వారు ఆలోచించే తీరుబడి సంపాదించుకున్నాక మాత్రమే వచ్చింది.

ఆలోచన మొదలవగానే ప్రశ్నలు కూడా మొదలయ్యాయి. ఈ ప్రకృతి ఎలా వచ్చింది? ఎవరు తెచ్చారు? ఎంతకాలం ఉంటుంది? పుట్టుక, చావు అంటే ఏమిటి? మరణం తర్వాత ఎక్కడికి పోతాం? వగైరా ప్రశ్నలు అప్పటినుంచీ ఉన్నవే. వీటికి ఆయా సందర్భాలలో మానవు లు చెప్పుకున్న సమాధానాలను బట్టి ఆ యా కాలాల సిద్ధాంతాలు, విశ్వాసాలు రూపొందా యి. దైవం అనే భావన కూడా అలా వచ్చిందే. ఆ దైవ భావనకు లక్షోపలక్షల వ్యాఖ్యానాలు ఉన్నాయి. అదే మాదిరిగా వేలాది భిన్నమైన మతాచారాలు వచ్చాయి. కొన్ని ఆచారాలు కాల క్రమంలో సమాజం చేత తిరస్కరించబడ్డాయి. కొన్ని మారిపోయాయి. కొన్ని కొత్తవి చేరుతు న్నాయి. భవిష్యత్తులో కొత్త దైవ రూపాలు, కొత్త ఆచారాలు, కొత్త విశ్వాసాలు రావు అని ఎవరైనా చెప్పగలరా?

**సనాతనం అనే విషయంలో మనం ఏం నిర్ధారణకు రాగలం? మనిషి ఆలోచించ గలిగిన నాటినుంచీ దైవం అనే విశ్వాసం ఉ నికిలో ఉంది అని చెప్పగలం. అదే కాలం నుంచీ ఆ విశ్వాసాన్ని ప్రశ్నించే భౌతికవాద ధోరణి కూడా ఉనికిలో ఉంది అని చెప్పగలం. ఈ విశ్వాసం, దానిని ప్రశ్నించే వాదం మానవ సమాజం ఉన్నంతకాలమూ కొనసాగుతాయి అని కూడా చెప్పగలం. ఈ ప్రాతిపదికను అంగీకరిస్తే "నీ సనాతన వాదం– నా సనాతన వాదం" అనే వివాదం ఉండదు.**

**2**

ధర్మం అంటే? మనం ఆచరించవల సినది ధర్మం. మన వ్యక్తిగత, లేదా సామూ హిక మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా సమాజంలో అందరూ ఆచరించడలసిన ధర్మాలు కొన్ని ఉంటాయి. ఆ యా మత విశ్వాసాలకు లోబడిఉన్నవారు ఆచరించ వలసిన ధర్మాలు కొన్ని ఉంటాయి. విశ్వాసం ప్రధానంగా వ్యక్తిగతం. ఒకరికన్నా ఎక్కువ మందికి ఒకే విధమైన విశ్వాసం ఉన్నప్పుడు, అది దైవానికి సంబంధించినది అయినప్పుడు ఆ విశ్వాసం మతం రూపం తీసుకుంటుంది. ఆ మతాన్ని అనుసరించడం అందరికీ విధా యకం కాదు. ఆ విశ్వాసాన్ని అంగీకరించిన వారికే అది పరిమితం. అలాగే ఒక ఊరికి మొత్తంగా కట్టుబాట్లు ఉంటాయి. అది ఆ ఊరివారి ధర్మం. ఒక కుటుంబంలో కొన్ని పద్ధతులు ఉంటాయి. అవి ఆ కుటుంబ ధర్మం. భర్త పట్ల భార్య, భార్య పట్ల భర్త, పిల్లల పట్ల తల్లిదండ్రులు, తల్లిదండ్రుల పట్ల పిల్లలు, ఉ పాధ్యాయుల పట్ల విద్యార్థులు, రోగుల పట్ల వైద్యులు, ఇలా మానవులు ఆచరించాల్సిన

ధర్మాలు పలు విధాలు. ఏ సందర్భంలో ఏ ధర్మం వర్తిస్తుందో దానిని పాటించాలి.

అంటే మనం ఆచరించవలసిన **అనేక ధర్మాలలో మత ధర్మాలు ఒక భాగం మాత్రమే.**

**అటువంటప్పుడు భిన్న మతాల, భిన్న విశ్వాసాల ప్రజలు కలిసి జీవించేటప్పుడు పరస్పర ఘర్షణలు తలెత్తకుండా చూసుకోవడం ఎలా? ఇందులో పెద్దగా తర్కించవలసినది ఏమీ లేదు. అందరికీ వర్తించే ధర్మాలను అనుసరిస్తూ, ఆ యా సమూహాల ప్రత్యేక ధర్మాలను ఆయా సమూహాలకే పరిమితం చేయడమే మార్గం.**

వ్యాస మహాభారతంలో ఆరణ్యక పర్వంలో ఇలా ఉంది:

"ధర్మమ్ యో బాధతే ధర్మోఽ సా ధర్మా: కుధర్మా తత్ అవిరోధి తు యో ధర్మ: సా ధర్మా: సత్య విక్రమా"

అంటే అర్థం: వేరొక ధర్మాన్ని ఆటంక పరిచే ఏ ధర్మమూ ధర్మం కాజాలదు. అది దుష్ట ధర్మమే ఔతుంది. సత్యమే ఆయుధంగా నిలచిన ఓ వీరుడా! **ఇతర ధర్మాలతో ఘర్షణకు దిగకుండా ఉండేదే సరైన ధర్మం ఔతుంది.**

మహాభారతం కాలం కన్నా ముందే ఈ దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలో ముఖ్యుడు అశోకుడు. అతడు వ్యక్తిగతంగా బౌద్ధ ధర్మాన్ని అనుసరించాడు. కాని బ్రాహ్మణ, శ్రమణక (అంటే బౌద్ధ. జైన మతాలు), అజీవిక మతా లను అన్నింటినీ ఆదరించాడు. అన్నింటికీ రక్షణ కల్పించాడు. ప్రభువుగా ఆయా ధర్మాల్లో జోక్యం చేసుకోలేదు. ఇదీ మన వారసత్వం. ఆధునిక కాలంలో దీనినే లౌకిక విధానం అని అన్నారు.

కాని హిందూత్వవాదులు వాస్తవాలను కలగాపులగం చేసేస్తున్నారు. సనాతనాన్ని, ధర్మాన్ని కలగలిపేశారు. ధర్మాల్లో కేవలం మత ధర్మాన్ని మాత్రమే ధర్మంగా ప్రకటిస్తున్నారు. పైగా వేల సంవత్సరాలనుండీ ఉనికిలో ఉన్న లౌకిక జీవన విధానం అసలు ఈ దేశంలో ఎప్పుడూ లేనే లేదని, ఈ మధ్య విదేశాలనుండి ఎరువు తెచ్చుకున్నదని నోటికెలాగ వస్తే అలా మాట్లాడుతున్నారు. పైగా ఈ దేశాన్ని కేవలం ఒకే మత ధర్మాన్ని పాటించే దేశంగా చేయాలని, అందుకు వీలుగా రాజ్యాంగాన్నే సవరించాలని పట్టుబడుతున్నారు.

### 3

మన రాజ్యాంగం ఏమంటుంది? పౌరులందరికీ మత స్వేచ్ఛను ఇచ్చింది. పౌరులు తమకు నచ్చిన మతాన్ని ఆచరించవచ్చు, ప్రచారం చేసుకోవచ్చు. ఐతే అది ఇతరుల విశ్వాసాలను, సమాజపు శాంతి భద్రతలను గాయపరిచేదిగా ఉండకూడదు.

> **"పూర్వకాలంలో నరబలి ఇచ్చే ఆచారం ఉండేది. పొత్తిళ్ళలో ఉండగానే ఆడపిల్లలకు వివాహాలు చేసేవారు. భర్త చనిపోయాక ఆ విధవకు కుటుంబజీవితమే లేకుండా చేసి మూలన కూర్చోబెట్టేవారు. సతీ సహగమనం పాటించేవారు. ఇప్పటికీ దేశంలో అప్పుడప్పుడూ ఈ దుర్మార్గపు పద్ధతులను పాటిస్తున్నట్టు వార్తలు వస్తూనేవున్నాయి. ఇవన్నీ ఇప్పుడు సమాజం దృష్టిలో ఘోరమైన నేరాలు."**

పూర్వకాలంలో నరబలి ఇచ్చే ఆచారం ఉండేది. పొత్తిళ్ళలో ఉండగానే ఆడపిల్లలకు వివాహాలు చేసేవారు. భర్త చనిపోయాక ఆ విధవకు కుటుంబజీవితమే లేకుండా చేసి మూలన కూర్చోబెట్టేవారు. సతీ సహగమనం పాటించేవారు. ఇప్పటికీ దేశంలో అప్పుడప్పుడూ ఈ దుర్మార్గపు పద్ధతులను పాటిస్తున్నట్టు వార్తలు వస్తూనేవున్నాయి. ఇవన్నీ ఇప్పుడు సమాజం దృష్టిలో ఘోరమైన నేరాలు. "కాదు, ఇవి మా సనాతన ధర్మాలు. వీటిని పాటించి తీరుతాం, అడ్డొస్తే నరికేస్తాం" అని రంకెలు వేస్తే వాళ్ళూ శిక్షార్హులే. అంటే **కాలం మారితే ధర్మాల్లో కూడా మార్పులు వస్తాయి. రావాలి కూడా. అది కాల ధర్మం. అలా మార్పులు కేవలం మత ధర్మాల్లో మాత్రమే కాదు, అన్ని రకాల ధర్మాలలోనూ వస్తాయి.**

మన రాజ్యాంగం పురుషాధిక్యతను తిరస్కరించింది. లైంగిక వివక్షత ఉండకూడదని చెప్పింది. కాని పురుషాధిక్యత కొనసాగుతోంది. కుల వ్యవస్థ కూడా అటువంటిదే. పుట్టుకను బట్టి ఎట్టి తేడాలూ

ఉండకూడదు. కాని నేటికీ చాలా అసహ్యంగా కుల వివక్షత కొనసాగుతోంది. ఇతరుల విశ్వాసాలను గాయపరిచేలా ప్రవర్తించడమూ శిక్షార్హమే. కాని నేడు అలా గాయపరచడం ప్రధానంగా అధికారంలో

ఉన్నవారే చేస్తున్నారు. అంతకన్నా ఆందోళనకరమైన విషయం ఏమంటే రాజ్యాంగం నిషేధించిన వాటిని రాజ్యాంగ బద్ధం చేసేయాలని, దానికి వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలని మోడీ ప్రభుత్వం తాపత్రయ పడుతోంది. కాని ఎక్కడా కుల వివక్షతను చట్టబద్ధం చేస్తామని కాని, పురుషాధిక్యతను చట్టబద్ధం చేస్తామని కాని, హిందువులు తప్ప తక్కినవారికి ఈ దేశంలో ఉనికి లేకుండా చేస్తామని కాని తమ మేనిఫెస్టోలో ప్రకటించగలరా? అలా నేరుగా ప్రకటించలేరు గనుకనే వాటన్నింటికీ బదులుగా "సనాతన ధర్మం" అనే పాట ఎత్తుకున్నారు. పోనీ ఆ సనాతన ధర్మాన్నైనా సూటిగా, పూర్తిగా వివరించగలరా? అంటే అదీ లేదు.

### 4

మాట్లాడితే వేదభూమి అంటూంటారు సంఘపరివారం. మరి ఆ వేదాల్లో చెప్పిన ధర్మం ఏమిటి?

ఋగ్వేదకాలం నాడు సమాజం ఆదిమ సమాజం. స్వంత ఆస్తి లేని సమాజం. ఋగ్వేదంలో హిందూ మతం అన్న పేరే ఎక్కడా ప్రస్తావనకు రాదు. ఈ ఒక్క పాయింటు చాలు నిజానికి. సనాతన ధర్మం అంటే హిందూ మత ధర్మం అన్న అర్థం తీయడం తప్పు అని చెప్పడానికి. ఆ ఋగ్వేదంలో మానవులు పూజించినవి ప్రధానంగా ప్రకృతి శక్తులు మాత్రమే. అప్పటికి విష్ణువు, శివుడు వగైరా దేవుళ్ళెవరూ లేరు. ( విచిత్రం ఏమంటే ఋగ్వేద కాలానికి దాదాపు 2000 సంవత్సరాల తర్వాత వచ్చిన కృష్ణుడు భగవద్గీతలో మాత్రం తానే సనాతనుడిని అని తనకు తానే ప్రకటించు కున్నాడు) ఋగ్వేదకాలపు దేవతలలో అందరికన్నా అగ్రస్థానం వరుణుడిది. తర్వాత స్థానం ఇంద్రుడిది. ఈ వరుణుడి బాధ్యత సమాజ ధర్మం అందరూ సక్రమంగా పాటించేలా చూడడం. ఏమిటా కాలపు సమాజ ధర్మం?

వేదకాలపు సమాజ ధర్మం 'ఋతం' . ఋతాన్ని అనుసరించడమే వ్రతం. ఏమిటా ఋతం? ఏ వ్యక్తీ సమాజ ప్రయోజనాలకు

**"కుల వ్యవస్థ ఎటువంటి మార్పులూ చోటు చేసుకోని వ్యవస్థ కాదు. రాను రాను అది విస్తరిస్తూ, కొత్త కులాలను - ప్రధానంగా శూద్ర, దళిత కులాలను సృష్టిస్తూ, బ్రాహ్మణాధిపత్యాన్ని పెంచుకుంటూ పోయింది. కుల ధర్మం కాని సమాజ ధర్మం వేరే ఏమీ లేదు కదా అని అర్జునుడు శ్రీకృష్ణుడిని అడుగుతాడు భగవద్గీతలో. మొదటి అధ్యాయం అర్జున విషాదయోగంలో 40వ శ్లోకం నుండి 44వ శ్లోకం దాకా అర్జునుడికి ఒకటే సందేహం."**

భిన్నంగా వ్యవహరించకూడదు. అదే సమయంలో సమాజం ప్రతీ వ్యక్తి సంక్షేమాన్నీ కాపాడాలి. అంతేకాక, ప్రకృతి సమతుల్యతను దెబ్బ తీసే విధంగా ఎవరూ వ్యవహరించరాదు. ఇదే ఋతం సారాంశం.

సర్వేపి సుఖినస్సంతు (అందరూ సుఖంగా ఉండాలి)

సర్వే సంతు నిరామయా: (అందరూ ఎటువంటి అనారోగ్యమూ లేకుండా ఉండాలి)

సర్వే భద్రాణి పశ్యంతు (అందరూ శుభములనే చూడాలి)

మాకశ్చిత్ దు:ఖభాగ్భవేత్ (ఏ ఒక్కరూ దు:ఖితులు కాకూడదు)

ఇది ఆదిమకాలపు ఋత ధర్మం.

సహనాభవతు ( కలిసి జీవింతుము గాక)

సహనౌ భునక్తు( కలిసి భుజింతుము గాక)

సహ వీర్యం కరవావహై: ( సమిష్టిగా మన శక్తి సామర్థ్యాలను పెంపొందించుకొందుము గాక)

తేజస్వినావధీతమస్తు (అందరమూ జ్ఞానవంతులమగుదుము గాక)

మ విద్విషావహై: (మనలో మనకు పరస్పర ద్వేషములు ఉండకుండుగాక)

ఓం శాంతి: శాంతి: శాంతి: (ప్రపంచం అంతా శాంతి వర్ధిల్లుగాక)

ఈ శాంతి మంత్రం ఆ కాలపు ప్రజల ఆకాంక్షలను వ్యక్తం చేస్తుంది.

ఇజ్రాయిల్ క్రూర దుర్మార్గాలను, మానవ హననాన్ని నిస్సిగ్గుగా బలపరిచే పాలకులకు ఈ మంత్రం ఏమర్థమౌతుంది? గంధం వాసన కొన్ని జీవులకు తెలియదు కదా.

**కొందరు నిజాయితీగానే సనాతనత్వం అంటే చాలా గొప్పది అనుకునేవారున్నారు. వాళ్ళైనా, సనాతన కాలపు సమాజంలోని ఋతం ఏమిటో గ్రహిస్తే మంచిది.**

## 5

కొంత కాలం గడిచాక వ్యవసాయం, పశుపోషణ లతో బాటు చేతి వృత్తులు కూడా బయలుదేరాక సమాజంలో సంపద పెరిగింది. దానిని కొందరు ఆధిపత్యవర్గాలవారు చేజిక్కించుకున్నారు. తమ అధికారాన్ని ఎవరూ సవాలు చేయకుండా ఉండడానికి కొత్త ధర్మాలు తెచ్చారు. అలా అప్పటినుంచీ మనకి అంటుకున్న జాడ్యం కుల వ్యవస్థ. సంపదను వ్యక్తిగత ఆస్తిగా మార్చినప్పుడే స్త్రీలను అణగదొక్కుతూ పురుషాధిక్యత ఆచరణలోకి వచ్చింది. వీటిని మతం సమర్ధించింది అని చిత్రించడానికి ఆధిపత్య కులాలవారు ముందుకు తెచ్చినదే మనువాదం. ఆ మనువాదం సమాజంలో అత్యధిక మెజారిటీ గా ఉన్న శ్రమజీవులను దారుణంగా అణగదొక్కే ధర్మాన్ని ప్రతిపాదించింది. ఆ ధర్మాన్ని కాపాడడమే రాజు ధర్మం అంది.. ధర్మో రక్షతి రక్షిత: అంటే అర్థం ఏ రాజు ధర్మాన్ని ( అంటే మనుధర్మాన్ని) కాపాడతాడో అతడిని ఆ ధర్మం (అంటే మనువాదం) కాపాడుతుంది అని.

కుల వ్యవస్థ ఎటువంటి మార్పులూ చోటు చేసుకోని వ్యవస్థ కాదు. రాను రాను అది విస్తరిస్తూ, కొత్త కులాలను – ప్రధానంగా శూద్ర, దళిత కులాలను సృష్టిస్తూ, బ్రాహ్మణాధిపత్యాన్ని పెంచుకుంటూ పోయింది. కుల ధర్మం కాని సమాజ ధర్మం వేరే ఏమీ లేదు కదా అని అర్జునుడు శ్రీకృష్ణుడిని అడుగుతాడు భగవద్గీతలో. మొదటి అధ్యాయం అర్జున విషాదయోగంలో 40వ శ్లోకం నుండి 44వ శ్లోకం దాకా అర్జునుడికి ఒకటే సందేహం. ఇటువంటి మహా భీకర యుద్ధంలో లక్షలాది మంది చనిపోతారు కనుక స్త్రీలు భర్తలు లేకుండా అయిపోతారు. అప్పుడు వర్ణ సంకరం అయిపోతుంది. దానివలన సనాతన ధర్మం నాశనం అయిపోతుంది – ఇదీ అర్జునుడి వాదన. (అర్జునుడి కాలానికి ఋతం ధర్మం కానేకాదు. కులవ్యవస్థే అతడికి సనాతన ధర్మం అయింది.) ఈ వాదన చెప్పి అర్జునుడు యుద్ధం చేయబోనని చెప్పాడు.

**మరి దానికి కృష్ణుడేమన్నాడు?**

మోక్ష సన్యాసయోగంలో "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామిమా శుచ:"

అర్థం: సర్వ ధర్మాలనూ పరిత్యజించి నన్నే శరణు వేడుకో. అన్ని పాపాలనుండీ నేను నిన్ను విముక్తుడ్ని కావిస్తాను. నీవు శోకింపకు.

ఇక్కడ అర్జునుడు చెప్పిన ధర్మం తెగల ఉమ్మడి సామ్రాజ్యాల కాలం నాటిది. ఒకే

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**
**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

తెగలోని వారు ఒకరిని ఒకరు చంపుకోరు. అందుకే తన స్వంత తెగకే చెందిన కౌరవులను చంపడానికి అర్జునుడు మొదట అంగీకరించ లేదు. కాని కృష్ణుడు రాజ్యం వీర భోజ్యం అన్న సూత్రం మీద ఆధారపడిన కొత్త సమాజాన్ని నిర్మించడానికి పూనుకున్నాడు. అందుకనే అర్జునుడిని పాత ధర్మం సంగతి మరిచిపోమన్నాడు. కుల వ్యవస్థని సృష్టించిందే తాను అని, దాని సంగతి తనకి వదిలెయ్యమని అర్జునుడికి భరోసా ఇచ్చాడు. తాను చెప్పినదే ధర్మం అని, దానిని అనుసరించి పోవాలని ఆదేశించాడు.

మహా భారత యుద్ధం తర్వాత నుండి బలవంతుడిదే రాజ్యం అన్న కొత్త ధర్మం ఉనికిలోకి వచ్చింది. అంతవరకూ ఉన్నఉమ్మడి తెగల రాజ్యం (ఇందుకు కురు సభ ఉదాహరణ) నాశనం అయింది. వ్యక్తిగత ఆస్థి ప్రాబల్యం మరింత పెరిగింది.

అంటే స్వయంగా కృష్ణ భగవానుడే అప్పటివరకూ ఉండిన ధర్మాన్ని మార్చేసి కొత్త ధర్మం పెట్టాడు అని గ్రహించాలి. అటువంటప్పుడు ' మా ధర్మం ఎన్నటికీ మారనిది' అనడం తప్పు కాదా?

తెగల ఉమ్మడి రాజ్యం గా ఉన్నప్పుడు ధర్మం వేరు. యుద్ధంలో రాజ్యాన్ని గెలుచుకుని స్వంత రాజ్యంగా నడిపే వ్యవస్థ ఉన్నప్పుడు ధర్మం వేరు. అదే మాదిరిగా ప్రస్తుత కాలంలో ప్రజలందరికీ ఓటుహక్కు వచ్చి, రాజకీయంగా సమానత్వం వచ్చినప్పుడు కృష్ణుడు చెప్పిన ధర్మం ఎలా పనికొస్తుంది? అందుకే మన పెద్దలందరూ కలిసి రాజ్యాంగాన్ని రాశారు. దానిని ప్రజాస్వామ్య పద్ధతిలో అందరూ ఆమోదించారు. ఇప్పుడు రాజ్యాంగమే మన అందరి ధర్మం. వ్యక్తిగత మత విశ్వాసాల వరకు ఎవరి మత ధర్మాలని వారు (చట్టం ఆమోదించిన పరిధిలో) అమలు చేసుకోవచ్చు. ప్రభుత్వానికి సంబంధించి రాజ్యాంగ ధర్మమే ఆచరణీయం.

**6**

ఐతే ఈ విషయాలన్నీ తెలియనందు వలన హిందూత్వ వాదులు, వారి బంట్లు ఈ 'సనాతన' వివాదాన్ని రేపుతున్నారని అనుకుంటే పొరపాటు. ఇది తెలిసి చేస్తున్న రచ్చ. అధికారంలో ఉండి, రాజ్యాంగ విధులను పాటించవలసివుండి కూడా ఉల్లంఘించి మరీ చేస్తున్న రచ్చ. కారణం ఏమిటి?

> **“ పైకి ఎన్ని హామీలు ఇచ్చినా, ఎన్ని రకాల ప్రచారాలు చేసినా, సంక్షేమ మంత్రాలు ఎంతగా పఠించినా, ప్రజలకు అందే ప్రయోజనాలు తక్కువ, ప్రజలనుండి పిండుకుంటున్నది అంతకన్నా చాలా ఎక్కువ. ఇలా పిండుకుంటున్నదానికి దేశ సహజ వనరులను కూడా కలిపి ఆ కార్పొరేట్లకు సమర్పించుకుం టున్నారు పాలకులు. ”**

విదేశీ స్వదేశీ బడా కార్పొరేట్లకి దేశ సంపదలను దోచిపెడుతూ, వారి అడుగులకు మడుగులొత్తుతూవుండే ఆర్థిక విధానాలు నేడు దేశంలో అమలౌతున్నాయి. దాని ఫలితంగా సమాజంలో ఆర్థిక అసమానతలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ప్రజల కనీస అవసరాలను కూడా తీర్చలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయి. పైకి ఎన్ని హామీలు ఇచ్చినా, ఎన్ని రకాల ప్రచారాలు చేసినా, సంక్షేమ మంత్రాలు ఎంతగా పఠించినా, ప్రజలకు అందే ప్రయోజనాలు తక్కువ, ప్రజలనుండి పిండుకుంటు న్నది అంతకన్నా చాలా ఎక్కువ. ఇలా పిండుకుంటున్నదానికి దేశ సహజ వనరులను కూడా కలిపి ఆ కార్పొరేట్లకు సమర్పించుకుం టున్నారు పాలకులు. ఆ సమర్పణను ఒక పార్టీ కంటే మరొక పార్టీ బాగా చేయగల దంటూ పోటీలు పడుతున్నారు. ఐతే ఈ నాటకం ప్రజానీకానికి అర్థం కాకూడదు కనుక రకరకాల నినాదాలను వల్లిస్తూ తమ కి బాకాలుగా ఉండే మీడియా ద్వారా ప్రజల్ని మభ్యపెడుతున్నారు. ప్రజలు ఎల్లకాలమూ మోసపోరు. అందుకే ప్రజలను మతం పేరుతో చీల్చి అందులో మైనారిటీలుగా ఉన్నవారిని మెజారిటీ ప్రజలకు శత్రువులుగా చిత్రించి ద్వేషాన్ని రగిల్చే పనిలో ఉన్నారు. అలా ద్వేషభావం ప్రబలితే ప్రజల దృష్టి పక్కకు పోతుంది. అప్పుడు తమ కార్పొరేట్ల సేవను సులువుగా కొనసాగించవచ్చు. మరికొన్ని భారాలను ప్రజలమీద మోపవచ్చు. ఇచ్చిన హామీలను కూడా ఎగగొట్టవచ్చు. ఇది రాజకీయమే తప్ప సనాతన ధర్మం ఎంత మాత్రమూ కాదు. మతభక్తీ కాదు. నిజానికి ఇది ధర్మం అసలే కాదు. పెద్ద ద్రోహం.

**7**

మత విశ్వాసాలు మార్పు లేకుండా స్థిరంగా ఉండిపోయేవి కావు. సమాజమూ మారుతూనేవుంటుంది. కాలానుగుణంగా ధర్మమూ మారుతుంది. కాని కొన్ని కాలం చెల్లిన ఆచారాలు, నమ్మకాలు, పద్ధతులు సమాజంలో కొనసాగుతూ సమాజ పురోగ మనానికి ఆటంకంగా ఉంటాయి. అలా భారతీయ సమాజాన్ని ముందుకు సాగనివ్వ కుండా ఆటంకంగా ఉన్న పాత దురాచా రాలకు, మూఢ విశ్వాసాలకు. వివక్షతకు, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా నిలబడి సంస్కరణోద్యమాలను నడిపారు గనుకనే వివేకానందుడు, రామకృష్ణ పరమహంస, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, నారాయణ గురు, పోతులూరి వీరబ్రహ్మం, కందుకూరి వంటి వారు నేటికీ దేశ గౌరవాన్ని పొందుతున్నారు. అదే కోవలో నడిచిన గురజాడ, జ్యోతిబా పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్, కుసుమధర్మన్న, భాగ్యరెడ్డి వర్మ, పెరియార్ రామస్వామి, నేటికీ మనకి పూజ్యులుగా ఉన్నారు. ఐతే గడిచిన అయిదారు దశాబ్దాల కాలంలో ఈ వైతాళికుల కృషిని కొనసాగించే కర్తవ్యాన్ని మన దేశం విస్మరించింది. అభ్యుదయ భావాల చైతన్యం వెనుకపట్టు పట్టడం తో తిరోగమన, సంకుచిత విద్వేష భావాలది పైచేయి అయింది. ఇప్పుడు జరుగుతున్న 'సనాతన' చర్చ ఆ క్రమంలోనే ముందుకొచ్చింది. ఈ చర్చలో అభ్యుదయవాదులు కూడా చురుకుగానే పాల్గొంటున్నారు. ఇది మంచి పరిణామం. అయితే ఇది మాత్రమే చాలదు. **విద్వేష రాజకీయాలను వెనక్కి కొట్టాలంటే అభ్యుదయ సంస్కృతిని ముందుకు తేవాలి. కుల వ్యవస్థ నిర్మూలనకు, పురుషాధిక్యత అంతానికి కొత్త ఊపుతో కృషి మొదలు కావాలి. లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద భావాలను పెద్దఎత్తున ప్రచారం చేయాలి. ఈ దేశాన్ని ప్రేమించేవారి ప్రధాన కర్తవ్యం ఇదే.** ❋

# ఆచరణ, ఆలోచన - సీతారాం ఏచూరి

**తీస్తా సెతల్వాద్**



ప్రముఖ పాత్రికేయురాలు

సీతా చనిపోయాడన్న విషాదకర వార్త నుండి తేరుకుని తన గురించి రాయడానికి ఇంతకాలం పట్టింది.

ఆయన నవ్వు, ఆకర్షణ, సునిశితమైన మేధస్సు, ఆ చూపు ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటాయి. సీతారాం ఏచూరి గొప్ప రాజకీయ సిద్ధాంతకర్త. సంకీర్ణాల నేర్పరి, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి, బహుముఖ బాధ్యతలను ఆయన ఒంటిమీద ధరించే కాటన్ - ఖాదీ లాల్చీ, కుర్తా మాదిరి చాలా తేలికగా నిభాయించుకుంటూ వచ్చాడు. ఏ రోజునా 'అమ్మో' అని భారంగా మూలగలేదు. పార్లమెంటు లోపలా, బయటా పదేళ్లుగా ఆయన జోక్యం చారిత్రక నిధి వంటిది. రాజ్యసభ సభ్యత్వం ముగిసిన రోజున సీతారాం వీడ్కోలు ప్రసంగంలో మన దేశ అత్యున్నత చట్ట సభల్లో మార్షల్స్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచెయ్యడం మనకు ఏం గౌరవం అని సహ పార్లమెంటేరియను ప్రశ్నించిన తీరు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నది. అలాగే 2017లో గోరక్షక దళాల పేరిట ప్రైవేటు సైన్యాలు మూక దాడులకు, హత్యలకు తెగబడుతున్న నేపథ్యంలో వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ నిషేధిస్తూ చట్టం చెయ్యాలని పార్లమెంటులో బలంగా వాదించాడు. దేశంలో మైనారిటీల మీద పెరిగిపోతున్న దాడుల నేపథ్యంలో పార్లమెంటులో జరిగిన స్వల్పకాలిక వ్యవధి చర్చలో సీతారాం ఈ డిమాండ్ లేవనెత్తడం నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది.

ఇటువంటి ఒక ప్రత్యేకమైన వ్యక్తి, నాయకుడు, స్నేహితుడు, తండ్రి, కామ్రేడ్ గురించి రాయాల్సిన సందర్భంలో అనేక జ్ఞాపకాలు, ఆలోచనలు నన్ను ముప్పిరిగొన్నాయి. అయితే వాటిని మాటల్లోకి ఒదిగించడం చాలా కష్టంగా ఉంది. సెప్టెంబరు 12 మధ్యాహ్నం 3.03 గంటలకు సీతారాం మనకు దూరమయ్యాడు అన్న వార్త విని మ్రాన్పడిపోయిన నేను వారం రోజులకు తేరుకుని ఆయన జ్ఞాపకాల గురించి రాయడానికి కూర్చున్నా, సీతారాం గురించి ఇప్పటికే వివిధ రంగాల మేధావులు, ప్రముఖులు చాలా విషయాలు రాశారు.

**అంతకు మించి నేను ఏం చెప్పాలి?**

ముందు సీతారామ్‌కు నా నివాళి. సీమా-సీతా నివసించే వసంత్‌కుంజ్‌లోని వాళ్ల ఇంటి దగ్గర మేం అనేకమందిమి తలలు వంచి నివాళులు అర్పించాం. ఆ మరుసటి రోజున గోల్‌మార్కెట్‌లోని పార్టీ కార్యాలయం ఎ.కె.జి. భవన్‌లో సీతారాం భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఒక దశాబ్ద కాలంగా సీతారామ్‌ను, అతని సహచర కామ్రేడ్స్‌ను ఇదే ఆఫీసులో కలిసి గంటల కొద్దీ అనేక ప్రజా సమస్యలపై చర్చించిన సందర్భాలు ఉన్నాయి. సీతారామ్‌తో అయితే ఇక్కడే కాదు, షహమత్ ఆఫీసులో, విఠల్‌భాయ్ పటేల్ హౌస్‌లో, 29 ఫిరోజ్‌షా రోడ్‌లో, 36 పండిట్ రవిశంకర్ శుక్లా లైన్‌లో ఉన్న ఆలిండియా కిసాన్ సభ ఆఫీసు పక్కన అనేకసార్లు కలిశాను. మధ్యాహ్న భోజన సమయంలో సీతారాం తన సన్నిహిత కామ్రేడ్స్‌తో, స్నేహితులతో కలిసి వచ్చేవాడు. అక్కడ మాబోటి వాళ్లం తనతో భేటీ అయ్యేవాళ్లం. ఆ కొద్ది సేపట్లో మేం ప్రజాసమస్యల మీద మాట్లాడుకునేవాళ్లం. ఎదురు బొదురు మాట్లాడుకున్న సందర్భాలు నా వరకు అదృష్ట ఘడియలు కింద లెక్క. నేనూ జావేద్ దేశంలోని ముస్లిం ప్రజాసముదాయం ఎదుర్కొంటున్న వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా జీవితకాలంగా పనిచేస్తా ఉన్నాం. మతోన్మాదం తన వికృతరూపాల్ని మార్చుకుంటూ ఏకంగా రాజ్యమే ఆ వికృత క్రీడలో భాగంగా వందల వేల మంది తన తోటి పౌరులయిన ముస్లిం ప్రజానీకాన్ని ఎంతటి హింసకు, భయోత్పాతానికి గురిచేస్తుందనే అంశం మీద సీతారామ్‌కు లోతైన, స్పష్టమైన అవగాహన ఉంది. ఈ అంశమే మా మధ్య భావసారూప్య సాన్నిహిత్యానికి దారి తీసింది. కష్టాల్లోనూ, నష్టాల్లోనూ, మంచికాలం - చెడుకాలంలోనూ. 1975లో సీతారాం ఏ పార్టీలో చేరాడో, ఆ పార్టీ, మార్క్సిస్టు పార్టీ మా కృషికి మద్దతుగా నిలిచింది. అందుకే నీ కిదే మా గౌరవ వందనం. లాల్‌సలామ్ కామ్రేడ్.

సోషలిజం, కమ్యూనిజంల పట్ల అచంచల విశ్వాసం, అకుంఠిత దీక్ష, సునిశిత చారిత్రక అవగాహన, దేశం పట్ల, దేశ ప్రజానీకం పట్ల అంకితభావం ఇవన్నీ సీతారామ్‌కు ఉన్న ప్రత్యేక లక్షణాలు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులను ఈ గడ్డ మీద నుండి తరిమి వెయ్యడానికి అనేక రూపాల్లో, అనేక స్థాయిల్లో, వివిధ తరగతుల సమ్మిళిత పోరాటాలు దోహదం చేశాయి. ఈ పోరాట చరిత్ర మీద సీతారామ్‌కు పట్టు ఉంది. అలాగే సంక్లిష్టమైన భారత వ్యవసాయరంగం మీదా, సంఘటిత అసంఘటిత రంగ కార్మికుల సమస్యల మీదా, సామాజిక న్యాయానికి మతతత్వం చేస్తున్న చెరుపు మీదా, కులవ్యవస్థ మీదా సీతారామ్‌కు లోతైన అవగాహన ఉన్నది. కులం, సామాజిక న్యాయం - వర్గం అంశాలపై పార్టీ, వామపక్ష సిద్ధాంతవేత్తలు తమ వైఖరిని సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని 2001 ప్రాంతంలో సీతారాం అంగీకరించాడు. దర్బన్‌లో నిర్వహించిన ఐక్యరాజ్య సమితి సదస్సులో నేను షహమత్ క్రియాశీల తోడ్పాటుతో ఆ సదస్సుకు హాజరయిన పార్లమెంటేరియన్లు అందరూ దళితుల సమస్యకు మద్దతుగా నిలిచేలా చూడగలిగాను. ఆ ఏడాది ఆగస్టు 31 నుండి సెప్టెంబరు 4 వరకు వర్ణవివక్ష, అసహనం, జాత్యహంకారం తత్సంబంధిత అసహనాలకు వ్యతిరేకంగా

దర్బన్‌లో ప్రపంచ సదస్సు జరిగింది. దక్షిణాఫ్రికాలో వర్ణవివక్షకు చరమగీతం పాడిన నేపథ్యంలో ఈ సదస్సు జరిగింది. పుట్టుక ఆధారంగా, శరీర వర్ణం ఆధారంగా ఒక ప్రజా సముదాయాన్ని సంప్రదాయం పేరిట, మతం పేరిట బలవంతంగా వేరు చేసి దేశంలోని ఉమ్మడి వనరులు అందుబాటులో లేకుండా చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలో సుదీర్ఘ త్యాగపూరిత పోరాటం జరిగింది. శతాబ్దాలుగా కొనసాగుతూ వచ్చిన వర్ణవివక్షను ఆ దేశంలోని పీడితులు 1990లో మట్టి కరిపించారు. 1994లో తొలి ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన దర్బన్ సదస్సులో దక్షిణాసియాలోని దళితులు అంతర్జాతీయ సమాజం ఎదుట తమ గళం వినిపించారు. సహజంగానే దళితులు లేవనెత్తిన డిమాండ్లను మితవాద శక్తులు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రధాన స్రవంతి మేధావులు అయితే 'సామాజిక నిర్వచనాల పరిధిలో' దళితులు లేవనెత్తిన డిమాండు వర్ణవివక్ష కిందకు రాదు అని పెంపుడు సిద్ధాంతాలు ప్రచారం చేశారు. కులపరమైన వివక్ష కూడా జన్మరీత్యా, వృత్తిరీత్యా సాగిస్తున్న పీడనే, అంటరానితనం కూడా జాత్యంహకార ధోరణిలో భాగమే. ఎందుకంటే అగ్రకులాలు, నిమ్నకులాలు, సవర్ణులు, అవర్ణులు అన్న సామాజిక విశ్వాసాల ఆధారంగా కొన్ని తరగతుల ప్రజానీకానికి కనీస మానవహక్కులు లేకుండా చేయడం వివక్ష కోవకే చెందుతుంది అని దళితులు తమ వాదన బలంగా వినిపించారు.

ఈ అంశంపై ఇండియా, నేపాల్ దేశాల వైఖరులు కొట్టొచ్చినట్లు భిన్నంగా ఉన్నాయి. ఈ విషయమై నేను 'కమ్యూనలిజం కంబాట్' పత్రికలో 'ఏప్రిల్ 2001, రహస్య వర్ణవివక్ష' పేరిట ఒక వ్యాసం రాశాను. దర్బన్ సదస్సుకు సన్నాహకంగా ఫిబ్రవరి 19న టెహ్రాన్‌లో సమావేశం జరిగింది. అటల్ బిహారీ వాజ్‌పాయ్ నేతృత్వంలోని యన్.డి.ఎ. ప్రభుత్వం వర్ణవివక్షకు వ్యతిరేకంగా జరగనున్న దర్బన్ సదస్సులో కులం అన్న అంశాన్ని చేర్చాలనుకోవడం 'వర్ణవివక్ష' అంశాన్ని పలుచన చేస్తుంది అన్న వైఖరి తీసుకున్నది.. వాజ్‌పాయ్ ప్రభుత్వం పంపిన ప్రతినిధి వర్గంలో అటార్నీ జనరల్ సోలి సొరాబ్జి కూడా ఉన్నారు. ప్రభుత్వ ప్రతినిధులు 'కులం' అనేది మా దేశ 'అంతర్గత సమస్య' కాబట్టి ఐక్యరాజ్య సమితి పరిధిలోకి రాదు అని వాదించారు. భారత ప్రభుత్వ

**" 1992-93 నుండి మేం చేపట్టిన అత్యంత ప్రమాదకరమైన పెనుసవాళ్లతో కూడిన పనికి సంబంధించి నేను సీతాతో కలిసి చర్చించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మొదటిగా 'కమ్యూనలిజం కంబాట్' తరపున '92-93' సంవత్సరాల్లో బొంబాయిలో చెలరేగిన మతకలహాల మీద జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ వెలువరించిన నివేదికను అచ్చువేసి అందరికీ అందుబాటు ధరలో ఉండాలనే ఉద్దేశంతో అరవై రూపాయలకే అమ్మాం. "**



వైఖరికి పూర్తిగా భిన్నమైన వైఖరి తీసుకున్నది నేపాల్ ప్రభుత్వం. ఆ దేశ జనాభాలో దళితులు 15 శాతం మాత్రమే. ప్రపంచంలోని ఏకైక హిందూ రాజ్యం నేపాల్ కులం అనేది తీవ్ర వివక్షకు, వేర్పాటుకు దారి తీస్తుంది అని స్పష్టం చేసింది. ఏతావాతా కుల సమస్య మీద దర్బన్ సదస్సులో అధికారికంగా చర్చలు జరపాలని నిర్ణయమైంది.

అక్కడ జరిగిన చర్చల్లో ఆర్.ఎ.ఎ-భాజపాలు కులం పట్ల అనుసరించిన వైఖరి, దళితుల డిమాండ్‌ను తిప్పికొట్టడానికి అవి ముందుకు తెచ్చిన చెత్త వాదనలను ఇక్కడ ప్రస్తావించడం నా ఉద్దేశం కాదు. అటువంటి కీలక సందిగ్ధ సందర్భంలో సీతారాం తన మేధోపరమైన ఆలోచన, రాజకీయ సంకల్పంతో ఈ సవాలును ఎలా తిప్పికొట్టాడు అని గుర్తుచెయ్యడమే నా ప్రధానోద్దేశం. కులవివక్ష సమస్యను విస్మరిస్తున్నాయి అని సి.పి.ఎం. మీదా సంఘటిత వామపక్ష ఉద్యమం మీదా అప్పటికి చాలా ముందు నుంచి ఈనాటి వరకూ విమర్శ ఉంది.

దర్బన్ సదస్సుకు ముందు జరిగిన సన్నాహక సమావేశంలో కులపరమైన వివక్షను అంతర్జాతీయ వేదికలో చర్చించాలి అన్న దళిత ఉద్యమకారుల డిమాండుకు సీతారాం గొంతుకలిపి దానికి బలం చేకూర్చాడు. కులం ప్రాతిపదికగా జరుగుతున్న వివక్షాపూరిత ఆచారాలను ఖండించి, ఆ వివక్ష అంతానికి జరిగే పోరాటానికి మద్దతు కూడగట్టడానికి సీతారాం తన వంతు కృషి చేశాడు. వేదాల్లో చెప్పబడ్డాయనే పేరిట అగ్రకులం - నిమ్నకులం, సవర్ణులు - అవర్ణులు, స్పృశ్యులు, అస్పృశ్యులు అని ప్రజలను శతాబ్దాలుగా వివక్షకు గురిచేసారు. స్వాతంత్ర్యం సముపార్జించిన 77 ఏళ్ల తర్వాత కూడా ఈ సమస్య కొనసాగుతోంది. ఆధిపత్య కులాలు సంకుచితంగా, సామాజిక వారసత్వంగా అనుసరిస్తూ వచ్చిన వివక్ష మూలంగానే దళితులు ఇవాళ ఇంతటి దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారు తప్ప వేరు కాదు. ఇక్కడ 'జాతి' అన్న ఉపమాలంకారానికన్నా 'జాతివివక్ష' అన్న పదాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. 2024 తొలినాళ్లలో సీతారాం ఈ అవగాహనను బహిరంగంగానే ప్రచారం చేశాడు. భారతదేశ సంఘటిత వామపక్ష ఉద్యమం వర్ణంతో పాటు కులాన్ని, మతోన్మాదాన్ని కూడా పీడనకు మూలకారణంగా పరిగణించాలి. 'కమ్యూనలిజం కంబాట్'లో పనిచేస్తున్న మాకు ఈ (జర్నలిస్టు) ప్రయాణం ద్వారా కులతత్వానికి వ్యతిరేకంగా జరగాల్సిన పోరాటాన్ని కూడా మెజారిటీ మతతత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అంతర్భాగం చెయ్యాలన్న లోతైన అవగాహన కలిగింది.

1992-93 నుండి మేం చేపట్టిన అత్యంత ప్రమాదకరమైన పెనుసవాళ్లతో కూడిన పనికి సంబంధించి నేను సీతాతో కలిసి చర్చించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మొదటిగా 'కమ్యూనలిజం కంబాట్' తరపున '92-93' సంవత్సరాల్లో బొంబాయిలో చెలరేగిన మతకలహాల మీద జస్టిస్ శ్రీకృష్ణ కమిషన్ వెలువరించిన నివేదికను అచ్చువేసి అందరికీ అందుబాటు ధరలో ఉండాలనే ఉద్దేశంతో అరవై రూపాయలకే అమ్మాం. స్వాతంత్ర్యానంతరం దేశంలో చోటుచేసుకున్న మతకలహాల సందర్భంగా ప్రభుత్వాలు నియమించిన న్యాయవిచారణ కమిషన్‌లు, కమిటీలు వెలువరించిన నివేదికలు అన్నీ లక్షిత

" పార్టీయేతరులతో పార్టీ అధికారిక పత్రికలో రాయించడానికి సీతారాం సాహసం చేశాడనే చెప్పుకోవాలి. ఆ రకంగా జర్నలిస్టు యాక్టివిస్టులకు - సి.పి.ఐ. (ఎం) కు మధ్యన సుహృద్భావ సంబంధాలు మొదలయ్యాయి. సీతా, రాజేంద్రప్రసాద్, బృందాకారత్ ఈ సంబంధాలను మరింత విస్తృత పరిచి, మరింత పటిష్టం చేశారు. "

ప్రేరేపిత మతహింసకు దారి తీసిన పరిస్థితులు, ఘర్షణల వెనుక ఉన్న శక్తుల గురించి స్పష్టాతిస్పష్టంగా పేర్కొన్నాయి. ఈ కారణంగా ఇవి ఎంతో విలువైన న్యాయపరమైన, రాజకీయపరమైన కార్యాచరణకు ఉపకరించే నివేదికలుగా మనం భావించవచ్చు. ఈ రకమైన మత ఘర్షణలు నివారించడానికి, నిలువరించడానికి ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా ఆ నివేదికలు ఎన్నో విలువైన సిఫార్సులు చేశాయి. 32 ఏళ్లుగా నేను అకడమిక్‌గా, జర్నలిస్టుగా అటువంటి నివేదికలు ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నా వంతు కృషి చేస్తున్నాను. సి.పి.ఐ.(ఎం) అధికారిక పత్రిక 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదక బాధ్యతలు సీతారాం చేపట్టిన తరువాత ఆ పత్రికలో మా వంటి స్వతంత్ర గొంతుకలకు కూడా స్థానం కల్పించాడు. అప్పటి వరకు ఉన్న సంప్రదాయానికి భిన్నంగా పార్టీయేతరులతో పార్టీ అధికారిక పత్రికలో రాయించడానికి సీతారాం సాహసం చేశాడనే చెప్పుకోవాలి. ఆ రకంగా జర్నలిస్టు యాక్టివిస్టులకు – సి.పి.ఐ. (ఎం) కు మధ్యన సుహృద్భావ సంబంధాలు మొదలయ్యాయి. సీతా, రాజేంద్రప్రసాద్, బృందాకారత్ ఈ సంబంధాలను మరింత విస్తృత పరిచి, మరింత పటిష్టం చేశారు. 1993 ఆగస్టు నుండి 2012 నవంబర్ వరకు, మరీ ముఖ్యంగా 2002లో గుజరాత్‌లో జరిగిన నరమేథం నేపథ్యంలో 'సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్' చేపట్టిన అనేక విచారణలు, వెలువరించిన నివేదికలను 'కమ్యూనలిజం కంబాట్'లో ప్రచురించాం. సీతారాం ఈ ప్రచురణలను తన గుండెకు హత్తుకున్నాడు. స్వాతంత్ర్యోద్యమ పోరాట ఫలితంగా రూపొందించుకున్న మార్గదర్శక డాక్యుమెంట్ అనదగ్గ భారత రాజ్యాంగాన్ని పునరుద్ధాటించుకోవాల్సిన అవసరం ఉందని సీతారాం భావించాడు. ధూర్తరాజ్యం, దాని లెక్కలేనన్ని అంగాలతో మేం వీరోచిత పోరాటానికి తలపడినప్పుడు కానీ మేం జైలు పాలయినప్పుడు కానీ సీతారాం బేషరతుగా మాకు కొండంత అండగా నిలిచాడు. ధూర్తరాజ్యంతో మా పోరాటం ఇంకా కొనసాగుతోంది. మేం చేస్తున్న న్యాయపోరాటం గురించి ప్రతి దశలోనూ రాజన్‌తోనో షహమత్ ఆఫీసులోనో, గోల్‌మార్కెట్‌లో ఉన్న కార్యాలయంలోనో సీతారామ్‌ను కలిసి సుదీర్ఘంగా చర్చించాం. మతకలహాల్లో ఆప్తులను, కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులతో 'సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్' ఆధ్వర్యాన మేం ఏర్పాటు చేసిన సమావేశాలకు సీతారామ్‌ను కూడా ఆహ్వానించేవాళ్లం. సీతారాం వాళ్ల ఆర్ద్రమైన కథనాలు విని చలించి పోయేవాడు. 'మీకు తప్పక న్యాయం జరుగుతుంది' అని బాధితుల్లో విశ్వాసం నింపేవాడు. ఇది కేవలం న్యాయం కోసం జరిగే పోరాటం కాదు భారత రాజ్యాంగం నిర్దేశించిన 'ఇండియా' అన్న ఆదర్శ భావనను నిలబెట్టుకోవడానికి చేసే పోరాటం' అని సీతా గ్రహించాడు. ఒక తల్లి కళ్లముందే తన కన్న బిడ్డను ముష్కర మూకలు హత్య చేసిన సంఘటన, కళ్లముందే సోదరిని, కుమార్తెను దుర్మార్గులు మానభంగం చేసిన వికృత ఘటన, ఒక పార్లమెంట్ మాజీసభ్యుడిని ముక్కలు ముక్కలుగా నరికి చంపిన తీరు ఎంత హేయమైన నేరాలు. ఈ సంఘటనల గురించి బాధితులు విచలిత హృదయాలతో వివరిస్తుంటే విని సీతారాం వాళ్ళకు ఓదార్పు మాటలు చెప్పడమే కాదు ఈ న్యాయపోరాటంలో వాళ్లు ఒంటరిపాటుగా లేరన్న మనోధైర్యాన్ని కల్పించాడు. 2012 సెప్టెంబరు 3 తర్వాత నేను జైలు నుండి విడుదలై ఢిల్లీ వెళ్లాను. రాజన్, అతని మిత్రులు షహమత్ ఆఫీసులో మాకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. నేను అక్కడికి చేరుకున్న కొద్దిసేపటికే సి.పి.ఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం తన సతీమణి, నా సాటి జర్నలిస్టు సీమాతో కలిసి వచ్చి నన్ను ఆలింగనం చేసుకుని, సెల్యూట్ చేశాడు. మరికాసేపటికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ మాతో చేరింది. ఇంతమంది ఆత్మీయతకు, అభిమానానికి నేనెంతో పొంగిపోయాను. అహమ్మదాబాద్‌లోని సబర్మతీ మహిళా జైలు బ్యారక్ నెంబర్ 6లో ఉండగా వందలాదిగా ఐద్వా కార్యకర్తలు, నాయకులు, అఖిల భారత అటవీ కార్మికుల సంఘ నాయకులు, కార్యకర్తలు నాకు రాసిన ఉత్తరాలు నాకెంతో బలాన్ని, ఉత్తేజాన్ని ఇచ్చాయి.

రాజ్యాంగం మీదా పార్లమెంటరీ విధి విధానాల మీదా సీతారామ్‌కు గట్టి పట్టు ఉంది. నవ్వుతూ ఆయన మాట్లాడే తీరు మనకు సమయం ఎలా గడిచిపోయిందో తెలియనివ్వదు. మనలో గూడు కట్టుకున్న భారాలు తేలిపోతాయి. రేపటి రోజు గురించి ఆశావహ దృక్పథం కలుగుతుంది. చరిత్ర, సంస్కృతి పట్ల సీతారామ్‌కు అవగాహన, మాటలకు చేతలకు పూర్తిగా పొంతన ఉండే ఆయన కార్యశీలత, స్నేహపూర్వకంగా, కామ్రేడరీగా ఆయన మాట్లాడే తీరూ ఎవరినైనా ఇట్టే కట్టిపడేస్తాయి.

మనకు అత్యంత ఆప్తులు దూరమైన సందర్భాల్లో మనకు మాటలు కూడా కరువవుతాయి. దిగ్భ్రాంతి నుండి, నమ్మలేని నిజం నుండి తేరుకోవడానికి మన వేదనను సామూహికంగా పంచుకోవడం ఒక్కటే మార్గం. అందుకే సెప్టెంబరు 13, 14 తేదీల్లో ఢిల్లీలోనే చూసిన కొన్ని దృశ్యాలను మీతో పంచుకుంటాను.

మెహబూబ్‌ఖాన్ దర్శకత్వంలో దిలీప్‌కుమార్, నర్గీస్, రాజకపూర్ నటించిన మజ్రూహ్ సుల్తాన్‌పురి సంగీతం అందించిన 1949 నాటి హిందీ చలనచిత్రం 'అందాజ్' పోస్టర్ వెనుక గోడకు వేలాడుతూ ఉంది. దాని ఎదురుగా సీతారాం పార్థివ శరీరం ఉన్నది. ముదురు ఎరుపు రంగు గోడకి తగిలించి ఉన్న ఈ పోస్టర్‌ను కమ్యూనిస్టు సహచరుడు, తన జీవిత భాగస్వామి సీతారామ్‌కు ప్రేమకానుకగా సీమా చిస్తీ అందించింది. ప్రసాద్ – చోప్రా – చతుర్వేదిల కుటుంబ సభ్యులైన కనిష్క, వెర్టికా ఏరి కోరి తెచ్చి అలంకరించిన పూమాలల పరిమళంలో ఏదో తెలియని విషాదం ఇమిడి ఉంది. సీతారాం కూతురు అఖిల, అల్లుడు డానిష్, కోడలు స్వాతి సందర్శకులకు టీ అందిస్తున్నారు. సీమా దగ్గర కూర్చుని వేం మా జ్ఞాపకాలు

కలబోసుకుంటున్నాం. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తదితర రాజకీయ ఉద్దండులు (పాలకపక్షం సహా) వచ్చి సీతారామ్‌కు నివాళులు అర్పించారు. సీతారామ్‌ను ఎయిమ్స్‌లో చేర్చిన నాటి నుండి బృందాకారత్ సీమా వెన్నంటే ఉంది. ఎవరు మాట్లాడినా సీతారాం మరణం నమ్మశక్యంగా లేదన్నవారే.

మరునటి రోజున సీతారాం భౌతికకాయాన్ని ప్రజా సందర్శనార్థం పార్టీ ఆఫీసులో ఉంచారు. ఇక్కడికి అనేకమంది రాజకీయవేత్తలు, మేధావులు వచ్చి సీతారామ్‌కు ఘనంగా నివాళులు అర్పించి, మాది వసుధైక కుటుంబం అని చాటిచెప్పారు. ఉదయం నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు వందల, వేలమంది సీతారామ్‌కు జోహార్లు అర్పించడానికి వచ్చారు. 3 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయం అయిన ఎ.కె.గోపాలన్ భవన్ నుండి ఎయిమ్స్‌కు సీతారాం భౌతికకాయాన్ని ప్రదర్శనగా తరలించారు. దాదాపు పాతికవేల మంది ఆ ప్రదర్శనలో పాల్గొన్నారు. పార్టీతో అనుబంధం లేనివారు సహా ఈ ప్రదర్శనలో గణనీయమైన సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన రాష్ట్ర, జిల్లా కమిటీల సభ్యులు మార్క్సిస్టు పార్టీని అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సరసన నిలబెట్టడంలో, దేశ రాజకీయాల్లో విస్మరించలేని శక్తిగా నిర్మించడంలో సీతారాం కృషి గురించి మాట్లాడుకుంటూ ఉన్నారు. సీతారాం తన మాతృభాష తెలుగు మాట్లాడినట్లు బెంగాలీ, మళయాళం, ఉర్దూ, హిందీ భాషల్లో మాట్లాడగలడు. ఇక తను ఇంగ్లీషులో మాట్లాడుతుంటే ఎంత వినసొంపుగా ఉంటుందో. బహుభాషా కోవిదుడైన ఈ అఖిల భారత నాయకుడు పార్టీ నిర్మాణంలో ఉన్న ఆడా మగా అందరికీ అందుబాటులో ఉండేవాడు. గోల్ మార్కెట్‌లో పార్టీ కార్యాలయం వెలుపల వేసిన షామియానాలో ఎర్రటి ఎండ మూలంగా వేసిన ఉక్కపోతలో కూడా వందలాది మంది అభిమానులు తమ ప్రియతమ నాయకుడికి నివాళులు అర్పించడానికి ఓపికతో వేచి ఉండడానికి కారణం ఇదే. సీతారాం ప్రాణసమాన మిత్రులు మురళీధర్, ఎస్.ఎన్.ఎన్.కె. శర్మలు కాస్త దూరంగా నిలబడి ఉన్నారు. అనుకోకుండా ఎదురయిన ఈ విషాద సంఘటన నుండి వాళ్ళింకా తేరుకోలేదని వాళ్ల మొహాలు చూస్తేనే తెలిసిపోతుంది. సీతారాం కొడుకు డానిష్ పార్టీ ఆఫీస్‌లో సీతారాం ఉండే గదికి వెళ్లి నివాళులు అర్పించి వచ్చాడు.

" పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన హరికిషన్‌సింగ్ సుర్జీత్ ఏకాభిప్రాయ సాధనకు కావల్సిన మెళకువలు, నేర్పరితనం సీతారామ్‌కు వారసత్వంగా అందించి వెళ్లాడు అనిపిస్తుంది. భారతదేశం ఎంత విశాలమైనదో అంత వైవిధ్యత గలది. అయినప్పటికీ ఈ దేశాన్ని ఒక్కటిగా కలిపి, నిలిపి ఉంచే బంధాలెన్నో ఉన్నాయి. స్వాతంత్ర్య కాంక్ష ఒకప్పుడు దేశ ప్రజానీకం యావత్తును కలిపి ఉంచిన బంధం. "

సీమాతో సీతారాం గడిపిన కుటుంబ జీవితం అర్థవంతమైనది. ప్రేమాస్పదమైనది. సీతారాం నిబద్ధత గల కమ్యూనిస్టు సిద్ధాంతవేత్త. భారతదేశ రాజకీయాల్లో, సంకీర్ణాల్లో ఉండే శషభిషలు, వైవిధ్యాల గురించి లోతైన అవగాహన ఉన్న ఆచరణాత్మకవాది. సంకీర్ణ రాజకీయాల అనివార్యతను దృష్టిలో ఉంచుకుని వాటిని ఆచరణ సాధ్యం కావించిన నేర్పరి. పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన హరికిషన్‌సింగ్ సుర్జీత్ ఏకాభిప్రాయ సాధనకు కావల్సిన మెళకువలు, నేర్పరితనం సీతారామ్‌కు వారసత్వంగా అందించి వెళ్లాడు అనిపిస్తుంది. భారతదేశం ఎంత విశాలమైనదో అంత వైవిధ్యత గలది. అయినప్పటికీ ఈ దేశాన్ని ఒక్కటిగా కలిపి, నిలిపి ఉంచే బంధాలెన్నో ఉన్నాయి. స్వాతంత్ర్య కాంక్ష ఒకప్పుడు దేశ ప్రజానీకం యావత్తును కలిపి ఉంచిన బంధం. ఈ ఉమ్మడి లక్ష్యంతోపాటు కుల, మత, లింగ వివక్షలకు వ్యతిరేకంగా కూడా పోరాటాలు సాగాయి. కులంతోపాటు, సాంకేతికాభివృద్ధిలో కూడా మార్పులు వచ్చిన ఈ ఆధునిక యుగంలో ఒక ఉమ్మడి లక్ష్యంతోపాటు అన్నిరకాల వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా జమిలి పోరాటం సాగించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది. గతకాలపు అనుభవాల నుండి నేర్చుకున్న గుణపాఠాలతోపాటు యువతరానికి దగ్గరయ్యే విధంగా భావవినిమయం చెయ్యగల నేర్పు సీతారామ్‌కు మెండుగా ఉంది. మనమంతా దానిని అలవర్చుకోవాలి.

సెప్టెంబరు 12 గడిచిపోయింది. సీమా, సీతల ఆలోచనలతోనే నా రోజులు భారంగా గడుస్తున్నాయి. మనసుని కలిచివేస్తున్న ఏదో తీరని వేదన. 2021 ఏప్రిల్ 22న ఆ కుటుంబానికి పెద్దకొడుకు ఆషిష్ (భికూ) ను కోవిడ్ కబళించింది. స్వాతి, ఇంద్రాణి మజుందార్, సీమా, అఖిల, డానిష్ ఈ తీవ్ర విషాదాన్ని ఎంతో నిబ్బరంగా ఎదుర్కొన్నారు. సెప్టెంబరు 13,14 తేదీల్లో కూడా సీతారామ్‌ను కోల్పోయిన ఈ కుటుంబం అంత నిబ్బరంగా ఉండడానికి ఎంతగానో పెనుగులాడుతోంది. 'భికూని సీతారామ్‌లో చూసుకునేవాళ్లం. ఇప్పుడు తనూ లేకుండా పోయాడు' అని ఇంద్రాణి అన్నమాటతో ఒక్కసారిగా అందరి దుఃఖం కట్టలు తెంచుకుంది.

వృత్తిపరంగా నా సహోద్యోగి, స్నేహితురాలు సీమాకు ఇది తీరని లోటే. అయినా గుండె నిబ్బరంతో ఈ విషాదాన్ని అధిగమిస్తుందని ఆశిస్తున్నా, ముగ్గురు పిల్లలతో తనకు ఉన్న ప్రేమలు, అనుబంధాలే తనని ఈ విషాదం నుండి తేరుకునేలా చేస్తాయనే నమ్మకం నాకు ఉంది.

సుందర్ నర్సరీలో భికూ జ్ఞాపకార్థం రెండు బల్లలు అంకితం ఇచ్చారు. ఒకదాని మీద 'ప్రియమైన భికూ(అషిష్ ఏచూరి) మమ్మల్ని ఒంటరి చేసి వెళ్లిపోయావ్. నీ కెమెరాలో బంధించిన ఋతువులను, కాలాన్ని నీ చమత్కారమైన స్పర్శని మాకు మిగిల్చి వెళ్లావు' అన్న మాటలు చెక్కి ఉంటాయి. రెండో బెంచి కూడా అషిష్ ఏచూరికే అంకితం ఇచ్చారు. దానిమీద నైజీరియా కవయిత్రి ఎల్లోమా ఉమ్‌బెన్నో కవితా పాదాలు చెక్కి ఉంటాయి. 'అయితే, నువ్వు కూడా ఇంటికి పరాయి వాడివి అయిపోయావ్. ఇక్కడ ఇంకా పరాయివి. కాని అక్కడా, ఇక్కడా ఎవరూ మరువలేని వాడివి'

ఇప్పుడు నా మదిలో మెదిలే ప్రశ్న ఒక్కటే. దేశంలోను, ప్రపంచ దేశాల్లోనూ, ముందుగా ఢిల్లీలో కామ్రేడ్ సీతారాం ఏచూరి స్మృత్యర్థం ఎన్ని బెంచీలు వెలుస్తాయో అని. సీతారాం మనల్ని అందరినీ ఇంత తొందరగా విడిచిపెట్టి వెళ్లినా ఆయన నడయాడిన నేల మీద, తిరిగి ప్రతి ఊరిలోనూ, ప్రతి పట్టణంలోనూ సీతారాం జ్ఞాపకాలను ఈ రకంగా అయినా మనం పదిల పరుచుకోవద్దూ...!


(అనువాదం : కె.సత్యరంజన్)

అధ్యయనం

## ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాల్లో

# వలస కార్మికులను దోపిడీ చేస్తున్న పద్ధతులు

**ఎన్ పురేంద్రప్రసాద్**



రచయిత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ సోషియాలజీ విభాగాధిపతి

ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలలోనూ కార్మికుల వలసలకు దారితీస్తున్న భిన్నమైన కారణాలను ఈ పత్రం వివరిస్తుంది. ఒకటి, వ్యవసాయ, వ్యవసాయేతర వృత్తులలో ఉన్న కార్మికులను పెద్దసంఖ్యలో వృత్తులకు దూరం చేస్తూ రాష్ట్ర నూతన రాజధాని అమరావతి నగర నిర్మాణం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా ప్రాంతం చేపల పెంపక కేంద్రంగా మారి, వలస కార్మికులను తయారు చేస్తున్నది. రెండవది, అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే మందుల పరిశ్రమలు, ప్రత్యేక ఆర్థికమండళ్ళ (ఎస్ఇజెడ్స్) బాక్సైట్ తవ్వకాలు, ఉత్తరాంధ్రలో మత్స్యకారులు, వ్యవసాయం, ఇతర రంగాలపై ఆధారపడిన కార్మికుల పర్యావరణ, సామాజిక జీవితాలను అణు, తాప విద్యుత్ కేంద్రాలు దెబ్బతీశాయి. మూడవది, రాయలసీమలో వరుసగా సంభవిస్తున్న కరువులు, సోలార్, విండ్ విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర ఎస్ఇజెడ్‌లు నూతన తరహా వలస కార్మికులను, దోపిడీ పద్ధతులను సృష్టిస్తున్నాయి. ప్రతి ప్రాంతంలోనూ వర్గాలు, కులాలు, స్త్రీ– పురుషుల మధ్య అసమానతలు తీవ్రం కావటానికి నయా ఉదారవాద పెట్టుబడిదారి అభివృద్ధి నమూనా దారితీసిందని ఈ మార్పులను విశ్లేషిస్తూ చేసిన అధ్యయనం స్పష్టం చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌ను 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విభజించారు. రాజధాని అయిన హైదరాబాద్ తెలంగాణకు పోవటంతో మూడు ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, నూతన రాజధానిగా అమరావతిని నిర్మించుకొనే ప్రయత్నంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నది. కాబట్టి నూతన రాజధాని నగరం అమరావతి, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, విద్యుత్ కేంద్రాలు (పవన, తాప, అణు, సోలార్), ఫార్మాసిటీలు, విమానాశ్రయాలు, లోహాలను తవ్వితీయటం, కొత్త ఓడరేవులు, ఐటిపార్కులు, ఇతర వాణిజ్య, నివాస ప్రాజెక్టుల కోసం మూడు ప్రాంతాల (ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమ) లోనూ భారీగా భూ సేకరణ చేస్తున్నారు. దీనితో పాటు వ్యవసాయాదాయాలు తగ్గిపోవటం, తీవ్ర మైన కరువులు రావటంతో పాటు అభివృద్ధి కోసం జరుగుతున్న, పారిశ్రామిక కార్యకలాపాలలో ఏ ప్రాంతంలోనూ స్థానిక కార్మికుల చేత పనిచేయించటం లేదు. అందువలన పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కార్మికులు అసంఘటిత రంగంలోని కొన్ని విభాగాలలో పని చేయాల్సి వస్తున్నది. ఇది ప్రమాదకరమైన, అభద్రతతో కూడిన, చిన్న మార్పులు వచ్చినా ఎదుర్కోలేని పరిస్థితులను కల్పిస్తున్నది. ఇటువంటి క్లిష్టమైన పరిస్థితుల వలన పెద్దసంఖ్యలో కార్మికులు వలసలు పోవాల్సి వస్తున్నది. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలసలు పోయే కార్మికులను వివిధ రూపాలలో తీవ్రంగా దోపిడి చేస్తున్నారు. వివిధ తరగతులకు చెందిన రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వర్గాల ప్రజానీకం బలవంతంగా వలసలు పోక తప్పని పరిస్థితులను కల్పిస్తున్న విధానాలను ఈ పత్రంలో విశ్లేషించి, ఆ వివరాలను మూడు భాగాలుగా పొందిపరిచాను.

ఈ పత్రంలో పొందుపరిచిన వివరాలను సేకరించటం కోసం రాజధాని నగరం అమరావతి ప్రాంతంలోని కొన్ని గ్రామాలు, చేపల పెంపకానికి సంబంధించి దక్షిణ ఆంధ్ర కోస్తాలోని కొన్ని ప్రాంతాలు, ఉత్తర ఆంధ్ర కోస్తాలోని శ్రీకాకుళం, విశాఖపట్టణం, విజయనగరం, రాయలసీమలోని అనంతపురం జిల్లాలలో విస్తృతంగా పర్యటించాం. నిర్దేశిత విభాగానికి చెందిన వారితో (గ్రూపు చర్చలు, రైతులలోని వివిధ తరగతులు, కార్మికులు, వివిధ జిల్లాలలోని రాజకీయ నాయకులతో ఇంటర్వ్యూల ద్వారా ప్రాథమిక సమాచారాన్ని సేకరించాను.

**1వ భాగం**


నూతన రాజధాని అమరావతి నగరం నిర్మించటం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన భూ సమీకరణ విధానం, పెరుగుతున్న చేపల చెరువులు, ప్రాసెసింగ్ పరిశ్రమలు దక్షిణ కోస్తా ఆంధ్రలో వలస కార్మిక సైన్యాన్ని ఏ విధంగా తయారు చేశాయో ఈ భాగంలో విశ్లేషించటం జరిగింది. కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. 29 గ్రామాలలో భూ సమీకరణ ద్వారా సేకరించిన 50,000 ఎకరాలలో నూతన రాజధాని నగరం అమరావతి నిర్మిస్తున్నారు. విజయవాడ, గుంటూరు జిల్లాల మధ్య గల కృష్ణానది కరకట్టకు ఆనుకొని ఈ గ్రామాలు ఉన్నాయి. సారవంతమైన ఇంత ఎక్కువ వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చటం ఇంతకు ముందెప్పుడూ జరగలేదు. వ్యవసాయం చేయని భూస్వాములు, వ్యవసాయం చేయని కుటుంబాలు, ధనికరైతుల చేతులలో దక్షిణ కోస్తా ఆంధ్రలో వ్యవసాయ భూమి ఉన్నది. వ్యవసాయం చేయటం కన్నా భవిష్యత్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వచ్చే అధిక ధరలను దృష్టిలో పెట్టుకొని వీరు ముందుగానే భూములు కొన్నారు (వంశి వి, పురేంద్రప్రసాద్ 2017). ఒకవైపున భూ సమీకరణ ద్వారా భూములు

సేకరించటం, మరోవైపున పెద్ద భూఖండాలను దీర్ఘకాలిక లీజుకు ఇస్తామని పెట్టుబడిదారులను ఆకర్షించటం ద్వారా రాజధాని నగర నిర్మాణానికి నిధులు సమీకరించటం ప్రభుత్వ వ్యూహంగా కనిపిస్తున్నది. రాజధాని అమరావతి అని స్పష్టం కాగానే భూముల ధరలు అమాంతంగా 500 శాతం వరకు పెరిగాయి. ఇది భూములున్న, భూమిలేని వర్గాల మధ్య అంతరాన్ని మరింతగా పెంచింది. పక్కన ఉన్న ప్రాంతాలతో పోలిస్తే సరుకులు, సేవల ధరలు 20 నుండి 30 శాతం అదనంగా పెరిగాయి (రెడ్డిం ఎ 2017).

భూ యజమానులు సమంజసమైన పరిహార ప్యాకేజిని పొందారు. కాని భూమిలేని వ్యవసాయ కార్మికులకు మాత్రం కుటుంబానికి నెలకు 2,500 రూపాయలు మాత్రమే ఇస్తామని వాగ్దానం చేశారు. భూ సమీకరణ తర్వాత చిన్న రైతులు, ప్రభుత్వం నుండి అసైన్డ్ భూములు పొందిన వారు, కౌలురైతులు, భూమిలేని కార్మికులు, చేతివృత్తులు, చిన్న వ్యాపారాలు చేసుకొనే వారి పరిస్థితి ఏమిటి? రైతులలో కొద్దిమంది రాజధాని నగర ప్రాంతంలో అమ్మిన భూమి ద్వారా వచ్చిన డబ్బును వెంటనే పక్క జిల్లాలలో పెట్టుబడిగా పెట్టారు. కాని రైతులలో అత్యధికులు ఈ విధంగా చేయలేదు. అక్కడ రూపుదిద్దుకుంటున్న నూతన ఆర్థికవ్యవస్థలో తమ శ్రమ ఏ విధంగా ఉపయోగపడుతుందన్న దానిపై వారికి స్పష్టత లేదు. రెండవ అంశం, తుళ్ళూరు మండలం(రాజధాని నగరంలో కీలక ప్రాంతం) నుండి వచ్చిన అంచనాల ప్రకారం అక్కడ 30,000 మంది కౌలు రైతులు, 60,000 మంది వ్యవసాయ కార్మికులు, అనేక సాంప్రదాయక వృత్తులు చేసే వృత్తిదారులు, వ్యవసాయేతర కార్మికులు, చిన్న వ్యాపారులు ఉండగా, భూ యజమానులు 5,000 మంది ఉన్నారు. కార్మికులలో అత్యధికులు షెడ్యూలు కులాలు (ఎస్‌సి), షెడ్యూలు తరగతులు (ఎస్‌టి), ఇతర వెనుకబడిన తరగతుల(ఒబిసి)కు చెందినవారు ఈ ప్రాంతంలో పెద్ద కార్మికసైన్యంగా ఉన్నారు. అభివృద్ధి క్రమంలో తమకు ఉపాధి దొరుకుతుందనే ఆశతో వీరు ఉన్నారు.

ఈ ప్రాంతంలో ఉన్న కౌలురైతులు ఇప్పటికే తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. రాజధాని నగరం బయటిప్రాంతంలో భూములను కౌలుకు తీసుకోవటానికి వెళ్ళటం వలన అక్కడ కౌలురేట్లు 20 శాతం పెరిగాయని చర్చల సందర్భంలో తెలిపారు. గత దశాబ్దంలో కోస్తా ఆంధ్రలో కౌలుదారీ విధానం 75 శాతంకు పెరగటం వలన ఇది ఆశ్చర్యం కలిగించదు. గుంటూరు జిల్లాలో 2015, సెప్టెంబరులో జరిగిన ఐదు ఆత్మహత్యలు కౌలురైతులవే కావటం వారి దయనీయమైన పరిస్థితిని వెల్లడిస్తున్నది.

**“ కౌలురైతులు ఇప్పటికే తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. రాజధాని నగరం బయటిప్రాంతంలో భూములను కౌలుకు తీసుకోవటానికి వెళ్ళటం వలన అక్కడ కౌలురేట్లు 20 శాతం పెరిగాయని చర్చల సందర్భంలో తెలిపారు. గత దశాబ్దంలో కోస్తా ఆంధ్రలో కౌలుదారీ విధానం 75 శాతంకు పెరగటం వలన ఇది ఆశ్చర్యం కలిగించదు. గుంటూరు జిల్లాలో 2015, సెప్టెంబరులో జరిగిన ఐదు ఆత్మహత్యలు కౌలురైతులవే కావటం వారి దయనీయమైన పరిస్థితిని వెల్లడిస్తున్నది. ”**




పేదలను తొలగించకుండా 7.50 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వం చెబుతున్నది. వాస్తవంలో అత్యంత నిరుపేదలుగా ఉన్నవారికి కేటాయించిన భూములను ప్రజావసరాల పేరుతో తిరిగి స్వాధీనం చేసుకోటానికి వీలు కల్పించేలా 1977అసైన్‌మెంట్ చట్టానికి ప్రభుత్వం యాక్ట్ 9 సవరణను తీసుకువచ్చి, భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నది. ప్రజావసరాల కోసం ఈ భూములను తిరిగి తీసుకుంటామని పేదలకు ఇచ్చిన డి ఫారం పట్టాలోనే పేర్కొనటంతో దీనిని ప్రతిఘటించటానికి అవకాశం ఉండటం లేదు. తమ జీవనం కోసం ప్రభుత్వ భూములపై ఆధారపడిన పేదలు వాటిని వదిలి వెళ్ళటం మినహా గత్యంతరం ఉండటం లేదని 2007లో బాలగోపాల్ చెప్పాడు. ప్రభుత్వం పట్టా లేక లీజుకు ఇవ్వకపోయినా అనేకమంది ప్రభుత్వ భూములలో గొర్రెలు, మేకల కోసం గడ్డి పెంచటం, క్వారీ తవ్వటం, కల్లు తీయటం, చేపలు పట్టటం తదితరాలు చేస్తున్నారు. బలవంతంగా భూమిని స్వాధీనం చేసుకోవటానికి ప్రభుత్వం తీసుకొనే ప్రతి చర్యా నిర్వాసితుల కష్టాలను మరింతగా పెంచుతున్నది. అసైన్డ్ భూములు పొందిన వారిలో అత్యధికులుగా ఉన్న దళితులు, గిరిజనులను భూముల నుండి తొలగించటం వారిపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తున్నది. పేదలను భూముల నుండి బలవంతంగా తొలగించటం వలన రానున్న సంవత్సరాలలో సంభవించే పరిణామాలను అర్థం చేసుకోవటానికి రాజధాని నగరం అమరావతి అతి పెద్ద ఉదాహరణగా ఉన్నది. ప్రజలను వారి జీవనాధారాల నుండి బలవంతంగా తొలగించి, ఏ హక్కులు, రక్షణలు లేకుండా వారిని కార్మికులుగా శ్రామిక మార్కెట్‌లోకి విసిరివేయటం అత్యంత హింసాత్మకంగా జరుగుతుందని మార్క్స్ పేర్కొన్నాడు (గిడ్డెన్స్ ఎ 1994).

వరదలకు గురయ్యే ప్రాంతంగా ఉన్న అమరావతిలో త్వరలోనే క్యాసినోలు, రిసార్టులు, రాష్ట్ర సచివాలయం, ఇతరాలు వస్తాయని ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పర్యావరణ ఉద్యమకారుడు పేర్కొన్నాడు.

> **2014-15 నుండి ఆక్వాసాగు విపరీతంగా పెరగటంతో పాల ఉత్పత్తి రెండవ స్థానానికి పడిపోయింది (ఎ పి కమిటి 2017). కొబ్బరికాయల ఉత్పత్తి కూడా బాగా తగ్గిపోయింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 2012-13లో హెక్టారుకు 19,869 కాయల దిగుబడి రాగా తర్వాత 13,576కు పడిపోయింది. కృష్ణాజిల్లాలో 16,744 నుండి 14,671కి తగ్గింది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలలో 2,22,637 ఎకరాలకు సాగునీరు అందించే మంచినీటి చెరువు కొల్లేరు ఆక్వాసాగు వలన కలుషితం అయింది.**

అమరావతి నగర విస్తీర్ణం 216 చదరపు కిలోమీటర్లలో 1, 2 దశలలో నిర్మించనున్న 35 చదరపు కిలోమీటర్లు వరదలకు గురవుతుంటుంది. ఈ విధంగా నగరాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించటం, దానితో భూములు అధిక విలువ కలిగిన వాణిజ్య సరుకుగా మారటం ప్రజలలో కొందరిని సామాజికంగా దిగువస్థాయికి నెట్టటంలో నూతన పద్ధతులకు దారితీస్తుందని, సమాజంలో, నగరాలలో బేరసారాలు చేయటానికి వలస కార్మికులకు ఉన్న శక్తిని హరించివేస్తుందని 2016 లో రణబీర్ సమద్దార్ వ్యాఖ్యానించాడు. అమరావతి నగర నిర్మాణం ప్రారంభంలో ఉండటం వలన సమీప భవిష్యత్‌లో ఈ పరిణామాలు ఎటువంటి మార్పులకు దారి తీస్తాయన్నది వేచి చూడాలి.

ఇక ఈ ప్రాంతంలో చేపల పెంపకాన్ని పరిశీలిద్దాం. దేశంలో చెరువులలో పెంచే చేపలు, రొయ్యలలో 70 శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయి. దీనిలో ఎ పి దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో 974 కిలోమీటర్ల పొడవున సముద్రతీరం ఉన్నది. 97 లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. దానిలో 7 లక్షల ఎకరాలలో (7.5 శాతం) చేపలు, రొయ్యలు పెంచుతున్నారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాలలో గత 20-30 సంవత్సరాల నుండి చేపలు, రొయ్యల చెరువులు తవ్వుతున్నారు. గతంలో పెద్దమొత్తంలో నష్టాలు రావటంతో రైతులకు ఆసక్తి తగ్గింది. కాని గత మూడు సంవత్సరాల నుండి కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలలో తిరిగి చేపలు, రొయ్యలను పండించటం పెరిగింది. 2016 అక్టోబరు నాటికి 2,36,482 ఎకరాలు ఆక్వా సాగు కింద రిజిష్టరైనట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వేలో వెల్లడైంది (ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, 2017). మరొక 4,15,908 ఎకరాలలో కూడా రిజిష్టర్ చేయకుండా ఆక్వాసాగు చేస్తున్నారు. మొత్తం కలిపి 7 లక్షల ఎకరాలలో ఆక్వా సాగు చేస్తున్నారు. పంటలు పండించటం లేదని రికార్డులలో నమోదు చేయిస్తూ, ఆ భూములను ఆక్వాసాగులోకి మార్చటం కోసం రైతులు కుతంత్రాలకు పాల్పడుతున్నారు. దళితుల ఆధీనంలోని వేలాది ఎకరాల అసైన్డ్ భూములను ఆక్వా రైతులు ఆక్రమించుకున్నారు. ఉదాహరణకు నందివాడ మండలంలోని ఇలవర్రు గ్రామంలో 165 ఎకరాలు ఆక్రమించుకున్నారు. సాధారణంగా ఆక్వారైతులు రొయ్యలు పండించటం కోసం 10 ఎకరాలకు అనుమతి తీసుకుంటారు. కాని అసైన్డ్ భూములు, ప్రభుత్వభూములు, మురుగు కాల్వలను ఆక్రమించుకొని సాగు చేస్తుంటారు. కృష్ణాజిల్లాలోనే 28,000 ఎకరాలను ఆక్రమించారంటే ఈ దురాక్రమణ ఏ స్థాయిలో ఉందో అర్ధం చేసుకోవచ్చు.

గత దశాబ్దంలో దక్షిణ కోస్తా ఆంధ్రలో కౌలుదారి విధానం అత్యధికంగా ఉన్నట్లు నమోదైంది (పురేంద్ర ప్రసాద్ 2015). ఆక్వాసాగు ఉచ్ఛస్థితిలో ఉండటంతో సాగు చేయని భూ యజమానులు భూములను వ్యవసాయం కోసం కౌలురైతులకు ఇవ్వకుండా, ఆక్వాసాగు కోసం ఇస్తున్నారు. ఆక్వాసాగుకు చిన్న, సన్నకారు రైతుల నుండి భూములను తీసుకోవటం పెరగటంతో, రివర్స్ కౌలు విధానం కూడా పెరుగుతున్నది. కొద్దిమంది తమ భూములను అమ్ముకొంటున్నారు. ఈక్రమంలో చిన్న, సన్నకారు రైతులను, కౌలుదారులను భూముల నుండి తొలగించటంతో వారు వలసలు పోవటం మినహా గత్యంతరం లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆక్వాసాగు జరగని మండలాలతో పోల్చుకుంటే ఆక్వాసాగు జరుగుతున్న మండలాలలోని గ్రామాల నుండి ఎక్కువ మంది వలసలు పోతున్నారు. ఆక్వాసాగు చేస్తున్న రైతుల ఆదాయాలు బాగా పెరగటంతో వారు తమ నివాసాలను సమీపంలోని పట్టణాలకు మార్చుకుంటున్నారు. వారి పిల్లలు ఆక్వాకు సంబంధించిన మేత, ప్రాసెసింగ్, రవాణా తదితర వ్యాపారాలు చేస్తున్నారు. ఆక్వా సాగుదారులు, ఇతర తరగతుల మధ్య అసమానతలు, అంతరాలు పెరుగుతున్నాయి.

2014-15 నుండి ఆక్వాసాగు విపరీతంగా పెరగటంతో పాల ఉత్పత్తి రెండవ స్థానానికి పడిపోయింది (ఎ పి కమిటి 2017). కొబ్బరికాయల ఉత్పత్తి కూడా బాగా తగ్గిపోయింది. ఉదాహరణకు పశ్చిమ గోదావరి జిల్లాలో 2012-13లో హెక్టారుకు 19,869 కాయల దిగుబడి రాగా తర్వాత 13,576కు పడిపోయింది. కృష్ణాజిల్లాలో 16,744 నుండి 14,671కి తగ్గింది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలలో 2,22,637 ఎకరాలకు సాగునీరు అందించే మంచినీటి చెరువు కొల్లేరు ఆక్వాసాగు వలన కలుషితం అయింది.

ప్రజల జీవనోపాధులను ఆక్వాసాగు తీవ్రంగా దెబ్బతీసింది. రొయ్యలను పండించే చెరువులలోని మురుగునీటిని శుద్ధి చేసిన తర్వాతే మురుగు కాల్వలలోకి వదలాలి. కాని అలా చేయకపోవటంతో ఆ నీటిలోని రసాయనాలు, వ్యర్థాలు నీటి వనరులను కలుషితం చేస్తున్నాయి. రొయ్యల చెరువుల యజమానులు దిగుబడిని పెంచటం కోసం ఎక్కువ శక్తి కలిగిన రసాయనాలు వాడటం, నీటిని ఉప్పునీరుగా మార్చటానికి టన్నుల కొద్ది ఉప్పును వినియోగిస్తుండటంతో చెరువులకు సమీపంలో ఉన్న వ్యవసాయ భూములు, నీటి వనరులు కలుషితం అవుతున్నాయి. ఆక్వాసాగు విస్తరించటంతో దక్షణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామాలలో మంచినీటి కొరత ఏర్పడుతున్నది. మురుగుకాల్వలను పూడ్చివేశారు. కాలువలు, ఇతర మంచినీటి వనరులలో కలుషితమైన నీరు కలవటంతో అవి కూడా కలుషితం అవుతున్నాయి. గ్రామాలలోని మంచినీటి చెరువులు కలుషితం కావటంతో ప్రతి కుటుంబం నెలకు 600 నుండి 1,000 రూపాయల వరకు ఖర్చుపెట్టి మంచినీరు కొనాల్సివస్తున్నది. చర్మ, శ్వాసకోశ, జీర్ణకోశ, నరాలకు సంబంధించిన వ్యాధులు పెరగటంతో ఆరోగ్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు. పశువుల ఆరోగ్యం కూడా తీవ్రంగా దెబ్బతినటంతో పాల ఉత్పత్తి పడిపోయింది.

ప్రాసెసింగ్ యూనిట్లలో కూలీలు

రొయ్యల తల, తోక తీసి శుభ్రం చేయటం, రసాయనాలు, ఉప్పు కలిపి బాక్సులలో ప్యాక్ చేయటం తదితర పనులు చేస్తున్నారు. ఎక్కువ ప్రాసెసింగ్ పరిశ్రమలలో స్థానికులతో పని చేయించకుండా, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వారితో పనులు చేయిస్తున్నారు. ప్రాసెసింగ్ పరిశ్రమలలో మహిళలు అమ్మోనియా, క్లోరైడ్, ఇతర విషపూరితమైన వాయువుల మధ్య, 8 డిగ్రీల సెంటిగ్రేడ్ మాత్రమే ఉన్న వేడిలో కనీసం 12 గంటలకు తగ్గకుండా పని చేస్తున్నారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం చేతులకు గ్లౌజులు, కాళ్ళకు గమ్ బూట్లు ఇవ్వటం లేదు. కూలీలకు కనీస వేతనాలు, ప్రావిడెంట్ ఫండ్, ప్రమాదాలు జరిగినపుడు, సెలవు దినాలలో ఆర్థిక సహాయం తదితరాలను ఇవ్వటం లేదు. ఆక్వా పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినట్లు నివేదికలు ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులోని ఆక్వా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు కార్మికులు చనిపోయారు. తూర్పు గోదావరి జిల్లా నెక్కంటి సి ఫుడ్ ఫార్మ్‌లో అమ్మోనియా గ్యాస్ లీక్ కావటంతో 70 మంది తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. కరవ మండలంలోని గురజనపల్లి గ్రామంలోని వీరభద్ర రొయ్యల పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 30 మంది కార్మికులు గాయపడ్డారు. కార్మికులకు ఎగ్జిమా, చర్మరోగాలు, శ్వాసకోశ, కండరాలకు సంబంధించిన వ్యాధులు, నడుం, మోకాలి నొప్పులు వస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాల నుండి స్థానికులు ఉపాధిని వెదుక్కొంటూ వలస వెళ్ళటం పెరుగుతున్నది. జల, పర్యావరణ కాలుష్యాల వలన గ్రామాలలో ఉంటున్న వారు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొం టున్నారు.

### 2వ భాగం

ఉత్తర కోస్తా తీరం 340 కిలోమీటర్ల పొడవుంది. 1100 మిల్లీమీటర్ల -మంచి- వర్షపాతం నమోదవుతుంది. అడవులు, సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయి. రాష్ట్రంలో కెల్లా పెద్ద నగరమైన విశాఖపట్టణంలో ఓడరేవులు, ఉక్కుఫ్యాక్టరి, హిందుస్థాన్ షిప్‌యార్డు, నౌకా స్థావరం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, హిందుస్థాన్ జింక్, భారత్ హెవి ప్లేట్స్ అండ్ వెస్సల్స్ లిమిటెడ్ తదితరాలు ఉన్నాయి. నాగావళి, వంశధార, శారద, వరాల, గోసని, చంపావతి, జంఝావతి, బహుద నదులు, ఉపనదులు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఇన్ని వనరులున్నప్పటికీ ఈ ప్రాంతం నుండి ప్రజలు ఎందుకు భారీగా వలసలు పోతున్నారు? ఎందువలన ఎక్కువ వెనుకబడిన ప్రాంతంగా ఉన్నది? ఈ ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించటంతో పాటు గత రెండు దశాబ్దాలలో వలసలతో వచ్చిన దోపిడి రూపాలను కూడా విశదీకరిస్తాను.

“ గత రెండు దశాబ్దాలలో ప్రతిపాదనలకు భిన్నంగా పారిశ్రామికాభివృద్ధి జరిగింది. అచ్చుతాపురం, రాంబిల్లి ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, జవహర్‌నగర్ ఫార్మాసిటి, కొమరాడ, పరవాడ, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, గంగవరం ఓడరేవు, బ్రాండిక్స్ బట్టల తయారి పరిశ్రమ తదితరాల కోసం రైతుల నుండి వేలాది ఎకరాల భూములు తీసుకున్నారు. కొన్ని సెజ్‌లు ప్రారంభమే కాలేదు. ఒప్పందాలలో చేసిన వాగ్దానాలను నెరవేర్చటానికి వారు పూనుకోలేదు. విస్తారంగా అడవులు (11శాతం) ఉన్నాయి. ”

విశాఖపట్టణంలో 1970 దశాబ్దంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వరంగ సంస్థ ఉక్కుఫ్యాక్టరి ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి నమూనాగా ఉన్నది. 1971లో ఉక్కుఫ్యాక్టరి కోసం 64 గ్రామాలకు చెందిన, 25,000 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. 16,500 మంది నిర్వాసితులకు ఆర్-కార్డులు ఇచ్చారు. 1985 నుండి ప్లాంట్ పనిచేయటం ప్రారంభమైంది. మొదటి దశలో ఉక్కుఫ్యాక్టరి కోసం 20,000 మందిని పనిలోకి తీసుకున్నారు. వీరిలో 6,330 మంది నిర్వాసితులు. తర్వాత మరో 2,000 మందిని పనిలోకి తీసుకున్నారు. నిర్వాసితులందరికీ ఉద్యోగం ఇస్తామన్న వాగ్దానాన్ని ఉక్కుఫ్యాక్టరి నెరవేర్చలేక పోయినప్పటికీ, ఈ ప్రాంతంలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని కల్పించింది. స్థానిక ప్రజలలో అభివృద్ధికి నమూనాగా నిలిచిన ఉక్కుఫ్యాక్టరి, ఇతర ప్రభుత్వరంగ సంస్థలు ఈ ప్రాంతంలో అభివృద్ధికి ప్రోత్సాహం ఇస్తున్నాయి. 1990 దశకం తర్వాత మర్చంట్ పవర్‌ప్లాంట్‌లు, అణువిద్యుత్ కేంద్రాలు, ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం, కెమికల్ అండ్ ఫార్మస్యూటికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఎపిపిసిపిఐఆర్), ఫార్మాసిటి, పోర్ట్ డెవలప్‌మెంట్, ఎస్ఇజెడ్‌లు, బాక్సైట్ తవ్వకం తదితరాలను ప్రతిపాదించటంతో తమకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని స్థానిక ప్రజలు భావించారు.

కాని గత రెండు దశాబ్దాలలో ప్రతిపాదనలకు భిన్నంగా పారిశ్రామికాభివృద్ధి జరిగింది. అచ్చుతాపురం, రాంబిల్లి ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, జవహర్‌నగర్ ఫార్మాసిటి, కొమరాడ, పరవాడ, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, గంగవరం ఓడరేవు, బ్రాండిక్స్ బట్టల తయారి పరిశ్రమ తదితరాల కోసం రైతుల నుండి వేలాది ఎకరాల భూములు తీసుకున్నారు. కొన్ని సెజ్‌లు ప్రారంభమే కాలేదు. ఒప్పందాలలో చేసిన వాగ్దానాలను నెరవేర్చటానికి వారు పూనుకోలేదు. విస్తారంగా అడవులు (11శాతం) ఉన్నాయి. ఈ ప్రాంతంలోని భూమి స్వభావాన్ని బట్టి సాగుభూమి చాలా తక్కువగా ఉన్నది. అయినప్పటికీ ఈ పరిమితమైన భూ వనరులను పారిశ్రామికాభివృద్ధి పేరుతో తీసుకోవటాన్ని సమర్ధించుకొంటున్నారు. ఈ ప్రాంతంలోని పరిశ్రమలలోకి కార్మికులను మొదట కాంట్రాక్టు, క్యాజువల్ ప్రాతిపదికన తీసుకున్నారు. తర్వాత బయటి ప్రాంతాల నుండి వచ్చిన వారిని తీసుకోవటంతో ఇక్కడి వారు పనులు వెతుక్కోవటానికి ఇతర చోట్లకు వలస వెళుతున్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఎక్కువ నీటిని వినియోగిస్తాయి. దానితో ఈ ప్రాంతంలో వ్యవసాయానికి నీటి కొరత మరింత ఎక్కువ అవుతుంది. ఉదాహరణకు నాగావళిపై ఉన్న తోటపల్లి సాగునీటి ప్రాజెక్టుకు ప్రభుత్వం కేటాయించిన 2 టిఎంసిల నుండి కొమరాడ థర్మల్ విద్యుత్‌కేంద్రం అవసరాలకు నీటిని మళ్ళిస్తారు. అణువిద్యుత్ కేంద్రానికి మరో 2 టిఎంసిలు ఇవ్వటానికి ప్రభుత్వం అంగీకరించింది. స్థానికులకు తగిన అర్హతలు, ప్రత్యేకమైన నైపుణ్యాలు లేవని సాకు చెబుతూ ఈ ప్రాంతంలోని అత్యధిక పరిశ్రమలు వారికి ఉద్యోగాలు ఇవ్వటం లేదు.

దేశంలోని ఇతర ప్రాంతాలలో భిన్నమైన అనుభవాలు ఉన్నప్పటికీ, గత రెండు దశాబ్దాల నుండి అభివృద్ధి ప్రాజెక్టులను ఈ ప్రాంతంలో బలవంతంగా అమలు చేయటానికి పాలకపార్టీ(టిడిపి, కాంగ్రెస్, వైఎస్ఆర్‌సిపి)లు

“ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం చురుకుగా అమలు చేస్తున్నది. హిందుస్థాన్ జింక్ కంపెనీని బహుళజాతి కంపెనీ వేదాంతకు బహుమతిగా ఇస్తూ 2001లో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రైవేటీకరించి, దానిని బలహీనపరిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిశ్రమను మూసివేశారు. విశాఖపట్టణం ఓడరేవులోని అన్ని బెర్త్‌లను ప్రైవేటీకరించారు. కీలకమైన ముడి సరుకును నిర్వహించే ప్లాంట్‌ను వేదాంత కంపెనీకి అమ్మివేశారు. ”

పూనుకున్నాయి. ఉదాహరణకు అణు విద్యుత్ కేంద్రం నిర్మించటానికి వచ్చిన ప్రతిపాదనలను తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్ ఉపసంహరించుకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2016లో శ్రీకాకుళం జిల్లాలోని కొవ్వాడలో 6,100 మెగావాట్ల అణు విద్యుత్ కేంద్ర నిర్మాణానికి అంగీకారం తెలపటమే కాకుండా నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో కూడా అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి అంగీకారం తెలిపింది. వాస్తవానికి అణు విద్యుత్, సౌర విద్యుత్ కేంద్రాలు, వైద్య పరికరాలకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా ఉన్నది. కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం శ్రీకాకుళం జిల్లాలోని ఐదు గ్రామాలకు చెందిన 8,000 మంది ప్రజలను నిర్వాసితులను చేస్తుంది (హైదర్ ఎన్ 2016). అదే విధంగా విశాఖపట్టణం జిల్లాలోని షెడ్యూలు ప్రాంతాలలో బాక్సైట్ తవ్వటం కోసం గత కాంగ్రెస్, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు గిరిజనులు సామూహికంగా ఉపయోగించుకొనే ప్రదేశాలు లేకుండా చేయటంతో పాటు వారి జీవనాధారాలను కూడా దెబ్బతీస్తాయని కొన్ని అధ్యయనాలు స్పష్టం చేశాయి ( ప్రసాద్ పురేంద్ర 2012).

ఉత్తరాంధ్రలోని తీరం అంతా ఫార్మా కంపెనీలతో నిండిపోయింది. గాలి, నీరు, సముద్ర వనరులను అవి కలుషితం చేస్తున్నాయి. మందుల కంపెనీలు ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయటం కోసం 1990లలో రైతులకు ఎకరానికి 90,000 రూపాయలను పరిహారంగా ఇచ్చాయి. 2,000లలో దానిని 2,20,000 రూపాయలకు పెంచాయి. నిర్వాసితులైన వారికి ఉద్యోగాలు కల్పించటం, పునరావాసం కోసం నిర్మించిన కాలనీలకు మౌలిక సదుపాయాల కల్పన వంటి బాధ్యతలన్నింటి నుండి తప్పుకొంటూ కంపెనీలు ఒన్‌టైం సెటిల్‌మెంట్ లాగా రైతుల కిచ్చే పరిహారాన్ని పెంచాయి. 2005 తర్వాత 60-70 ఫార్మా కంపెనీలు వచ్చాయి. అప్పటి నుండి అవే ప్రధాన కాలుష్య కేంద్రాలుగా ఉన్నాయి. ఉద్యోగాల సంగతి పక్కన పెడితే ఫార్మా కంపెనీలు స్థానికులను పేదలుగా మార్చాయి. కంపెనీలను ప్రారంభించేటపుడు ఇంటికో ఉద్యోగం, ఇంటిస్థలం, పశువులకు ఐదు సెంట్ల స్థలం ఇస్తామని వాగ్దానం చేశారని మా అధ్యయనంలో పాల్గొన్న స్థానికులు చెప్పారు. దీనికి బదులుగా నిర్వాసితులకు ఇంటి స్థలానికి డబ్బు, ఇంటి నిర్మాణం కోసం బ్యాంకుల నుండి రుణాలు ఇప్పిస్తున్నారని వారు తెలిపారు. ఫలితంగా అనేకమంది రైతులు ఇంటి నిర్మాణం కోసం మూడు నుండి నాలుగు లక్షల రూపాయలు ఖర్చు చేశారు. దానికోసం రైతులు భారీగా అప్పులు చేసి, రుణాల ఊబిలో కూరుకుపోయారు. రుణాలు చెల్లించటంలో రైతులు విఫలం కావటంతో బ్యాంకులు వారి ఇళ్ళను వేలం వేశాయి. రైతులు భూమి, ఉద్యోగాన్ని మాత్రమే కాకుండా ఇంటిని కూడా కోల్పోయారు.

ఫార్మా కంపెనీలు స్థానికేతరులను ఉద్యోగాలలోకి తీసుకోవటంతో స్థానికులు మట్టిపనులు, రాడ్ బెండింగ్, నిర్మాణ పనుల కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు వలసలు పోయారు. ఫార్మా కంపెనీలు పనిలోకి తీసుకున్న కొద్దిమంది స్థానికులకు కూడా కనీస వేతనాలు చెల్లించలేదు. రక్షణ పరికరాలు అందించలేదు. ప్రావిడెంట్ ఫండ్, ఇతర ప్రయోజనాలేవీ కల్పించలేదు. సగానికి పైగా కంపెనీలు రక్షణ కోసం రూపొందించిన నిబంధనలను పాటించటం లేదని,చట్టాలను ధిక్కరిస్తున్నాయని ఆడిట్ సంస్థలు స్పష్టం చేశాయి. కంపెనీలు, రాజకీయ పార్టీల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఒక ఫార్మా కంపెని ఉన్న తాడి గ్రామంలో గ్రీన్‌బెల్ట్ నిబంధనల ప్రకారం 500 మీటర్ల దూరం ఉండాలి. కాని వైఎస్ఆర్ ప్రభుత్వం దానిని 250 మీటర్లకు తగ్గించింది. వాస్తవంలో ఈ కంపెనీలు 50 మీటర్లలో కూడా గ్రీన్‌బెల్ట్ నిబంధనలు పాటించటం లేదు. బోరుబావులు ఎండిపోయాయి. పనిచేస్తున్న వాటిలోని నీళ్ళ వినియోగానికి పనికి రావటం లేదు. ఫార్మా కంపెనీలు వచ్చిన కొన్ని గ్రామాలలోని పాఠశాలలను వేరే చోటికి తరలించటంతో స్కూలు మానేస్తున్న పిల్లల సంఖ్య పెరిగింది.ఎక్కడ పని దొరికితే అక్కడకు తరలిపోయే వలస కార్మికులను ఈ పరిస్థితులు సృష్టించాయి.

తీరప్రాంతం ఎక్కువగా కలుషితం కావటంతో మత్స్యకారులకు చేపలు దొరకటం లేదు. స్థానిక ప్రజలు తమ రోజువారి మంచినీటి అవసరాల కోసం కూడా ఈ కంపెనీలపై ఆధారపడుతున్నారు. మత్స్యకారులు వలసలు పోయి వచ్చిన ఆదాయంతో బతుకుతున్నారు. ఇటువంటి పరిస్థితుల వలన సోంపేట, కాకరాపల్లిలలో విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు జరిగాయి. గంగవరం ఓడరేవు నిర్మాణానికి వ్యతిరేకంగా మత్స్యకారులు ఆందోళనలు చేశారు. సెజ్‌లకు, కొన్ని మందులు, రసాయనాల కంపెనీలకు వ్యతిరేకంగా అచ్యుతాపురంలో ఆందోళనలు జరిగాయి (శర్మ ఇఎస్ 2007-11). వీటిలో ఒకటైన తిక్కవరం గ్రామంలో నిర్వాసితులైన 350 మందికి ఉద్యోగం కల్పించకపోవటంతో కంపెనీ నుండి మురికి నీరు పోయే పైపులను స్థానికులు ధ్వంసం చేశారు. దీనితో విధ్వంసం చోటు చేసుకోవటంతో ఉద్యోగం నుండి తొలగించిన తర్వాత సంవత్సరానికి తిరిగి ఉద్యోగం ఇవ్వటానికి కంపెని అంగీకరించింది. స్థానికులకు పనులు కల్పించాల్సిన బాధ్యత నుండి తప్పించుకోవటం కోసం కంపెనీలు ఒకేసారి డబ్బు రూపంలో పరిహారం ఇచ్చే విధానాన్ని అనుసరిస్తున్నాయి.

మరో వైపున ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం చురుకుగా అమలు చేస్తున్నది. హిందుస్థాన్ జింక్ కంపెనీని బహుళజాతి కంపెనీ వేదాంతకు బహుమతిగా ఇస్తూ 2001లో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రైవేటీకరించి, దానిని బలహీనపరిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిశ్రమను మూసివేశారు. విశాఖపట్టణం ఓడరేవులోని అన్ని బెర్త్‌లను ప్రైవేటీకరించారు. కీలకమైన

ముడి సరుకును నిర్వహించే ప్లాంట్‌ను వేదాంత కంపెనీకి అమ్మివేశారు. ప్రభుత్వరంగ సంస్థలను స్వాధీనం చేసుకొని, ప్రైవేటు సంస్థలు లాభాలు సంపాదించుకోవటానికి ఇవి కొన్ని ఉదాహరణలుగా ఉన్నాయి. ముడి ఇనుప ఖనిజాన్ని తవ్వుకోవటానికి బ్రాహ్మణి, పోస్కో కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాని విశాఖపట్టణం ఉక్కుఫ్యాక్టరికి సొంత గనులు లేవు. కాంగ్రెస్, బిజెపి రెండు పార్టీలు విఎస్‌పిలో వాటాలను అమ్మటానికి ప్రయత్నం చేస్తున్నాయి. ఇలాగే బిహెచ్‌పివి, షిప్‌యార్డు తదితర ప్రభుత్వరంగ సంస్థలను కూడా ప్రైవేటీకరించటానికి ప్రయత్నం చేస్తున్నారు. కేవలం ఉద్యోగులు, కార్మికుల ప్రతిఘటనతో ప్రైవేటీకరణ ఆగింది.

> **“ నైపుణ్యం కలిగిన, సాధారణ కార్మికులు బీహార్, ఛత్తీస్‌ఘర్, ఒరిస్సా, కాకినాడ, విశాఖపట్టణంలకు పెద్దసంఖ్యలో వలసలు పోతున్నారు. 2006లో గంగవరం ఓడరేవు వ్యతిరేక ఆందోళనలు జరిగిన తర్వాత ఈ ప్రాంతంలోని అన్ని కంపెనీలూ స్థానిక కార్మికులను తీసుకోవటం తగ్గించాయి. తీవ్రమైన నిర్బంధం, అణచివేత, తప్పుడు కేసులు, స్థానిక నాయకులు కొందరికి ఒకేసారి పెద్దమొత్తం డబ్బు ఇచ్చి నోరు మూయించటం తదితర పద్ధతులను అనుసరించటం ద్వారా ఉద్యమాలను నీరుగారుస్తున్నాయి. ”**

ఉత్తరకోస్తా ప్రాంతంలో ఈ మధ్య వస్తున్న ప్రమాదకరమైన పరిశ్రమలు విస్తారంగా కార్మికులను తొలగిస్తున్నాయి. ప్రజలు ఆస్తులను, జీవనాధారాన్ని కోల్పోతున్నారు. వీటి వలన స్థానిక ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పంటలు నాశనమై పోవటం, పర్యావరణం, సముద్ర వనరులు, పశుసంపద క్షీణించిపోతున్నవి. ఆస్మా, కిడ్నీ, చర్మ, శ్వాసకోశ, నరాలకు సంబంధించిన జబ్బులు, మహిళలకు గర్భధారణ తగ్గిపోవటం తదితర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఉదాహరణకు గంగవరం రేవులోని బొగ్గు, నుసితో కాలుష్యం తీవ్రం కావటం వలన గ్రామంలో జీవించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఓడరేవులో పనిచేస్తున్న స్థానికులు చెప్పారు. రాత్రివేళల్లో కాలుష్యం ఎక్కువ కావటం వలన ఇళ్ళ కిటికీలు కూడా తెరవలేక పోతున్నామని వారు తెలిపారు. పెరుగుతున్న జబ్బులు, రుణభారం వలన ఆరోగ్య పరిరక్షణ కోసం కొందరు బంగారాన్ని, ఆస్తులను అమ్ముకున్నారు. ప్రజలకు ఏ విధమైన ఉపాధి అవకాశాలు లేకపోవటం వలన తప్పనిసరై వలసలు పోతున్నారు. ఓడరేవు రావటం వలన జీవితాలు పూర్తిగా నాశనం అయ్యాయని స్థానికులొకరు చెప్పారు. ఉత్తరాంధ్రలో లభిస్తున్న ఉద్యోగాల వలన రెండు రకాల సమస్యలు వస్తున్నాయని చెప్పారు. మొదటిది, ఏ మాత్రం భద్రత లేని కాంట్రాక్టు ఉద్యోగాలు మాత్రమే దొరుకుతున్నాయి. రెండవది, ఈ ఉద్యోగాలు ప్రమాదకరమైన పరిసరాలలో చేయటం వలన ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. కలుషితమైన గాలి, నీరు, బొగ్గు ధూళితో గ్రామాలలో బతకటానికి ఇబ్బందులు పడుతున్నాం. పని ప్రదేశాలలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని వారు తెలిపారు.

ఈ ప్రాంతం నుండి జరుగుతున్న వలసలను సూక్ష్మంగా పరిశీలించినపుడు దిగువ అంశాలు స్పష్టమైనాయి.

మొదటిది, ఈ ప్రాంతంలోని ప్రజలు సమీపంలోని విశాఖపట్టణానికి మాత్రమే కాక అండమాన్ నికోబార్, కేరళ, గుజరాత్, మణిపూర్ లాంటి రాష్ట్రాలకు కూడా వలసలు పోతున్నారు. బతకటం కోసం ప్రతి వృత్తిగ్రూపులో ఉన్నవారూ వివిధ రకాల పనులు చేస్తున్నారు. ఉదాహరణకు మత్స్యకారులు చేపలు పట్టటానికి మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళ్ళటం లేదు. చేతితో తయారైన వివిధ రకాల ఉత్పత్తులను కూడా వారు అమ్ముతున్నారు. సుదూరప్రాంతాలలో తిరుగుతూ, కఠినమైన పరిస్థితులలో పని చేయాల్సి వస్తున్నది. ఆయా ప్రాంతాలలోని కాంట్రాక్టర్లు తమను తీవ్రంగా దోపిడి చేస్తున్నారని వివిధ పనుల కోసం వెళ్ళిన కార్మికులు చెప్పారు. పురుషులు వలసలు వెళ్ళిన తర్వాత గ్రామాలలో ఉన్న మహిళలు తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. దొంగతనాలు, లైంగిక వేధింపులు పెరిగాయి.

రెండవది, నైపుణ్యం కలిగిన, సాధారణ కార్మికులు బీహార్, ఛత్తీస్‌ఘర్, ఒరిస్సా, కాకినాడ, విశాఖపట్టణంలకు పెద్దసంఖ్యలో వలసలు పోతున్నారు. 2006లో గంగవరం ఓడరేవు వ్యతిరేక ఆందోళనలు జరిగిన తర్వాత ఈ ప్రాంతంలోని అన్ని కంపెనీలూ స్థానిక కార్మికులను తీసుకోవటం తగ్గించాయి. స్థానిక ప్రజలు నిరసన కార్యక్రమాలు చేస్తున్నపుడు ప్రైవేటు సెక్యూరిటి, పిఆర్ బృందాలను రంగంలోకి దించుతున్నాయి. తీవ్రమైన నిర్బంధం, అణచివేత, తప్పుడు కేసులు, స్థానిక నాయకులు కొందరికి ఒకేసారి పెద్దమొత్తం డబ్బు ఇచ్చి నోరు మూయించటం తదితర పద్ధతులను అనుసరించటం ద్వారా ఉద్యమాలను నీరుగారుస్తున్నాయి. గ్రామాలలో ఉన్న విద్యావంతులైన నిరుద్యోగ యువకులు కాంట్రాక్టు ఉద్యోగాల కోసం కూడా మధ్యవర్తులకు రెండు నుండి మూడు లక్షల రూపాయలు చెల్లించాల్సిన ప్రత్యేకమైన పరిస్థితులు ఉన్నాయి. మరోవైపున ప్రభుత్వం కంపెనీలకు భూములు ఇప్పించటం మాత్రమే కాక, పెద్దమొత్తంలో పన్నులను కూడా రద్దుచేస్తున్నది. నీరు, విద్యుత్ తదితరాలను చౌకధరలకు అందిస్తున్నది.

మూడవది, వలసలు పోవటంతో గ్రామాలు నిర్మానుష్యంగా మారటం వలన ఇతర రాష్ట్రాల నుండి పెద్దసంఖ్యలో వలసలు వచ్చిన వారు ఆ గ్రామాలలో ఉంటున్నారు. జీవించటానికి వీలుగా లేవని స్థానికులు వదిలివేసిన ఇళ్లలో వలస వచ్చిన వారు అద్దె చెల్లించకుండా ఉంటున్నారు. బయటి నుండి వలస వచ్చిన వారు ఇళ్ళలో పనులు, లోడింగ్-అన్‌లోడింగ్, పరిశుభ్రతను కాపాడటం, వ్యర్థాల నిర్వహణ తదితర పనులు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని పరిశ్రమలు చౌక కార్మికులతో మూడు షిఫ్టులలో 24 గంటలు పని చేయిస్తున్నాయి. గ్రామాలలో ఉన్నవారు జీవనాధారాన్ని వెతుక్కొంటూ వలసలు పోతుండగా, బయటి నుండి వలసలు వచ్చిన వారు స్థానికులు వదిలివేసిన ఇళ్ళలో ఉంటున్న విచిత్రమైన పరిస్థితి ఇక్కడ నెలకొన్నది. స్థానిక నివాసులు, ఇపుడు ఇళ్ళలో ఉంటున్న వారూ ఇరువురిలోనూ తాము స్థానికులం కాదనే భావన ఉన్నది. నివాసంతోనూ, పనితోనూ సంబంధం లేని వారిగా కార్మికులను మారుస్తున్నారనే దానికి ఇది స్పష్టమైన ఉదాహరణగా ఉన్నది.

చెన్నైకి వలస వెళ్ళిన కార్మికులను ఇంటర్వ్యూ చేసినపుడు నిర్మాణం, ఇళ్ళలో పనులు, కళాసిలు, గోడౌన్లలో ఎగుమతి-దిగుమతులు తదితర పనులు

" వలసదారుల కథలన్నీ రెండు విషయాలను స్పష్టం చేస్తున్నాయి. ఒకటి, భూములు, సముద్ర ఉత్పత్తులు, ఇతర వనరుల నుండి ప్రజలను దూరం చేసిన తర్వాత వలసలు పోక తప్పని పరిస్థితి వారికి ఏర్పడుతున్నది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో వలస కార్మికుడు ఒక నమూనా అని, అతడు వివిధ రకాలైన దోపిడీ పద్ధతులకు గురౌతాడని 1989లో జాన్ బ్రెమాన్ చెప్పినది సరైనది. "

చేస్తున్నట్లు చెప్పారు. మార్కెటింగ్ ఏజన్సీల ద్వారా ఒక కార్మికుడు పెద్ద కంపెనీలో ఉద్యోగం సంపాదించినట్లైతే, నివాసం చూయించటం, క్రమబద్ధంగా పని ఇస్తున్నామనే పేరుతో తక్కువ జీతం ఇస్తారు. వారే స్వయంగా ఉద్యోగం సంపాదించుకొంటే జీతం ఎక్కువ ఉంటుంది కాని ఉద్యోగ భద్రత ఉండదు. సంపాదించినది తాము తినటానికి, పిల్లల చదువులకు మాత్రమే సరిపోతున్నాయని రెండు తరగతుల కార్మికులూ చెప్పారు.

మత్స్యకారుల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. శ్రీకాకుళం జిల్లాలోని డి మత్సలేశం గ్రామంలో చేసిన అధ్యయనంలో వచ్చిన అంశాలను దిగువ ఇస్తున్నాం. ఈ గ్రామంలో ఉన్న 500 కుటుంబాలూ మత్స్యకారులకు చెందినవే. వారిలో ఎక్కువ మంది వడ బలిజ కులానికి చెందినవారు. రొయ్య పిల్లలను పెంచే హేచరీలు, మందుల కంపెనీలు నీటి వనరులతో పాటు సముద్ర జలాలను కూడా కలుషితం చేస్తున్నాయి. కాబట్టి చేపలు పట్టటం ఏ మాత్రం ఉపయోగకరంగా లేదు. గ్రామంలో ఏ విధమైన పనులు దొరకకపోవటంతో వారు గుజరాత్‌లోని జునాగడ్‌లోని చేపలు ఎగుమతి చేసే కంపెనీలలో పనుల కోసం వెళ్ళారు. మరబోట్లలో ప్రధాన డ్రైవర్, సహాయ డ్రైవర్, వంటవారు, సహాయకులు, ఇతర పనులు చేయటం కోసం ఒక్కో బోటుకు ఎనిమిది మంది చొప్పున తీసుకున్నారు. వీరు ఒకసారి సముద్రంలోకి వెళితే 20-25 రోజుల పాటు తిరిగిరారు. బోటు నిర్వహణ బాధ్యత సహాయ డ్రైవర్‌ది. ప్రధాన డ్రైవర్ నెలకు 25,000, సహాయ డ్రైవర్ 12,000, ఇతర పనులు చేసేవారు 7000 నుండి 10,000 రూపాయలు సంపాదిస్తారు. ప్రధాన డ్రైవర్ నైపుణ్యం ఆధారంగా యజమానులు 5 నుండి 10 లక్షల రూపాయల వరకు అడ్వాన్స్‌గా ఇస్తారు. ప్రధాన డ్రైవర్ మిగతా వారికి ఒక్కొక్కరికి 60 నుండి 70 వేల రూపాయలు అడ్వాన్స్‌గా ఇస్తాడు. వారంతా ఒక జట్టుగా ఆగస్టు నుండి ఏప్రిల్ వరకు ఎనిమిది నెలల పాటు పనిచేస్తారు. ఏప్రిల్ నుండి జూన్-జులై వరకు నాలుగు నెలలు తమ గ్రామంలో ఉంటారు. ప్రధాన డ్రైవర్ సంవత్సరానికి మూడు నుండి నాలుగు లక్షల రూపాయలు, మిగతా వారు అరవై వేల నుండి లక్ష రూపాయల వరకు సంపాదిస్తారు. తాము సంపాదించిన మొత్తాన్ని గ్రామంలో ఉండే నాలుగు నెలలలో వినియోగ సరుకులు, పిల్లల విద్య, ఇండ్ల మరమ్మత్తులు, ఇతర ఖర్చులకు వినియోగిస్తారు. ఈ నాలుగు నెలలు పనిచేయకపోతే వారు బతకలేరు. ఆటో డ్రైవర్లు, వ్యవసాయ, ఇతర కార్మికులుగా ఈ నాలుగు నెలలు వారు పనిచేస్తారు. స్త్రీలు పట్టిపనులు, నిర్మాణపనులు, వ్యవసాయంలో పనిచేస్తారు. సుమారు 20 రోజులు ఉపాధి హామి పనులకు వెళతారు.

శ్రీకాకుళం జిల్లా నుండి వలస వెళుతున్న రెండు లక్షల మంది మత్స్యకారుల పరిస్థితులు ఈ అధ్యయనంలో వెల్లడైనాయి. వలస కార్మికుల దుర్భర జీవితాలు, తప్పనిసరి పరిస్థితులలో గుజరాత్‌లో వారు చేస్తున్న ప్రమాదకరమైన పనులు కూడా ఈ అధ్యయనంలో స్పష్టమైనాయి. అనారోగ్యంతో సముద్రంలో మరణించినపుడు వారి మృతదేహాలను చూసే అవకాశం కూడా పిల్లలకు ఉండదు. సముద్రంలో చాలా దూరంగా, పాకిస్తాన్ సరిహద్దు వరకు మరబోట్లలో వెళుతుంటారు. కొన్ని సందర్భాలలో జరిగినట్లుగా పాకిస్తాన్ నౌకాదళం వారిని పట్టుకుంటే తిరిగి రావటానికి ఎటువంటి అవకాశమూ ఉండదు. వారు అనారోగ్యం పాలయినా, ఇతర అవసరాలకైనా తీరానికి తిరిగి రావాలంటే వారం రోజులు పడుతుంది.

మూత్రపిండాలు, లివర్, చర్మం, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులతో తాము బాధపడుతున్నట్లు అనేకమంది చెప్పారు. చేపలు పట్టుకొంటూ శ్రీకాకుళం జిల్లాలోనే వారు జీవించాలంటే సముద్రం లోపలికి వెళ్ళటానికి మరబోట్లు కావాలి. శ్రీకాకుళం జిల్లాలో తీరం వెంట ఉన్న రసాయన కంపెనీలు వదులుతున్న విషవాయువులు సముద్ర జలాలను కలుషితం చేస్తున్నాయి. తీరంలో ఉన్న ఇసుక కూడా కలుషితం కావటంతో అలలకు ఒడ్డుకు వచ్చిన చేపలు చనిపోతున్నాయి. అందువలన బతకటం కోసం ఈ ప్రాంతంలోని మత్స్యకారులు సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులను బిసి ఎ తరగతిలో చేర్చింది. సాపేక్షంగా బాగా ఉన్న తరగతులను ఈ విభాగంలో చేర్చటంతో వచ్చే ప్రయోజనాలను వారే పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నది. కాని ప్రభుత్వం ఈ మధ్య ప్రవేశపెట్టిన బయో మెట్రిక్ విధానం వలస వెళ్ళినవారు బియ్యం కోసమే కాక, రేషన్‌కార్డును నిలబెట్టుకోవటానికి కూడా తరచుగా రావలసిన పరిస్థితిని కల్పించింది.

పైన చెప్పిన వలసదారుల కథలన్నీ రెండు విషయాలను స్పష్టం చేస్తున్నాయి. ఒకటి, భూములు, సముద్ర ఉత్పత్తులు, ఇతర వనరుల నుండి ప్రజలను దూరం చేసిన తర్వాత వలసలు పోక తప్పని పరిస్థితి వారికి ఏర్పడుతున్నది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో వలస కార్మికుడు ఒక నమూనా అని, అతడు వివిధ రకాలైన దోపిడీ పద్ధతులకు గురౌతాడని 1989లో జాన్ బ్రెమాన్ చెప్పినది సరైనది.

**3వ భాగం**

తగినంత వర్షపాతం లేని, కొద్ది మేరకు వర్షాలు పడే, శతాబ్దాలుగా కరువుకు గురౌతున్న దెక్కన్ పీఠభూమిలో రాయలసీమ ఉన్నది. అనంతపురం, కడప, చిత్తూరు, కర్నూలు, నాలుగు జిల్లాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఈ ప్రాంతంలో 67.29 లక్షల హెక్టార్ల భూమి ఉన్నది. 130 లక్షల మంది ప్రజలు ఉన్నారు.

వ్యవసాయ భూమి 24.16 లక్షల హెక్టార్లు ఉండగా, దానిలో 5.57 లక్షల హెక్టార్లకు (23 శాతం) మాత్రమే సాగునీరు కాలువలు, బోర్ల ద్వారా నీటి సదుపాయం ఉన్నది. 14.9 లక్షల హెక్టార్లు (22 శాతం) న్న అటవీ భూములలో తక్కువ భాగంలోనే అడవులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో

నదీజలాలు, బోరుబావుల ద్వారా అందే నీరు కూడా అస్థిరంగా ఉంటాయి. చాలా కొద్ది పరిశ్రమలు మాత్రమే ఈ ప్రాంతంలో ఉన్నాయి. వర్షాధార వ్యవసాయం పైనే ఇక్కడి ప్రజల జీవితాలు ఆధారపడి ఉన్నాయి. తరచుగా కరువులు సంభవిస్తుంటాయి. నైరుతి, ఈశాన్య రుతు పవనాల ద్వారా సంవత్సరంలో 350 నుండి 650 మిల్లిమీటర్ల వర్షం పడుతుంది(ప్రసాద్ పురేంద్ర 1998).

గతంలో ఏనాడూ లేని విధంగా ఈ ప్రాంతంలో 1995 నుండి గత రెండు దశాబ్దాలలో తరచుగా కరువులు వచ్చాయి. గత 14 సంవత్సరాలలో రెండు సంవత్సరాలలో మాత్రమే పంటలకు సాధారణ దిగుబడులు వచ్చాయని 2012, ఫిబ్రవరిలో అనంతపురం జిల్లా అధికారులు నివేదిక ఇచ్చారు. 1999-2017 మధ్య 3,000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ప్రాంతం నుండి పనులు వెతుక్కొంటూ వెళుతున్న వలస కార్మికుల పెరుగుదల, వ్యవసాయ కార్మికులు, చిన్న, సన్నకారు రైతులే కాకుండా గత దశాబ్దం నుండి మధ్య తరగతి, పెద్ద రైతులు కూడా తప్పనిసరిగా వలసలు వెళ్ళాల్సిన పరిస్థితులను, వారెదుర్కొంటున్న సమస్యలను ఈ భాగంలో చర్చిద్దాం.

అనంతపురం జిల్లాలో సాగుభూమి 25 లక్షల ఎకరాలుంది. దానిలో ఎక్కువ భాగంలో ఒకే పంట వేరుశనగ పండిస్తారు. రైతులలో 90 శాతం చిన్న, సన్నకారు రైతులు. 25 లక్షల ఎకరాల సాగుభూమిలో 5 నుండి 10 లక్షల ఎకరాలు, సాగుభూమిలో మూడింట ఒకవంతు 2013 నుండి 2017 వరకు సాగు చేయలేదు. సాగునీరు అందకపోవటంతో భూములను బీడుపెట్టటం వలన రైతులు వలసలు పోవటం మినహా గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడింది. వేసిన విత్తనాలు మొలకెత్తకపోవటం లేదా తగినంతగా మొలకలు రాకపోవటంతో మరో 20 శాతం రైతులు భారీగా నష్టపోయారు. అనంతపురం జిల్లాలో రెండు లక్షల బోరుబావులు ఉన్నాయని అంచనా వేశారు. వాటిలో మూడింట రెండు వంతులు ఎండిపోయాయి. ఈరోజు 30,000 బోరుబావులు మాత్రమే పని చేస్తున్నాయి (రెడ్డి ఎం,2016). నీటిని ఎక్కువగా వినియోగించటం వలన భూగర్భ జలమట్టం తగ్గిపోయింది. నీరు అందకపోవటంతో పంటలు ఎండిపోయాయి. బోర్ల నుండి నీరు రాకపోవటం వలన నిమ్మ, నారింజ, దానిమ్మ, అరటి, బొప్పాయి లాంటి పండ్ల తోటలు కూడా ఎండిపోయాయి.

> **"రైతులు వేరుశనగతో పాటు కర్బూజ, బొప్పాయి, దానిమ్మ, టొమాటో, మిరప తదితర పంటలు పండిస్తున్నారని మా సర్వేలో స్పష్టమైంది. ఇతర ప్రాంతాలలోని పారిశ్రామిక వేత్తలు నీటి వనరులున్న ప్రాంతాలను గుర్తించి, భూములను చౌకగా కొని, దానిమ్మ, జామ, మామిడి లాంటి ఉద్యాన పంటలను పండిస్తున్నారు. అనంతపురం జిల్లా బెంగళూరుకు పక్కన ఉండటంతో ఇక్కడ భూములు కొనుగోలు చేయటం ద్వారా సత్వరం లాభాలు చేసుకోవటానికి వచ్చిన రియల్ ఎస్టేట్ పెట్టుబడి ఇది."**

రైతులు వేరుశనగతో పాటు కర్బూజ, బొప్పాయి, దానిమ్మ, టొమాటో, మిరప తదితర పంటలు పండిస్తున్నారని మా సర్వేలో స్పష్టమైంది. ఇతర ప్రాంతాలలోని పారిశ్రామిక వేత్తలు నీటి వనరులున్న ప్రాంతాలను గుర్తించి, భూములను చౌకగా కొని, దానిమ్మ, జామ, మామిడి లాంటి ఉద్యాన పంటలను పండిస్తున్నారు. అనంతపురం జిల్లా బెంగళూరుకు పక్కన ఉండటంతో ఇక్కడ భూములు కొనుగోలు చేయటం ద్వారా సత్వరం లాభాలు చేసుకోవటానికి వచ్చిన రియల్ ఎస్టేట్ పెట్టుబడి ఇది. ఈ పెట్టుబడిదారి రైతులు తమ భూములలోకి గొర్రెలు, పశువులు రాకుండా కంచె వేస్తున్నారు. ఇది వరుసగా ఏడవ కరువు సంవత్సరం కావటంతో రైతులు భారీగా నష్టాల పాలయ్యారు. ప్రత్యామ్నాయ ఉపాధికి, పశువులకు మేత సంపాదించుకోవటానికి వారికి కొద్ది అవకాశాలే ఉన్నాయి. పశువులకు మేత లేకపోవటం వలన పాలడైరీలకు కూడా ప్రత్యామ్నాయం లేదు. తమ వద్ద ఎద్దు లేకపోవటంతో చిన్న, సన్నకారు రైతులు కూడా ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు. భూగర్భ జలమట్టం తగ్గటం వలన బోర్లు తరచుగా ఎండిపోవటంతో నీటి సదుపాయం ఉన్న భూముల రైతులు కొత్త బోర్లు వేయటం కోసం లక్షలాది రూపాయలను ఖర్చుచేసి అప్పుల పాలయి, దరిద్రంలోకి జారిపోయారు.

స్థానిక ఏజెంటు సరఫరా చేసిన నకిలి విత్తనాలు తమను ఏ విధంగా కష్టాలలోకి నెట్టాయన్న అంశాన్ని పడమటివానిపాలెం గ్రామస్తులు మా సర్వేలో తెలిపారు. మొత్తం గ్రామంలోని రైతులంతా ఈ సంవత్సరం కర్బూజా పంటవేశారు. జిల్లాలోని కదిరి సబ్ డివిజన్‌లో 120 గ్రామాలు కర్బూజాను సాగు చేయగా, అవసరమైనన్ని విత్తనాలను కంపెనీలు సకాలంలో సరఫరా చేయలేదు. దానితో త్వరగా లాభాలు చేసుకోవాలనే దురాశతో వారు నకిలి విత్తనాలను రైతులకు అమ్మారు. కిలో కర్బూజా విత్తనాలు 30 నుండి 35 వేల రూపాయలకు అమ్మారు. ఆ విధంగా నకిలి విత్తనాల వలన ఈ ప్రాంతంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. "నకిలి విత్తనాల అమ్మకంపై ఫిర్యాదు చేసినపుడు వ్యవసాయాధికారి విత్తనాలు కొన్న బిల్లులు చూయించమని అడిగాడు. ఎరువులు, విత్తనాలు అమ్మే డీలర్లను బిల్లులు కావాలని మేం ఎప్పుడూ అడగలేదు. వారు ఇవ్వలేదు", అని రైతులు చెప్పారు. "నకిలీ విత్తనాలతో, ఇతర విధాలుగా మేం నష్టపోయినపుడు మమ్ముల్ని ఆదుకోవటానికి ఎవరూ రాలేదని" చెప్పారు. వ్యవసాయ శాఖ, రాజకీయ నాయకులతో సంబంధాలు కొనసాగిస్తున్నవిత్తన కంపెనీలు ప్రభుత్వ అనుమతి లేకుండానే విత్తనాలను అమ్ముతున్నాయి".

వ్యవసాయ కార్మికులు, చిన్న, సన్నకారు రైతులు మాత్రమే కాకుండా మధ్య తరగతి, పెద్ద రైతులు కూడా వలసలు పోతున్నారు. కొందరు రోజువారీగా, కొందరు ఆయా సీజన్లలో, కొద్దిమంది శాశ్వతంగా వలసలు పోతున్నారు. "బోరుబావులు పనిచేయకపోవటం వలన తాను ఆరు లక్షల రూపాయలు అప్పు చేసినట్లు, ఈ అప్పులను చెల్లించలేకపోతే తమకున్న ఒకే ఒక జీవనాధారమైన భూమిని అమ్ముకోవలసి వస్తుందని" ఎథోడ్ గ్రామస్తుడు ఎట్టెన్న చెప్పారు. గ్రామంలో బి టెక్ చదివిన 10 మంది నిరుద్యోగులుగా ఉన్నారు.

**(తరువాయి వచ్చే సంచికలో)**

**అనువాదం: ఎ కోటిరెడ్డి**

# సైన్సు - సమాజం

***(2023 డిసెంబర్ 23-25 తేదీల్లో విజయవాడలో జరిగిన సైన్సు వర్క్‌షాపులో ప్రవేశపెట్టిన పత్రం నుండి)***



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

**ఎస్ వెంకట్రావు**

'ప్రపంచపు (విశ్వం యొక్క) అంతర్గత నిర్మాణాన్ని కనుగొనే విధానమే సైన్సు' అని నిర్వచించాడు బ్రిటిష్ వర్కర్స్ పార్టీ నాయకుడు ఫిల్ గాస్పర్ తను రాసిన 'మార్క్సిజం-సైన్సు' అన్న పుస్తకంలో.

సైన్సు మానవ సమాజపు ఉత్పత్తి. దానర్థం సైన్సుకు స్వంత వ్యక్తిత్వం లేదని కాదు. సైన్సును అది అభివృద్ధి చెందిన సామాజిక, చారిత్రక స్థితిలోనే సరిగ్గా అర్థం చేసుకోగలం.

సుమారు 500 కోట్ల సంవత్సరాల భూగోళపు చరిత్రలో జీవరాశి ఆవిర్భవించింది 200 కోట్ల సంవత్సరాల పూర్వమే. జీవ పరిణామంలో ఉన్నతమైన వానరాలు ఆవిర్భవించి 2 కోట్ల సంవత్సరాలు అయింది. మనుగడ కోసం జరిగిన పోరాటంలో తొలిసారి పనిముట్లు పట్టిన వానరాలే తరువాత మానవులుగా పరిణామం చెందాయి.

పనిముట్లతో ప్రకృతినుండి జీవనావసరాలను సంపాదించుకోడానికి మనిషి చేసిన ప్రయత్నం నుండి సైన్స్ ఆవిర్భవించింది. నాటి నుండి నేటి వరకు సమాజంతో బాటే సైన్స్ అభివృద్ధి చెందుతూ వచ్చింది. అదే సమయంలో సామాజికాభివృద్ధికీ సైన్స్ తోడ్పడింది. సమాజానికీ, సైన్స్‌కూ ఉన్న ఈ అవినాభావ సంబంధం మానవాళి చరిత్ర అంతటా మనకు కనిపిస్తుంది.

మనిషి ఆహార సంపాదనకోసం క్రమంగా పనిముట్లు, నైపుణ్యం పెంచుకుంటూ పోయాడు. కొత్త కొత్త ప్రకృతి వనరులను వినియోగంలోకి తెచ్చుకున్నాడు. తన చుట్టూ ఉన్న ప్రాకృతిక ఘటనలపై అనేక ఊహాజనిత కథలు అల్లుకున్నాడు. ఆ క్రమంలోనే సైన్సు అభివృద్ధి చెందింది. తొలి రాతి బల్లెం భౌతిక శాస్త్రానికి పునాది వేసింది. కందమూలాల కోసం మొక్కల పరిశీలన వృక్షశాస్త్రానికీ, జంతువులను వేటాడే క్రమంలో వాటి పరిశీలన, పెంపకం జంతుశాస్త్రానికీ, మాంసాన్ని కాల్చుకు తినడం, నీళ్ల కాగబెట్టడం రసాయన శాస్త్రానికీ పునాదులు వేశాయి.

చేతివృత్తుల వారి నైపుణ్యంలోనూ, మతగురువుల మంత్రోచ్ఛారణలోనూ చాలా కాలం సైన్స్ దాక్కున్నది. వైద్యం, నక్షత్రశాస్త్రం, రసవాదాల రూపంలో సైన్స్ స్వంత ఉనికిని చాటుకున్నప్పటికీ ఈ శాస్త్రాలు కుబేరుల ధనరాశులపై ఆధారపడి బ్రతికే కొద్దిమంది వ్యక్తులకు మాత్రమే పరిమితమైనాయి. కేవలం గత మూడు శతాబ్దాలుగా మాత్రమే సైన్స్ ఒక స్వతంత్ర వ్యవస్థగా, ఒక వృత్తిగా ఆవిర్భవించింది. సైన్స్ భాష, సైన్స్ విద్య, సైన్స్ నైపుణ్యం వంటి స్వంత లక్షణాలు దానికి సమకూరాయి. ఈనాడు - మన యుగంలో - తిరిగి సైన్స్ మనిషి నిత్య జీవితంలో అంతర్భాగంగా మారిపోయింది.

సైన్సు అభివృద్ధి చెందడం అంటే సమాజంలో ఉత్పత్తి శక్తులు పెరగడం. మనిషి తన అవసరాలు తీర్చుకోవడం కోసం నిరంతం పనిముట్లను మరింత నైపుణ్యంగా తీర్చిదిద్దుకుంటూ వచ్చాడు. కొత్త పనిముట్ల వినియోగంతో అతనికి కొత్త జ్ఞానం అబ్బింది. ఆ విధంగా మనిషి, పనిముట్టు (లేక యంత్రం) కలిసి అభివృద్ధి చెందుతూ వచ్చారు. ఉత్పత్తి శక్తులు పెరగడం అంటే ఇదే. ఉత్పత్తి శక్తులు పెరిగే కొద్దీ సమాజంలో మనుషుల మధ్య కొత్త ఉత్పత్తి సంబంధాలు ఏర్పడుతూ వచ్చాయి. అంటే సమాజం మారుతూ వచ్చింది. కొత్తగా ఏర్పడిన ఉత్పత్తి సంబంధాలు మళ్లీ ఉత్పత్తి శక్తులు వేగంగా పెరగడానికి, అంటే సైన్సు అభివృద్ధికి తోడ్పడతాయి. ఈ క్రమంలోనే మానవ సమాజం నాటి నుండి నేటి వరకు అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఇక ముందు కూడా అభివృద్ధి చెందుతుంది.

ఆదిమానవులు వేటలో సంపాదించిన నైపుణ్యం జంతువుల లభ్యతను తగ్గించింది. అది కొత్త ఉత్పత్తి విధానం- వ్యవసాయం - ప్రారంభించడానికి దారితీసింది. వ్యవసాయం కొత్త విజ్ఞానాన్ని పెంపొందించింది. ఇది నాగరికతల ఏర్పాటుకు దారితీసింది. వ్యవసాయంలోనూ, పశుపోషణలోనూ మానవుడు కనిపెట్టిన కొత్త సాంకేతికాంశాలు అతని ఉత్పత్తిలో మిగులును చేకూర్చాయి. అంటే ఒక మనిషి తన శరీర పోషణకన్నా ఎక్కువ ఉత్పత్తి చేయగలిగాడు. ఆ మిగులు ఉత్పత్తి ఆధారంగా నాగరిక వ్యవస్థలు ఏర్పడ్డాయి.

మెసపుటోమియా, బాబిలోనియా, భారత్, చైనాల్లో కొత్తరాతి యుగం, కంచు యుగపు నాగరికతలు ఏర్పడ్డాయి. సైన్సు అభివృద్ధికి అవి తొలి కేంద్రాలైనాయి. కొంత కాలానికి ఈ సామాజిక వ్యవస్థల్లో వచ్చిన మార్పుల వల్ల అక్కడ సైన్సు అభివృద్ధి ఆగిపోయింది.

ఇనుము రంగంలోకి వచ్చిన తరువాత ఏర్పడ్డ బానిస సమాజాలకు గ్రీసు కేంద్రంగా మారింది. అక్కడి బానిస యజమానుల ప్రజాస్వామ్యం విజ్ఞాన శాస్త్రాభివృద్ధికి కేంద్రంగా మారింది. ఇనుప నాగరికతలు కొత్త శాస్త్రీయ భావాలను ప్రోత్సహించాయి. గ్రీసుతో పాటు భారత దేశంలోని గంగా మైదానం వంటి ప్రాంతాల్లో కొత్త విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు జరిగాయి.

ఇనుప నాగరికతలు కొత్త సమాజాలను ఆవిష్కరించాయి. ప్రపంచవ్యాపితంగా ఫ్యూడల్ సమాజాలు ఏర్పడ్డాయి. ఫ్యూడల్ సమాజాలకు సైన్సుతో పని తక్కువ. అందువల్ల ఈ కాలంలో సైన్సు అభివృద్ధి మందగించింది. ఫ్యూడల్ సమాజాలు ఏర్పడిన గ్రీసు, రోము, భారత్, చైనా మొదలైన పాత వైజ్ఞానిక ప్రాంతాల్లో పాలక వర్గాలు తార్కికత స్థానంలో మూఢ విశ్వాసాన్ని ప్రోత్సహించాయి. కానీ పశ్చిమాసియాలో కొత్తగా పుట్టిన ఇస్లాం మతం తొలినాళ్లలో సైన్సును ప్రోత్సహహించింది. దాంతో అనేక మంది ఇస్లాం పండితులు విజ్ఞాన తృష్ణతో దేశదేశాలు తిరిగారు. అక్కడి విజ్ఞానాన్ని గ్రంథస్థం చేశారు. తూర్పు, పశ్చిమ దేశాలకు వారధిగా ఉన్న ఈ ప్రాంతం నుండి విజ్ఞాన జ్యోతి యూరప్‌లో రినయజన్స్ (సాంస్కృతిక పునరుజ్జీవన) కేంద్రమైన ఇటలీకి అక్కడినుండి పారిశ్రామిక విప్లవ కేంద్రమైన ఇంగ్లడ్‌కూ ఇతర దేశాలకూ పయనించి నేడు ప్రపంచ వ్యాపితమైంది.

ఆధునిక యుగంలో సైన్సు తనంత తాను ఒక గొప్ప సంస్థగా ఎదగడమే కాదు మనిషి దైనందిన జీవనంలో భాగం అయింది.

సైన్స్ చరిత్రను మొత్తంగా పరిశీలిస్తే దాని అభివృద్ధిలోని ప్రతి మలుపులో జరిగిన ప్రతి కొత్త ఆవిష్కరణా పాత భావాలతో ఘర్షించి కొత్త భావాలకు అంకురార్పణ జరిపింది. ఈ కొత్త భావాలు వికసించి తిరిగి కొత్త ఆవిష్కరణలకు మార్గమిచ్చాయి. ఈ విశ్వం, అందులో తన స్థానం, గమ్యాలకు సంబంధించి మానవుని ఆలోచనల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులన్నీ సైన్స్ మూలంగానే వచ్చాయి. ప్రాచీన గ్రీసులో గానీ, మధ్యయుగాల తూర్పు దేశాల్లో గానీ, ఐరోపాలోని సాంస్కృతిక పునర్వికాస కాలంలో గానీ నూతన శాస్త్రీయ ఆవిష్కరణలే కొత్త భావాల వ్యాప్తికి కారణమయ్యాయి. ఈ భావాలు సామాజిక వ్యవస్థలో మార్పులకు దారితీశాయి. ఉదాహరణకు గెలీలియో, న్యూటన్ కనుగొన్న ప్రకృతి సూత్రాలు ఆర్థిక శాస్త్రంలో స్వేచ్ఛా వాణిజ్యాన్నీ, రాజకీయాలలో లిబరలిజాన్నీ సమర్థించే భావజాలం వ్యాప్తికి కారణమైనాయి. తిరిగి ఇటువంటి లిబరల్ ఆలోచనా ధోరణి నుండి ఛార్లెస్ డార్విన్ ప్రకృతివరణ సిద్ధాంతం పుట్టుకొచ్చింది. మళ్ళీ ఇదే ప్రకృతివరణ సిద్ధాంతాన్ని ఐరోపావాసులు తమ వలస దోపిడీని సమర్థించుకోవడానికి ఉపయోగపెట్టుకున్నారు. సైన్స్ చరిత్రలో మనకు ఇటువంటి ఉదాహరణలు ఎన్నో కనిపిస్తాయి.

"సైన్స్ చరిత్రను మొత్తంగా పరిశీలిస్తే దాని అభివృద్ధిలోని ప్రతి మలుపులో జరిగిన ప్రతి కొత్త ఆవిష్కరణా పాత భావాలతో ఘర్షించి కొత్త భావాలకు అంకురార్పణ జరిపింది. ఈ కొత్త భావాలు వికసించి తిరిగి కొత్త ఆవిష్కరణలకు మార్గమిచ్చాయి. ఈ విశ్వం, అందులో తన స్థానం, గమ్యాలకు సంబంధించి మానవుని ఆలోచనల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులన్నీ సైన్స్ మూలంగానే వచ్చాయి."

### పెట్టుబడిదారీ పూర్వ సమాజాల్లో

ఆది మానవుడు వేటపై ఆధారపడి జీవించేవాడు. వేట గుంపు జీవనాన్ని ప్రోత్సహించింది. గుంపు మనుగడ ప్రకృతిలో లభించే జంతువులు, వృక్షాలపై ఆధారపడి వుండేది. అందువల్ల ఆదిమానవుని ఆలోచనలు ప్రకృతిని ప్రసన్నం చేసుకోవడం ఎలా అన్న అంశం ప్రాతిపదికగా వుండేవి. తనకు ఆహారం సమృద్ధిగా ప్రసాదించమని ప్రకృతిని వేడుకునేవాడు. జంతువులు, వృక్షాల మాదిరిగా వేషాలు వేసి క్రతువులు నిర్వహించేవాడు. అలా చేస్తే ప్రకృతి తనకు ఆ జంతు వృక్షాలను సమృద్ధిగా ఇస్తుందని నమ్మేవాడు. ఆ విధంగా వేటలో ఉపయోగించే పరికరాలను మెరుగుపరుచుకుంటూనే, వేటలో గుంపు నైపుణ్యాన్ని పెంచుకుంటూనే ప్రకృతి సిద్ధమైన పరిమితులను అధిగమించేందుకు ఆది మానవుడు మంత్ర తంత్రాలపై ఆధారపడ్డాడు. ఆ మంత్ర విద్యనే తరువాతి తరాలకు నేర్పడం నాటి విద్యా విధానంగా ఉండేది.

తరువాత చాలాకానికి మానవుడు వ్యవసాయాన్ని కనుగొన్నాడు. అంతకుముందు వేటకు ఉపయోగించిన పనిముట్లకు భిన్నమైన పనిముట్లు వ్యవసాయానికి అవసరమయ్యాయి. తొల్కిక, నాగలి, బుట్ట, కుండ వంటి వస్తువుల తయారీ ఆరంభమైంది. పశువులను మచ్చిక చేసుకోవడం జరిగింది. కాల్వల త్రవ్వకం, పొలాలు, ధాన్యం కొలతలు, సరుకుల రవాణా వంటి అవసరాలు కొత్త కొత్త విజ్ఞాన శాస్త్ర అంశాలను వెలుగులోకి తెచ్చాయి. వర్షం కోసం, వాతావరణ పరిస్థితుల కోసం ఖగోళ పరిశీలన ఆరంభమైంది. ఈ రకంగా వ్యవసాయం మానవుని ఆలోచనలలో అనేక మార్పులు తెచ్చింది. అప్పటి వరకు జంతువుల వేట, దానికి సంబంధించిన పనిముట్లు, నైపుణ్యంపై జరిగే చర్చ, ఆ చర్చ చుట్టూ అల్లుకోబడిన గాథలు ఇప్పుడు వ్యవసాయం, దాని చుట్టూ గల పనిముట్లు, ఇతర విజ్ఞాన శాస్త్రాలకు మళ్ళాయి. అప్పటి వరకు చెట్లనూ, పుట్టలనూ, జంతువులనూ దేవుళ్ళూ దేవతలుగా ఆరాధించే స్థితి నుండి ఇప్పుడు ఆకాశం, భూమి, సముద్రాలు, నదులు వంటి విశాలమైన ప్రకృతి విషయాలను గురించి ఆలోచించే స్థితి వచ్చింది. ఆకాశానికీ, భూమికీ ఉన్న సంబంధం – భూమి మీద సముద్రాలకూ, నదులకూ, అడవులకూ వున్న సంబంధం – వీటన్నింటికీ ఆనాడు సమాధానాలు చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. ఆ సమాధానాలే పురాణ గాథలుగా ఏర్పడ్డాయి.

మొట్టమొదటి వ్యవసాయ సమాజాలు ఈజిప్టు, మెసపుటోమియా, భారత్‌లోని సింధుమైదానం, చైనాలోని హోయాంగ్ హో మైదానాల్లో ఏర్పడ్డాయి. ఈ ప్రాంతాలన్నింటా ఆనాడు ఆవిర్భవించిన పురాణాల్లో భూమి, ఆకాశం, నక్షత్రాలు, గ్రహాలు, సముద్రాలు, నదులు మొదలైనవాటికి మానవ రూపాలిచ్చిన వైనం మనకు కనిపిస్తుంది. జల ప్రళయం సంభవించడం, జలం నుండి జీవరాశి ఉద్భవించడం – అనే కథలు ఈ నాగరికతలన్నింటిలోనూ కనిపిస్తాయి.

వ్యవసాయం తరువాత ఇనుము కనుగొనడంతో మానవుని ఆలోచనా క్రమం మరో మలుపు తిరిగింది. క్రీస్తు పూర్వం 1400 సంవత్సరాల నాడు ఇనుము తొలిసారిగా ఉపయోగంలోకి వచ్చింది. వెయ్యి సంవత్సరాల కాలంలో అది ప్రపంచ వ్యాపితంగా విస్తరించింది. ఇనుము ఉపయోగానికి ముందు కంచుయుగంలో, కంచు పనిముట్లు ప్రధానంగా కులీన కుటుంబాలకు మాత్రమే పరిమితమయ్యేవి. నిజానికి అవి ప్రత్యక్షంగా

> **"ప్రాచీన గ్రీసులో బానిస యజమానుల ప్రజాస్వామ్యంలో సైన్సు వికసించినట్లే భారత దేశంలో కూడా శాస్త్రీయ ఆలోచనా విధానం వేల ఏళ్లుగా విలసిల్లింది. మన దేశంలో చార్వాకులు, సాంఖ్యులు, లోకాయతులు, భౌద్ధులు మొదలైన వాళ్లు ప్రాచీన కాలంలోనే హేతుబద్ధ ఆలోచనా ధోరణిని ప్రచారం చేశారు. నిజానికి గ్రీకు విజ్ఞానులకన్నా ముందే భారత దేశంలో ఉద్దాలక అరుణి అనే పండితుడు విశ్వాన్నీ, మానవునీ, ప్రకృతినీ వస్తుగతంగా, ఉన్నది ఉన్నట్టుగా అర్థం చేసుకునే పద్ధతిని పాటించాడు."**

ఉత్పత్తికి ఉపయోగపడలేదు. పొలాలలో పనిచేసే రైతులు రాతి పనిముట్లనే ఉపయోగించేవారు. కాని ఇనుము ఉపయోగంలోకి వచ్చాక ఇనుప గొడ్డలి, పలుగు, పార, కొడవలి, సుత్తి వంటి పనిముట్లు శ్రామికులందరికీ అందుబాటులోకి వచ్చాయి. ఇనుము ఉపయోగంలోకి రావడంతో నూతన నాగరికతలు వెల్లివిరిశాయి. ఇనుప పనిముట్లతో విస్తారమైన అడవులను నరికి పొలాలు చేశారు. పెద్ద పెద్ద ఓడలు చేసి నదులు, సముద్రాలు దాటారు. దూర, తీర ప్రయాణాలు పెరిగాయి. దాంతో ఇనుము మానవుని ఆలోచనలో కూడా పెద్ద మార్పు తెచ్చింది.

ఇనుము భౌతిక శ్రమకూ, మనిషి ఆలోచనలకూ గట్టి ముడివేసింది. అందుకే ఇనుప యుగపు నాగరికతలన్నింటిలోనూ భౌతికవాద ఆలోచనలు ఆవిర్భవించాయి. భారతదేశంలో సాంఖ్యం, చార్వాకం, లోకాయత, బౌద్ధం, చైనాలో కన్‌ఫ్యూషియస్, టావోయిజం ఇవన్నీ ఇనుప యుగంలో అభివృద్ధి చెందిన భావజాలాలే. ఇవి ఈ ప్రపంచాన్ని భౌతికవాద దృక్పథంతో వర్ణించాయి. ప్రకృతి అంతా పదార్థమయమని, పదార్థం చలనశీలమైనదని చెప్పాయి. ఆ విధంగా మొదటిసారి ప్రకృతిని భౌతికవాద దృక్పథంతో పరిశీలించే ధోరణి ఆరంభమైంది.

**గ్రీకు విజ్ఞానం**

ఈ శాస్త్రీయ ధోరణి గ్రీసులో మరింత ఉచ్ఛస్థితికి వెళ్ళింది. నిజానికి క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలోనే తొలిసారిగా గ్రీసులో సైన్స్ ఒక నిర్ధిష్ట శాస్త్రంగా రూపుదిద్దుకుంది. వృత్తిపరమైన సాంకేతికత నుండి సైన్స్ వేరుపడింది. గణితం, తర్కశాస్త్రాలలో నూతన ఆవిష్కరణలు జరిగాయి. తత్వశాస్త్రం కొత్త పుంతలు తొక్కింది. థేల్స్, హిరాక్లిటస్, ఎంపెడోక్లెస్, డెమోక్రటిస్ వంటి వారు ఈ ప్రపంచం పదార్థంతో నిర్మితమైందని, పదార్థ సంయోగ వియోగాల వల్ల అది నిత్యం మారుతూ వుంటుందని చెప్పారు. డెమోక్రటిస్ అణు సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. వీరి తరువాత వచ్చిన పైథాగరస్ ఈ ప్రపంచమంతా "సంఖ్య"ల మయం అని చెప్పారు. గణితశాస్త్రంలో ఆయన కొత్త ఆవిష్కరణలు చేయడమే కాదు, మొత్తం సమాజంలోనే గణితాన్ని, సంఖ్యాశాస్త్రాన్ని ఒక పెద్ద చర్చనీయాంశంగా మార్చారు. ఖగోళ శాస్త్రంలో వృత్తం, గోళాల భావనను ఆయన తొలిసారి ప్రవేశపెట్టాడు. భూమి గోళాకారంగా ఉంటుందని చెప్పాడు. సూర్యుడు, చంద్రుడు, ప్రతి భూమి (భూమికి ప్రతిరూపం)తో కలిసి అది వృత్తాకారంలో పరిభ్రమిస్తుందని చెప్పాడు.

పైథాగరస్ ఆలోచనా ధోరణి గ్రీకు సమాజంపై పెద్ద ప్రభావం కలుగజేసింది. ఆయన గ్రీసు దేశంలో ఒక రుషిగా మారాడు. ఆయనకు పెద్ద ఎత్తున అనుచరగణం బయలుదేరింది. అయితే పైథాగరస్ సంఖ్యాశాస్త్రం రానురాను శాస్త్రీయమార్గం నుండి వైదొలగి ఒకరకమైన అయోమయవాదంలోకి ప్రవేశించింది. ఆనాడు భారతదేశంలో బౌద్ధం మాదిరిగానే పైథాగరస్ సిద్ధాంతంలో కూడా మార్మికత వెర్రితలలు వేసింది. పైథాగరస్ కనుగొన్న వ్యవకలన తర్కం ద్వారా ఆధారాలు రాబట్టే విధానం నేటికీ గణితశాస్త్రంలో అనుసరణీయంగా ఉన్నప్పటికీ అదే పద్ధతిని ఉపయోగించుకొని వాస్తవికతల నుండి విడదీసి సమాజానికి భాష్యం చెప్పే భావవాద ఆలోచనలు కూడా బయలుదేరాయి. ముఖ్యంగా సోక్రటీస్, ప్లేటోల భావవాద తర్కశాస్త్రాలు ఆనాడు సమాజంపై చెరగని ముద్రవేశాయి.

గ్రీసులో నాటి సామాజిక పరిస్థితులే నూతన శాస్త్రీయ భావాల అభివృద్ధికీ, వాటి పతనానికి కూడా కారణం అయ్యాయి.

గ్రీసు దేశం ఆనాడు చిన్న చిన్న నగర రాజ్యాలుగా వుండేది. ఏథెన్స్‌లో బానిస యజమానుల ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో వుండేది. ఈ వ్యవస్థలో మంచి ఉపన్యాసకులకు ప్రజలు ప్రాధాన్యమిచ్చేవారు. అందువల్ల పదాల మీద పట్టు సాధించడం, తర్కబద్ధంగా వాదించడం ఒక కళగా, శాస్త్రంగా అభివృద్ధి చెందింది. సోక్రటీస్ తర్కశాస్త్రంలో నూతన పద్ధతులు ఆవిష్కరించారు. ప్రత్యర్ధికి అనేక ప్రశ్నలు వేసి వాటికి సమాధానాలు రాబట్టడం ద్వారా తన వాదనను నిరూపించడం ఆయన పద్ధతి. సోక్రటీస్ శిష్యుడైన ప్లేటో ఈ తర్కశాస్త్రాన్ని పూర్తిగా భావవాద ఆలోచనా విధానంగా మార్చేశాడు. గ్రీకు ప్రజాస్వామ్యం నాశనమైన తరువాత కులీనుల వంశ పారంపర్య పరిపాలనకు మద్దతిచ్చేందుకు ఈ శాస్త్రాన్ని ఉపయోగించాడు. ఆయన రాసిన "రిపబ్లిక్" (ఆదర్శ రాజ్యం), "చట్టాలు" మొదలైన గ్రంథాలు ఈ రకమైన తిరోగమన వాదాన్ని ముందుకు తెచ్చాయి.

ఈ అనంత విశ్వాన్ని వర్ణించడంలో థేల్స్, అనగ్జిమాండర్, పైథాగరస్ వంటి గ్రీకు శాస్త్రవేత్తలు అప్పటి వరకు వున్న నమ్మకాలను సవాలు చేశారు. వీరికి ముందు చంద్రుడు, సూర్యుడు, ఇతర గ్రహాలను దేవతలుగా ప్రజలు భావించేవారు. అనగ్జిమాండర్, థేల్స్ మొదలైనవారు వీటిని ఆకాశంలో పరిభ్రమిస్తున్న అగ్నిగోళాలని వర్ణించారు. పైథాగరస్ భూమి గోళాకారంగా వుందని, అది ఇతర గ్రహాలతో కలిసి వృత్తాకారంలో పరిభ్రమిస్తున్నదని చెప్పాడు. వాస్తవికతకు దగ్గరగా వున్న ఇటువంటి భావాలను సాంప్రదాయవాదులు ఖండించారు. ప్లేటో ఆకాశంలో గోళాలు ఎలా వున్నాయో వర్ణించకుండా ఎలా ఉండాలో తార్కికంగా చెప్పాడు. అంతేకాదు, ఎన్నటికీ మార్పు లేకుండా ఒకే విధంగా తిరుగుతున్న గ్రహాలూ, సూర్యుడూ, చంద్రుడూ నిజానికి దేవతలేనని చెప్పాడు. ఆ విధంగా పాత నమ్మకాలపై శాస్త్ర విజ్ఞానం విసిరిన సవాలును ప్లేటో వమ్ముచేశాడు.

ప్లేటో శిష్యుడైన అరిస్టాటిల్ ప్రాచీన గ్రీకు శాస్త్రవేత్తలందరిలోకీ గొప్పవాడు. ఈయన తర్కశాస్త్రం, భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం,

మానవ శాస్త్రాలన్నింటిలోనూ గొప్ప కృషి చేయడమే కాదు, ఈ శాస్త్రాలకు తొలిసారిగా ఒక రూపం ఇచ్చి స్థిరీకరించాడు. వర్గీకరణ ద్వారా విషయ నిరూపణ అరిస్టాటిల్ అనుసరించిన పద్ధతి. వృక్షాలు, జంతువుల మధ్య నున్న పోలికలు, తేడాల ద్వారా వాటిని వర్గీకరించాడు. ఇది దేనితో పోలి వుంది? పోలివున్న వస్తువులో ఇది విభేదించే అంశలేమిటి? ఈ రెండు ప్రశ్నలతో ఆయన సర్వస్వాన్నీ వర్గీకరించాడు. అరిస్టాటిల్ ఈ ప్రపంచాన్ని ఒకదానికి మరొకటి లోబడి ఉండే స్థిరమైన స్థితిగా వర్ణించాడు. ప్రపంచంలో ప్రతి వస్తువుకు తన స్థానం ఏమిటో బాగా తెలుసు. ఒకవేళ అక్కడి నుండి కదిలినా తిరిగి తన స్థానానికి వచ్చి చేరుతుందని చెప్పాడు. ఆ విధంగా ఆనాటి సమాజంలో బానిస విధానాన్ని సమర్ధించాడు. కాని అనేక విజ్ఞాన శాస్త్ర రంగాలలో అరిస్టాటిల్ స్థిరపరిచిన భావాలు తరువాత 2000 సంవత్సరాలపాటు ప్రపంచాన్ని ఏలాయంటే అతిశయోక్తి కాదు.

**ప్రాచీన భారత దేశంలో సైన్సు వికాసం**

ప్రాచీన గ్రీసులో బానిస యజమానుల ప్రజాస్వామ్యంలో సైన్సు వికసించినట్లే భారత దేశంలో కూడా శాస్త్రీయ ఆలోచనా విధానం వేల ఏళ్లుగా విలసిల్లింది. మన దేశంలో చార్వాకులు, సాంఖ్యులు, లోకాయతులు, బౌద్ధులు మొదలైన వాళ్లు ప్రాచీన కాలంలోనే హేతుబద్ధ ఆలోచనా ధోరణిని ప్రచారం చేశారు. నిజానికి గ్రీకు విజ్ఞానులకన్నా ముందే భారత దేశంలో ఉద్దాలక అరుణి అనే పండితుడు విశ్వాన్నీ, మానవునీ, ప్రకృతినీ వస్తుగతంగా, ఉన్నది ఉన్నట్టుగా అర్ధం చేసుకునే పద్ధతిని పాటించాడు. ప్రయోగాలకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలను అతడే రూపొందించాడు. అందువల్ల అతన్ని ప్రపంచ తొలి ప్రకృతి శాస్త్రవేత్తగా పరిగణిస్తున్నారు. అయితే ఆధిపత్యవర్గాలు, వాటికి వత్తాసుగా పని చేసే తత్వవేత్తలు ఉద్దాలకుని భావాలను కలగాపులగంగా వక్రీకరించి అతడి నిజమైన భావాలను ప్రజలు గ్రహించకుండా అడ్డుపడ్డారు. శతపథ బ్రాహ్మణం క్రీ.పూ. 10 వ శతాబ్దం నుండి 7వ శతాబ్దం మధ్య కాలానికి చెందిన గ్రంధం. అందులో ఉద్దాలకుడికి సంబంధించిన గాథను ప్రస్తావించారు. థేల్స్ క్రీ.పూ.6వ శతాబ్దానికి చెందినవాడు. అంటే ఉద్దాలకుడు థేల్స్ కంటే ముందరి కాలానికి చెందినవాడు.

> **“ క్రీస్తు శకం 14వ శతాబ్దంలో తొలుత ఇటలీలోనూ, తరువాత యూరప్‌లోని పలు దేశాల్లోనూ కొత్తగా ఆవిర్భవించిన పెట్టుబడిదారీ వర్గం కొత్త ఆలోచనలకు తెరలేపింది. 'సాంస్కృతిక పునరుజ్జీవనం' పేరుతో ప్రారంభమైన కొత్త ఆలోచనా ధోరణి శాస్త్ర పరిశోధనా శకానికి అంకురార్పణ చేసింది. సముద్ర వ్యాపారాల ద్వారా, మత యుద్ధాల ద్వారా పోగుపడిన ప్రాథమిక పెట్టుబడి పెద్ద ఎత్తున పోటీని పెంచింది**



**భారతదేశ తొలి శాస్త్రవేత్త ఉద్దాలక అరుణి**

“కంటికి కనిపించే వాటికి సంబంధించిన భ్రమాన్వితమైన కట్టుకథలను నిరాకరించి మన ముందున్నవాటిని ఉన్నవి ఉన్నట్టుగా తెలుసుకునే ప్రయత్నం చేస్తేనే వాటి గురించిన జ్ఞానాన్ని పొందగలం” అని ఉద్దాలకుడు చెప్పాడు. “ఈ ప్రపంచం మొదటినుంచీ ఉంది. ఇంకొక ప్రపంచం లేదు. ఈ ప్రపంచం సత్. కొందరు మొదట్లో ఈ ప్రపంచం లేని స్థితి (అసత్) ఉండేదని అంటారు. ఆ ఉనికిలో లేకపోవడం నుంచే ఈ ప్రపంచం ఉనికిలోకి వచ్చిందని అంటారు. అంటే అసత్ నుండి సత్ వచ్చిందని వారు అంటారు. కాని వాస్తవంగా ఉనికిలో ఉన్నది ఉనికిలో లేనిదానినుండి ఎలా వస్తుంది? శూన్యం నుండి శూన్యమే వస్తుంది తప్ప ఇంకేదీ పుట్టదు” అంటాడు ఉద్దాలకుడు.

నీరు, నిప్పు, భూమి, గాలి అనే నాలుగు మూల భూతాల కలయిక ఫలితంగా యావత్ విశ్వం, దానిలోని వస్తు సముదాయం సృష్టించబడతాయని లోకాయతులు చెప్పారు. పై చతుర్భూతాల సమ్మేళనాల మధ్య ఉండే గుణాత్మక, పరిణాత్మక తేడాలే ప్రపంచంలోని పదార్ధిక వైవిధ్యానికి కారణమని వారు వివరించారు. పదార్ధమంతా అణువులతో నిర్మితమై ఉంటుందని కణాదుడు చెప్పాడు. నాలుగు రకాల అణువులుంటాయి, రెండు రకాలు పదార్ధం కలిగి ఉంటే మరి రెండు రకాల్లో పదార్ధం ఉండదని చెప్పాడు. సాంఖ్యుల తర్కం, పైథాగరస్ సంఖ్యా శాస్త్రం ఇనుప నాగరికతల నుండి పుట్టినవే.

క్రీస్తుపూర్వం 2500 సంవత్సరాల నాడే విలసిల్లిన సింధులోయ నాగరికతలో తూనికలు, కొలతల వ్యవస్థ ఉండేది. క్షేత్ర గణితం అభివృద్ధి చెందకుండా ఉంటే వారు ఆనాడు అంతటి క్రమబద్ధ మైన నగరాలు నిర్మించగలిగేవారు కాదు. సింధునాగరికత నాటికే భారత దేశంలో చక్రం కనుగొనబడింది. తరువాతి కాలంలో మన దేశంలో వైద్య, ఖగోళ, గణిత శాస్త్రాల్లో అనేక విజయాలు సాధించబడినాయి.

వైద్యం, గణితంలో ప్రాచీన భారత దేశంలో అనేక విజయాలు సాధించబడ్డాయి. భారత్‌లో జరిగిన మూడు ఆవిష్కరణలు నేటికీ గణితానికి ఆధారంగా ఉన్నాయి. అవి 1. స్థాన-విలువ భావన, 1 దశమ (10) ప్రాతిపదిక, 3. సున్నాను ఒక సంఖ్యగా

**(మిగతా 35వ పేజీలో)**

# సరిహద్దు వివాదంపై చైనాతో ఒప్పందం



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

ఎ.కోటిరెడ్డి

**భా**రత ప్రభుత్వ ఏజంట్లు తమ దేశ పౌరుని హత్య చేయటం కోసం కిరాయి హంతకులను వినియోగించారని కెనడా బహిరంగంగా ఆరోపణలు చేయగా, ఇదే విధమైన ఆరోపణలతో అమెరికా ప్రభుత్వాధికారులు మరో కేసు నమోదు చేశారు. ఈ పూర్వరంగంలో రష్యాలోని కజాన్ నగరంలో జరిగిన బ్రిక్స్ సమావేశానికి ముందు డోక్లాన్ సరిహద్దు వద్ద ఉభయ దేశాలు సంయుక్తంగా పహారా కాయటంపై భారతదేశం-చైనాల మధ్య అంగీకారం కుదిరింది. దేశాల మధ్య సంబంధాలు బలపడటానికి దీర్ఘకాలిక కృషి అవసరం. కాని జరుగుతున్న పరిణామాలు కూడా ఆ కృషిని ప్రభావితం చేస్తాయి. ఆ విధంగా కెనడా మనదేశంపై చేస్తున్న ఆరోపణలకు అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు మద్దతు ఇవ్వటం, అమెరికాయే స్వయంగా ఆరోపణలు చేసిన పూర్వరంగంలో కజాన్‌లో జరిగిన బ్రిక్స్ దేశాల నాయకుల సమావేశం సదర్భంగా ప్రధాని నరేంద్ర మోడి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. సరిహద్దు సమస్యపై ఒక ఒప్పందానికి వచ్చారు. ఒప్పందానికి అనుగుణంగా ఉభయదేశాలూ వాస్తవాధీన రేఖ(ఎల్‌ఎసి) వెంట సైన్యాలను ఉపసంహరించటం ప్రారంభించాయి. తూర్పు లడఖ్‌లో ఏర్పాటు చేసిన బఫర్ జోన్(ఉభయ దేశాల సైనికుల మధ్య ఏర్పాటు చేసిన నిర్దిష్ట ప్రాంతం)లను రద్దు చేస్తారా లేదా అని కొందరు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. సైన్యం 2020 నాడు ఉన్న ప్రాంతాలకు తిరిగి వెళతుందని ప్రభుత్వం ప్రకటించింది. కాని డెమ్‌చోక్, డెన్‌పాంగ్ బఫర్ జోన్‌లు ఒప్పందంలో భాగం కాదని, అక్కడ ప్రస్తుతం ఉన్న పరిస్థితులే కొనసాగవచ్చునని కొందరు అధికారులు చెబుతున్నారు.

మినహాయింపులు ఉన్నప్పటికీ సరిహద్దు వద్ద ఉద్రిక్తతలను తగ్గించటంతో పాటు, మన పొరుగు దేశమైన చైనాతో సంబంధాలు మెరుగుపడటానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందనటంలో సందేహం లేదు. భారత-చైనాల మధ్య సరిహద్దు వివాదాన్ని సామ్రాజ్యవాదులు సృష్టించారు. తమకు అవసరమైనపుడల్లా దానిని వారే కెలుకుతూ, ఉభయ దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడకుండా ఆటంకాలు కల్పిస్తుంటారు. తమ ప్రపంచ ఆధిపత్య వ్యూహంలో భాగంగా చైనాకు వ్యతిరేకంగా మన దేశాన్ని ఉపయోగించుకోవటానికి అమెరికన్ సామ్రాజ్యవాదులు ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం మన పాలకవర్గాలపై రకరకాలుగా ఒత్తిడి తెస్తుంటారు. గతంలో దేశాన్ని పాలించిన ప్రభుత్వాల కన్నా ప్రస్తుత బిజెపి ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి సులభంగా లొంగిపోతున్నది.

### గాజా ఊచకోత, ఉక్రెయిన్ యుద్ధం సామ్రాజ్యవాదుల వ్యూహంలో భాగం

ప్రపంచంపై సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవటం, మరింతగా బలపరచుకోవటం కోసమే ప్రస్తుతం ప్రపంచంలో ఒకచోట ఒక జాతిని ఊచకోత కోయటం, మరొక చోట యుద్ధం జరుగుతున్నాయి. గాజాలో పాలస్తీనీయుల ఊచకోత, ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధాన్ని సామ్రాజ్యవాదులు ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచంలోని ఏ దేశంలో అయినా ప్రజలు, ప్రభుత్వాలు తమ ప్రయోజనాలను కాపాడుకోవటం కోసం స్వతంత్రంగా వ్యవహరించటాన్ని సామ్రాజ్యవాదులు సహించరు. సామ్రాజ్యవాదులకు నాయకత్వం వహిస్తున్న అమెరికన్ పాలకవర్గాలు, ప్రభుత్వం ప్రపంచ దేశాలలోని ప్రభుత్వాలన్నీ తమ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించాలని నిరంతరం ఒత్తిడి చేస్తున్నాయి.

మోడి నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదుల ఒత్తిడులకు లొంగిపోతున్నది. సామ్రాజ్యవాదులు రూపొందించిన సరళీకరణ ఆర్థిక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తున్నది. ఈ క్రమంలో దేశసంపద, ప్రజల ఆస్తులను సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించటానికి పూనుకున్నది. ఎగుమతులు-దిగుమతులపై వివిధ రకాల ఆంక్షలు, పన్నులు విధించటం, ఆర్థిక, రాజకీయ అంశాలలో, మొత్తంగా ప్రపంచ వ్యవహారాలలో మన పాలకవర్గాలు అమెరికాకు దాసోహం అంటున్నాయి. అమెరికన్ సామ్రాజ్యవాదుల చేస్తున్న జన హననానికి, దురాక్రమణలకు మోడి ప్రభుత్వం ఇస్తున్న మద్దతుకు గాజా, ఉక్రెయిన్‌లు ఉదాహరణలుగా ఉన్నాయి.

గాజాలో పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ నిరంతరం దాడులకు పాల్పడుతున్నది. గాజా, పాలస్తీనాలోని ఇతర ప్రాంతాలలోని పౌరులకు ఎటువంటి హక్కులు లేవు. వారు కనీస స్వేచ్ఛకు కూడా నోచుకోవటం లేదు. వారిపై దాడులు చేయటం, హత్యలు చేయటం ఇజ్రాయిల్ సైన్యాలకు నిత్యకృత్యంగా ఉన్నది. ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాలను ఇజ్రాయిల్ ఏ మాత్రం ఖాతరు చేయటం లేదు. ఈ దురాగతాలను పాలస్తీనా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇజ్రాయిల్ దాడులు, హింసాకాండ నుండి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ఈ పూర్వరంగంలో పాలస్తీనాలోని హమాస్ సాయుధ సంస్థ గత సంవత్సరం

అక్టోబరు 7వ తేదీన ఇజ్రాయిల్‌పై రాకెట్లను ప్రయోగించింది. దానిని సాకుగా చేసుకున్న ఇజ్రాయిల్ గాజాలోని పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్నది. గాజా నుండి పాలస్తీనీయులను తరిమివేసి, ఆ ప్రాంతాన్ని కూడా ఇజ్రాయిల్‌లో భాగంగా చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నది. గాజాకే పరిమితం కాకుండా చుట్టుపట్ల ఉన్న లెబనాన్, సిరియా, ఇరాన్ తదితర దేశాలపై కూడా దాడులు చేస్తూ ఆ దేశాలను బెదిరించటానికి పూనుకున్నది. ఈ మారణహోమాన్ని, దాడులను ప్రపంచ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అమెరికా ఇజ్రాయిల్ దురాగతాలను బలపరుస్తున్నది. అమెరికా, నాటో, ఇతర సామ్రాజ్యవాద దేశాలు ఇజ్రాయిల్‌కు అయుధాలు, ఆర్థిక సహకారాన్ని అందిస్తూ ఈ మారణకాండకు పూర్తి మద్దతిస్తున్నాయి.

గతంలో పాలస్తీనా స్వతంత్ర పోరాటానికి మనదేశం మద్దతునిచ్చింది. ప్రస్తుత మోడి ప్రభుత్వం నోటి మాటగా పాలస్తీనాకు మద్దతు అంటూ ఇజ్రాయిల్ ఊచకోతను పూర్తిగా బలపరుస్తున్నది. ఈ ఊచకోతకు ఇజ్రాయిల్ ఉపయోగిస్తున్న ఆయుధాలలో కొన్ని మనదేశం నుండి కూడా సరఫరా అవుతున్నాయి. ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరాను ఆపాలన్న డిమాండ్‌ను మోడి ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. హిందుత్వ ఎజెండాతో సామ్రాజ్యవాదుల ఆధిపత్య వ్యూహానికి అనుగుణంగా మోడి ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

ఉక్రెయిన్–రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధంలో కూడా మనదేశం వ్యవహరిస్తున్న తీరు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉన్నది. మనదేశంపై సామ్రాజ్యవాదుల పట్టు పెరగటం విదేశాంగ విధానంలో ప్రతిఫలిస్తున్నది.

ఈ విధంగా లొంగుబాటుతో వ్యవహరిస్తున్నప్పటికీ మనదేశాన్ని మరింతగా లొంగదీసుకోవటానికి, తమ ఆధిపత్య వ్యూహంలో పావుగా వినియోగించుకోవటానికి అనేకరకాలుగా వత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలోనే అమెరికా మన ప్రభుత్వ అధికారులపై ఆరోపణలు చేసింది. తమ దేశ పౌరులను హత్య చేయటానికి భారత ప్రభుత్వ సంస్థ కిరాయి హంతకులను ఏర్పాటు చేసిందని గతంలో కెనడా చేసిన ఆరోపణలను కూడా అమెరికా బలపరిచింది. కెనడాలో జరుగుతున్న భారత వ్యతిరేక కార్యకలాపాలపై మాత్రం మౌనం వహించింది. అమెరికాతో

> **“ అమెరికాకు మిత్రదేశంగా మారితే పొరుగుదేశమైన చైనాతో పాటు రష్యాను కూడా వ్యతిరేకించాలి. ప్రపంచంలోని అభ్యుదయ ప్రభుత్వాలు, శక్తులు, సంస్థలకు దూరం కావాలి. వారందరితో మన సంబంధాలు బలహీనపడతాయి. గాజాపై ఇజ్రాయిల్ మారణకాండను బహిరంగంగా బలపరచాలి. రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌ను బలపరచాలి. ”**



చైనా అధ్యక్షుడు సి జిన్‌పింగ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోడీ

వ్యూహాత్మక భాగస్వామ్యం అంటూ మన పాలకవర్గాలు లొంగిపోతుంటే, మరోవైపున అమెరికా మన దేశాన్ని పూర్తిగా తన తాబేదారుగా మార్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నది.

కెనడా, అమెరికా చేస్తున్న ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలను ప్రభుత్వం వెల్లడించాలి. ఆరోపణలన్నింటిపైనా విచారణ జరిపించాలి. సాక్ష్యాలతో వారి ఆరోపణలను తిప్పికొట్టాలి. ఒకవేళ ఈ ఆరోపణలలో వాస్తవం ఉంటే వాటిని సరిచేసుకోవటానికి పూనుకోవాలి. ఏమైనా ఈ విషయంలో ప్రతిపక్షాలు, పౌరసంస్థలు, దేశప్రజలను ప్రభుత్వం విశ్వాసంలోకి తీసుకోవాలి. ప్రతిపక్ష పార్టీలు, పౌరసంస్థలతో సమావేశం జరిపి జరుగుతున్న పరిణామాలను వివరించాలి.

అమెరికాకు పూర్తిగా లొంగిపోతే ఏం జరుగుతుంది?

అమెరికాకు మన దేశం పూర్తి మిత్రదేశంగా ఉండాలని, అమెరికా ఏం చెబితే అది చేయాలని, అమెరికన్ సామ్రాజ్య వాదుల అడుగుజాడలలో నడవాలని ప్రచారం చేస్తున్నవారు దేశంలో ఉన్నారు. అమెరికాకు మిత్రదేశంగా ఉండటంలో అమెరికా అభిష్టానికి అనుగుణంగా చైనాకు వ్యతిరేకంగా నిలబడటం కీలకమైనది. సమకాలీన ప్రపంచంలో అసమానమైన ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్న చైనా ఆర్థికంగా అమెరికాకు ప్రధాన పోటీదారుగా అవతరించింది. 19 ట్రిలియన్ డాలర్ల జిడిపితో రెండవస్థానంలో ఉండటమే కాక, కొనుగోలు శక్తి(పిపిపి) ప్రాతిపదికన అమెరికాను అధిగమించి, మొదటి స్థానంలో ఉన్నది. సరుకుల ఉత్పత్తి, ఎగుమతులలో ప్రథమ స్థానంలో ఉంది. బ్రెజిల్, రష్యా, ఇండియా, దక్షిణాఫ్రికాలతో కలిసి బ్రిక్స్ కూటమిని ఏర్పాటు చేయటంలో ముఖ్యపాత్ర పోషించింది. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకును ఏర్పాటు చేసి, అనేక దేశాలకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నది. బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ కార్యక్రమం ద్వారా అనేక దేశాలలో పెట్టుబడులు పెడుతున్నది. ఫలితం

> **"విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీల పేరుతో 6,012 కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. ఇది తాము వేస్తున్న భారం కాదని, జగన్ హయాంలో వాడిన కరెంటుకు చెల్లించాల్సిన మొత్తమని ప్రజలను నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నారు. జగన్ హయాంలో అన్ని రంగాలను నాశనం చేశారని ప్రచారం చేస్తున్నారు. ఈ వాదన ప్రకారం ప్రజలపై భారాలు మోపి, జగన్ పాలన ఫలితంగా ఈ భారాలు పడ్డాయని చెప్పి తప్పించుకోవచ్చు."**

గా ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాలలో చైనా ప్రతిష్ఠ పెరుగుతున్నది. ఇది అమెరికా ఆధిపత్యానికి ప్రమాదంగా మారింది. కాబట్టి చైనా అభివృద్ధిని దెబ్బతీయటం, ఆర్థికంగా, రాజకీయంగా దానిని ఏకాకిగా చేయటం అమెరికా వ్యూహంలో ప్రధానాంశంగా ఉన్నది. దీనిని సాధించటం కోసం చైనాకు వ్యతిరేకంగా మన దేశాన్ని రెచ్చగొడుతున్నది. చైనా మనదేశంపై దురాక్రమణకు పాల్పడుతున్నదని, మన భూభాగాన్ని ఆక్రమిస్తున్నదని, చైనాను ఎదుర్కోవటం మన లక్ష్యంగా ఉండాలని అమెరికా మన పాలకవర్గాలను వత్తిడి చేస్తున్నది. మనదేశ ఆర్థికాభివృద్ధి కొద్ది సంవత్సరాలలోనే చైనాను మించిపోతుందని గాలికొడుతున్నది.

అమెరికాకు మిత్రదేశంగా మారితే పొరుగుదేశమైన చైనాతో పాటు రష్యాను కూడా వ్యతిరేకించాలి. ప్రపంచంలోని అభ్యుదయ ప్రభుత్వాలు, శక్తులు, సంస్థలకు దూరం కావాలి. వారందరితో మన సంబంధాలు బలహీనపడతాయి. గాజాపై ఇజ్రాయిల్ మారణకాండను బహిరంగంగా బలపరచాలి. రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌ను బలపరచాలి. ఇరాన్ సహా అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న అరబ్ ప్రభుత్వాలను వ్యతిరేకించాలి. కొన్ని దేశాల ప్రభుత్వాలతో సంబంధాలను తెంచుకోవాలి. వెనిజులా, క్యూబాలపై అమెరికా చేస్తున్న ప్రచార యుద్ధాన్ని, ప్రభుత్వాలను కూల్చే చర్యలను బలపరచాలి. లాటిన్ అమెరికా, ఆఫ్రికాలలో తనకు ఇష్టం లేని ప్రభుత్వాలను కూలదోయటానికి అమెరికా చేస్తున్న కుట్రలలో మనదేశం భాగస్వామి కావాలి. అమెరికా యుద్ధోన్మాదాన్ని పూర్తిగా బలపరచాలి.

అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాలతో సంబంధాలు బలపడతాయి. అపుడు అమెరికా, సామ్రాజ్యవాద దేశాలు మన దేశాన్ని, సంపదలను మరింతగా దోపిడి చేస్తాయి. మనదేశంపై మరింత అణిచివేతను కొనసాగిస్తాయి. ప్రజాస్వామ్యాన్ని, రాజకీయ వ్యవస్థలను నాశనం చేస్తాయి. అమెరికా, సామ్రాజ్యవాదులను వ్యతిరేకించే అభ్యుదయ శక్తులను అంతం చేయటానికి పూనుకుంటారు. అభ్యుదయ ప్రభుత్వాలు, శక్తులు మనకు దూరమైన తర్వాత మనం ఈ దోపిడిని, అణచివేతను ప్రతిఘటించటం సాధ్యం కాదు.

అందువలన అమెరికన్ సామ్రాజ్యవాదులకు లొంగిపోవటం కాక, దానిని ప్రతిఘటించటంలోనే మన దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, అంతర్జాతీయ ప్రతిష్ఠను పెంచుకోవటం ఉన్నది. కాబట్టి ప్రభుత్వం సామ్రాజ్యవాదుల ఒత్తిళ్ళను ప్రతిఘటించాలి. కాని బిజెపి ప్రభుత్వం అమెరికాతో చెట్టపట్టాలు వేసుకోవటానికే చూస్తున్నది మినహా దేశాభివృద్ధి, దేశ ప్రతిష్ఠను గురించి ఆలోచించటం లేదు. ప్రభుత్వ విధానాలలో మార్పు తీసుకురావటం కోసం ప్రజలు ఉద్యమాలకు సన్నద్ధం కావాలి. మన దేశంపై నయా వలస విధానాలను రుద్దటానికి పూనుకున్న అమెరికాను ప్రజలంతా వ్యతిరేకించాలి.

ఎపిలో జగన్ పేరుతో ప్రజలపై చంద్రబాబు భారాలు ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి-జనసేన-బిజెపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలకు భిన్నంగా ప్రజలపై భారాలు మోపటానికి పూనుకున్నది. ఇసుక, మద్యం, విద్యుత్ తదితరాలు వేటిలోనూ గత ప్రభుత్వ విధానాలకు భిన్నమైన విధానాలను అనుసరించటం లేదు. విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీల పేరుతో 6,012 కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. ఇది తాము వేస్తున్న భారం కాదని, జగన్ హయాంలో వాడిన కరెంటుకు చెల్లించాల్సిన మొత్తమని ప్రజలను నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నారు. జగన్ హయాంలో అన్ని రంగాలను నాశనం చేశారని ప్రచారం చేస్తున్నారు. ఈ వాదన ప్రకారం ప్రజలపై భారాలు మోపి, జగన్ పాలన ఫలితంగా ఈ భారాలు పడ్డాయని చెప్పి తప్పించుకోవచ్చు. ప్రస్తుత ప్రభుత్వం తన వాగ్దానాలను వమ్ముచేయటానికి, ప్రజలపై భారాలు మోపటానికి జగన్ పాలనను అడ్డం పెట్టుకుంటున్నది. ప్రజలను మోసం చేస్తున్నది. అందువలన ఈ వాదనలను ప్రజలు తిరస్కరించాలి. ప్రభుత్వం వేస్తున్న భారాలను ప్రతిఘటించాలి.

విద్యుత్ ఛార్జీలను పెంచటానికి ప్రభుత్వం, విద్యుత్ పంపిణి, నియంత్రణ సంస్థలు చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమంజసంగా లేవు. 2022-23 సంవత్సరం ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ ఎడ్జస్ట్‌మెంట్ ఛార్జెస్(ఎఫ్‌పిపిసిఎ) కింద 8,100 కోట్ల రూపాయలు వసూలు చేసుకోవటానికి అనుమతి ఇవ్వమని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలిని 2024, అక్టోబరులో -సంవత్సరం ఆరు మాసాల తర్వాత- పంపిణి సంస్థలు కోరాయి. దానిపై విచారణ తతంగాన్ని నిర్వహించిన నియంత్రణ మండలి 6,073 కోట్ల రూపాయలను 15 మాసాల కాలంలో ప్రజల నుండి వసూలు చేసుకోవటానికి అక్టోబరు 25వ తేదీన డిస్కాంలకు అనుమతి ఇచ్చింది. డిస్కాంలు అడిగిన మొత్తంలో 2027 కోట్ల రూపాయలు 'దయ'తో కోతపెట్టింది.

ఇపుడు పైన చెప్పుకున్న అంశాలను పరిశీలిద్దాం. మనం ఒక సరుకును 18 మాసాల క్రితం కొనుగోలు చేసి వాడుకున్నాం. సరుకు తయారు చేసిన వాడికి నష్టం వస్తే సరుకు కొనుగోలు చేసిన వారు 18 మాసాల తర్వాత ఆ నష్టాన్ని చెల్లించాలా? ఇది ఏ సరుకు అమ్మకం-కొనుగోలులో అయినా జరుగుతున్నదా? ఏ రంగంలో లేని విధానాన్ని విద్యుత్‌రంగంలో ఎందుకు అమలు చేస్తున్నారు? మరొక అంశం, విద్యుత్ కొనుగోలుకు డిస్కాంలు ఉత్పత్తి చేస్తున్న కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి కదా. నష్టం వచ్చిందనుకుంటే దీర్ఘకాలికమైనా, స్వల్పకాలికమైనా విద్యుత్‌ను డిస్కాంలు కొనుగోలు చేసేటపుడే నష్టం ఎంత కొనసాగిస్తున్నది. అదాని సంస్థతో వైసిపి ప్రభుత్వం చేసుకున్న తప్పుడు విద్యుత్ ఒప్పందం, వారికిచ్చిన భూములు తదితరాలపై ఈ ప్రభుత్వం నోరు మెదపటం లేదు. అదాని లబ్ధికలిగించటం కోసం పనిచేస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుందా? ❋

# వియాత్నాం విప్లవయోధుడు

# ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్

ఇటీవల మరణించిన వియత్నాం కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటి ప్రధాన కార్యదర్శి ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ గొప్ప మేధావి. సాంస్కృతిక, సైద్ధాంతిక రంగాలలో పార్టీలో శిఖర సమానుడు. వియత్నాం అధ్యక్షుడైన హోచిమిన్ సిద్ధాంతం, నైతిక సూత్రాలు, జీవిన విధానాన్ని నిత్య విద్యార్థిగా నిరంతరం అధ్యయనం చేస్తూ, వాటిని అమలు చేయటానికి కృషి చేశారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ, వియత్నాం ప్రజలు, ఆ దేశ విప్లవాత్మక లక్ష్యాలను ముందుకు తీసుకుపోవటానికి తన జీవితాన్ని అంకితం చేశారు. 55 సంవత్సరాలకు పైగా విప్లవ కార్యచరణతో రాటు దేలారాయన. ఆయన వ్యూహాత్మక దృష్టి, నిశితమైన ఆలోచనలు ఆచరణతో ముడిపడి ఉండేవి. మార్క్సిజం-లెనినిజం, హోచిమిన్ సిద్ధాంతాలను వర్తమాన పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించటానికి, స్వచ్ఛమైన, శక్తివంతమైన పార్టీని నిర్మించటానికి కామ్రేడ్ ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్, కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ కృషి చేశాయి. సోషలిస్టు చట్టాలతో నడిచే ప్రభుత్వాన్ని ప్రజల ద్వారా, ప్రజలచేత, ప్రజల కోసం నిర్మించారు. అవసరమైన సవరణలతో పరిపుష్టం చేసిన సంస్కరణలను జయప్రదంగా అమలుచేశారు. గతంలో ఏనాడూ లేని విధంగా వియత్నాం అభివృద్ధికి తోడ్పడ్డారు.

కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం, పార్టీకి సంబంధించిన అంశాలు ఆయన విప్లవ జీవితంలో అతి ముఖ్యమైనవి. పార్టీ నిర్మాణంలో హోచిమిన్ సిద్ధాంతాలను నిర్మాణాత్మకంగా అన్వయింపజే శారాయన. పార్టీ స్వభావం, జాతీయ పునరుజ్జీవంలో దాని పాత్ర, సంస్కరణల క్రమం ద్వారా వియత్నాంలో పాలక పార్టీని నిర్మించటం గురించి ఆయన లోతైన విశ్లేషణ చేశారు. పార్టీ నిర్మాణం, దిద్దుబాటుకు సంబంధించిన వ్యూహాత్మక ప్రణాళికలను, నిర్ణయాలను జయప్రదంగా అమలు చేయటానికి అవసరమైన విధానాలను ఆయన



నాయకత్వంలో పార్టీ కేంద్రకమిటీ రూపొందించింది. పార్టీలో వ్యక్తిగత వాదానికి, దిగజారుడు తనానికి, అవినీతి, ఇతర అవలక్షణాలకు వ్యతిరేకంగా దృఢ చిత్తంతో నిరంతరం పోరాటం చేశారు. పార్టీలో విప్లవ నైతికతను, కష్టపడి పనిచేయటాన్ని, ముఖ్యమైన సమస్యలను అధ్యయనం చేసేస్థాయిని, అగ్రగామి దళ పాత్రను పెంచటానికి, ఉత్తమ సాంప్రదాయాలను, ప్రజలతో సన్నిహిత సంబంధాలను పెంచటానికి కృషి చేశారు.

పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్, కేంద్రకమిటీ నాయకత్వంలో వియత్నాం పార్టీ కష్టపడి పనిచేసే స్వభావాన్ని, మేధస్సును రుజువు చేసుకున్నది. మొత్తం పార్టీని, ప్రజలను, సైన్యాన్ని ఐక్యంగా నడిపించటం ద్వారా వ్యతిరేక శక్తులు కల్పిస్తున్న ఆటంకాలను అధిగమించి, సంస్కరణలను విజయవంతం చేయటంతో పాటు పార్టీ అనేక గొప్ప విజయాలను కూడా సాధించింది. నైతిక విలువలతో కూడిన, నిజమైన నాగరిక సమాజాన్ని నిర్మించారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా, జాతీయ అసెంబ్లీ (పార్లమెంటు) ఛైర్మన్‌గా, సోషలిస్టు చట్టానికి అనుగుణమైన రాజ్యాన్ని ప్రజలచే, ప్రజల కొరకు, ప్రజల ద్వారా నిర్మించటానికి నిరంతరం ప్రయత్నం చేశారు. నూతన పరిస్థితులలో సోషలిస్టు చట్టాలపై ఆధారపడిన రాజ్యాన్ని వియత్నాంలో నిర్మించటానికి, మరింత ఆధునికం చేయటానికి కామ్రేడ్ ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ నాయకత్వంలో వియత్నాం పార్టీ మొదటిసారిగా ఒక తీర్మానం చేసింది. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రజల చేత, ప్రజల ద్వారా, ప్రజల కొరకు నిర్మించబడిన వియత్నాం సోషలిస్టు విధానాన్ని మరింత క్రమబద్ధం చేయటానికి అవసరమైన లక్ష్యాలను నిర్దేశించుకుంది. నిరంతరం సక్రమంగా పనిచేసే న్యాయవ్యవస్థను నిర్మించుకోవడం, రాజ్యాంగాన్ని, చట్టాన్ని గౌరవించడం, మానవహక్కులను, పౌరహక్కులను కాపాడడం, గౌరవించడం, వాటిని అమలుచేయడం ఈ లక్ష్యాలు. ఈ లక్ష్యాలు, బాధ్యతలను స్పష్టంగా పార్టీ నిర్వచించి, సన్నిహితంగా పరిశీలిస్తూ సమన్వయం చేయాలనీ, రాజ్యం శక్తిని ఏకీకృతం చేయాలనీ, వృత్తిపరమైన, చట్టబద్ధమైన పాలన, ఆధునిక పాలనా యంత్రం, న్యాయ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలనీ. ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకంగా, స్వచ్ఛంగా ఉండాలనీ శక్తివంతంగా, సమర్ధవంతంగా పనిచేయాలనీ పార్టీ చెప్పింది. తగిన అర్హతలు, శక్తిసామర్థ్యాలు, వృత్తిపై నిజమైన నిబద్ధత, సమగ్రత కలిగిన కార్యకర్తలు, పౌర సేవలందించేవారు, ప్రభుత్వ ఉద్యోగుల సమూహాలను ఏర్పాటు చేసుకోసుకోవడం, ఆధునికమైన, శక్తివంతమైన జాతీయ పాలనా విధానాన్ని అభివృద్ధి చేయడం, దేశాన్ని త్వరితంగా, స్థిరంగా అభివృద్ధి చేయడం, 2045 నాటికి అభివృద్ధి చెందిన, అధిక ఆదాయం కలిగిన దేశంగా వియత్నాంను అభివృద్ధి చేయడం లక్ష్యంగా నిర్ణయించింది.

హోచిమిన్ సిద్ధాంతాన్ని సమగ్రంగా ఆకళింపు చేసుకోవటం ద్వారా "సంస్కృతి జాతి ఆత్మ" అన్న సత్యాన్ని ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ గ్రహించారు. సంస్కృతి నిర్వహించే పాత్రను లోతుగా అర్థం చేసుకున్నారు. "సంస్కృతి కొనసాగినంత కాలం జాతి నిలిచివుంటుందని" చెప్పారు. పార్టీ సాంస్కృతిక విభాగంలో ముఖ్య నాయకుడైన ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ జాతీయ గుర్తింపుతో కూడిన

**" వియత్నాం కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటితో కలిసి ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ లోతైన రాజకీయ పరిజ్ఞానం, వ్యూహాత్మకమైన ఆలోచనలతో ఆచరణలో వచ్చిన అనుభవాలను జోడించి, వియత్నాం విదేశాంగ విధానంగా - స్వాతంత్ర్యం, జాతీయ ప్రయోజనాలు, ఆటంకాలను అధిగమించటం ప్రాతిపదికగా- "వెదురు డిప్లమసి"ని రూపొందించారు. "వియత్నాం వెదురు" పేరుతో ఈ విధానాన్ని రూపొందించి, అభివృద్ధి చేశారు. "**

సంపద్వంతమైన, అభివృద్ధి చెందిన సంస్కృతిని నిర్మించటానికి గణనీయమైన కృషి చేశారు. జాతి అభివృద్ధిలో చైతన్యం కలిగించే శక్తిగా, సమాజానికి మానసిక ఉత్తేజాన్నిచ్చేదిగా సంస్కృతి ఉంటుందని గ్రహించాడు. ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ నాయకత్వంలో జరిగిన పార్టీ 13వ జాతీయ మహాసభ డాక్యుమెంట్లలో సాంస్కృతిక రంగాన్ని గురించి సమగ్రంగా, లోతైన విశ్లేషణ చేశారు. 70 సంవత్సరాల తర్వాత సంస్కృతిపై జరిగిన జాతీయ మహాసభ జాతి పునర్నిర్మాణం, దేశరక్షణ కోసం సైన్యం, ప్రజలను సన్నద్ధం చేయటంలో సంస్కృతి నిర్వహించే పాత్రను వివరించింది. అభివృద్ధి చెందుతున్న, ఆనందకరమైన జీవితాన్నిచ్చే దేశంగా రూపొందించటంలో పార్టీ సిద్ధాంతాన్ని, ఆచరణను సమన్వయం చేసిన మైలురాయిగా మహాసభ నిలిచింది.

వియత్నాం కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటితో కలిసి ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ లోతైన రాజకీయ పరిజ్ఞానం, వ్యూహాత్మకమైన ఆలోచనలతో ఆచరణలో వచ్చిన అనుభవాలను జోడించి, వియత్నాం విదేశాంగ విధానంగా - స్వాతంత్ర్యం, జాతీయ ప్రయోజనాలు, ఆటంకాలను అధిగమించటం ప్రాతిపదికగా- "వెదురు డిప్లమసి"ని రూపొందించారు. "వియత్నాం వెదురు" పేరుతో ఈ విధానాన్ని రూపొందించి, అభివృద్ధి చేశారు. "వెదురు దౌత్యం" విధానాన్ని దృఢంగా ముందుకు తీసుకుపోవటం ద్వారా ప్రధాన భాగస్వామ్య దేశాలతో వియత్నాం సంబంధాలలో చారిత్రకంగా గుణాత్మకమైన అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో చురుకైన, బాధ్యత కలిగిన, నమ్మదగిన భాగస్వామిగా వియత్నాం స్థానం, ప్రతిష్ఠ, ప్రభావం ఈనాడున్నంత ఎక్కువగా గతంలో ఏనాడూ లేవు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ రాజకీయాలు, మానవ నాగరికత తదితరాలలో వియత్నాం ఇంతగా ఏనాడూ సమ్మిళితం కాలేదు.

దేశ అధ్యక్షుడుగా, దేశభద్రత-రక్షణ కౌన్సిల్ ఛైర్మన్‌గా, వియత్నాం ప్రజాసైన్యానికి కమాండర్-ఇన్- చీఫ్ తదితర బాధ్యతలను ఏకకాలంలో నిర్వహించినప్పటికీ, ప్రజా సైన్యానికి, ప్రజల భద్రతకు ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ ఎల్లప్పుడూ అత్యంత ప్రాధాన్యతను ఇచ్చేవారు. బలమైన, సమైక్యమైన సైన్యాన్ని, ప్రజా భద్రతా దళాలను నిర్మించటంపై కేంద్రీకరించారు. ప్రెసిడెంట్ హోచిమిన్ సిద్ధాంతాన్ని, నైతికతను, జీవన విధానాన్ని అధ్యయనం చేసి, జీర్ణించుకొని అమలు చేయమని ఆయన సైనిక దళాలకు తరచుగా చెబుతుండేవాడు. "గౌరవం అనేది అత్యంత పవిత్రమైనదనీ, దేశానికి, ప్రజలకు హృదయపూర్వకంగా సేవ చేయాలనీ ఆయన సైనికులకు బోధించేవాడు. "పనిచేసేటపుడు ప్రజలపై ఆధారపడాలనీ, ప్రజలకు నిజమైన విధేయులుగా ఉండాలనీ, వారిని గౌరవించాలనీ, ప్రేమించాలనీ" చెప్పేవాడు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండాలని, వారి ప్రయోజనాలను కాపాడాలని, వారి విశ్వాసం, మద్దతు పొందేలా పనిచేయాలని బోధించేవాడు. పార్టీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ ప్రత్యక్ష నాయకత్వంలో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉన్నతమైన, కాకలు తీరిన, బలమైన, స్వచ్ఛమైన, శక్తివంతమైన సైన్యాన్ని నిర్మించాలన్న ప్రయత్నం గణనీయమైన ఫలితాలను ఇచ్చింది. ప్రజా భద్రత, సైనిక దళాలు ఐక్యంగా ఉండాలి. జాతీయ అభివృద్ధి కోసం శాంతి, స్థిరత్వాన్ని కాపాడటం కోసం పక్షికి ఉన్న రెండు రెక్కల వలె, కత్తి-డాలు వలె కలిసి పని చేయాలి. ప్రజలు, మానవుల కోసం సంపూర్ణంగా హృదయపూర్వకంగా పని చేయటమే కామ్రేడ్ ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ ఆలోచనలలో ప్రధానాంశంగా ఉండేది. పునర్నిర్మాణక్రమంలో ప్రజలు కేంద్రంగా, ప్రజల ప్రయోజనాలనే అంతిమ లక్ష్యంగా తీసుకొని పనిచేయాలి. " పార్టీ ప్రజల పట్ల అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి భౌతిక, మానసిక జీవితాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలనీ, ప్రజల, దేశ, జాతి ప్రయోజనాలు ప్రతిబింబించని, చారిత్రకంగా అభివృద్ధి చెందుతున్న చట్టానికి అనుగుణంగా లేని పార్టీ విధానాలు సరైనవి కావు అని ఆయన చెప్పాడు. " పార్టీ ఉనికి, కార్యకలాపాలు, అభివృద్ధికి ప్రజలతో సంబంధాలు ప్రధానమైనవి. పార్టీని శక్తివంతం చేయటంలో ఇవే నిర్ణయాత్మకమైనవి" అని చెప్పేవారు. పెట్టుబడిదారీ చట్టాల ప్రకారం జరుగుతున్న పాలనకు, సోషలిస్టు చట్టాల ప్రకారం జరుగుతున్న పాలనకు మధ్య వ్యత్యాసాన్ని గురించి వివరిస్తూ, పెట్టుబడిదారి చట్టాల ప్రకారం పాలించబడుతున్న దేశం, సోషలిస్టు చట్టాల ప్రకారం పాలించబడుతున్న దేశం కన్నా స్వభావ రీత్యానే భిన్నంగా ఉంటుందని చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడటానికి, వారికి సేవ చేయటానికి ప్రభుత్వ చట్టాలు ఉంటాయి. మెజారిటీ ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి, తమకు తామే యజమానులుగా వ్యవహరించటానికి ప్రజలకు ఉన్న హక్కును పరిరక్షించటానికి సోషలిస్టు వ్యవస్థలో చట్టాలు ఉంటాయి.

వియత్నాంలో అమలు జరుగుతున్న సోషలిస్టు మార్కెట్ వ్యవస్థలో ప్రధానమైన అంశం ఆర్థికవ్యవస్థ సమాజంతో ముడిపడి ఉండాలి. సమాజం కోసం రూపొందించిన విధానాలతో ఆర్థిక విధానాలు ఏకీకరణ కావాలి. సామాజికాభివృద్ధితో ఆర్థికాభివృద్ధి చేయి చేయి కలిపి ముందుకుసాగాలి. అభివృద్ధి క్రమంలోని ప్రతి అడుగు, ప్రతి విధానమూ సామాజిక సమానత్వాన్ని పెంపొందించే విధంగా ఉండాలి. ప్రతి ఆర్థిక విధానమూ సామాజికాభివృద్ధి లక్ష్యాలను అందుకొనేలా ఉండాలి. దరిద్రాన్ని తగ్గించటం, ఆకలిని నిర్మూలించటంతో పాటు ఉన్నతమైన న్యాయాన్ని అందించటాన్ని ప్రోత్సహించాలి. క్లిష్టమైన పరిస్థితులలో ఉన్నవారికి మెరుగైన సేవలు అందించాలి. కామ్రేడ్ ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ నాయకత్వంలో వియత్నాం పార్టీ సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం పలు

**(మిగతా 33పేజీలో)**

# చోళుల నౌకా బలం, విజయాలూ, సంస్కృతి

ఎంవిఎస్ శర్మ

చోళ ప్రభువులు నిర్మించిన దేవాలయాలగోడలపైన తమ విజయాల గురించి చాలా వివరంగా పేర్కొన్నారు. అందువలన అంతకు పూర్వం పాలించిన వారి కన్నా చోళుల గురించి ఎక్కువ వివరాలు మనకు అందుతున్నాయి.

రాజరాజ చోళుడు, రాజేంద్ర చోళుడు విజయాలు సాధించిన ప్రతీ సందర్భంలోనూ అక్కడ శైవ, వైష్ణవ దేవాలయాలను నిర్మించారు. వాటి లో అత్యంత ప్రసిద్ధి చెందినది తంజావూరులోని రాజరాజేశ్వర దేవాలయం. దీనినే బృహదీశ్వరాలయం అని కూడా అంటారు. దీనిని క్రీ.శ. 1010లో రాజరాజ చోళుడు నిర్మింపజేశాడు.(చూ. పటరా తంజావూరు బృహదీశ్వరాలయం)

ఒకటవ రాజేంద్ర చోళుడు (1014-1044) దక్షిణ భారత భూభాగాన్ని దాటి తూర్పు దిశగా సాగించిన జైత్రయాత్ర చెప్పుకోదగ్గది. కళింగ ప్రాంతాన్ని దాటి బెంగాల్ ప్రాంతంలో ప్రవేశించి గంగానదిని కూడా దాటిన చోళ సైన్యాలు అక్కడ స్థానిక రాజులలో ఇద్దరిని ఓడించి అనంతరం వెనుదిరిగాయి. ఈ జైత్రయాత్ర క్రీ.శ.1022లో జరిగింది. ఈ జైత్రయాత్ర లో గతంలో సముద్రగుప్తుడు అనుసరించిన మార్గంలోనే చోళ సైన్యాలు నడిచాయి. తన సైన్యాలు జయప్రదంగా గంగానదిని దాటినందుకు సంకేతంగా

“గంగైకొండ చోళ” అనే బిరుదును రాజేంద్రచోళుడు స్వీకరించాడు. ( గంగను దాటిన చోళుడు అని దానర్థం) అంతేకాక, కావేరినది ముఖద్వారం సమీపంలో గంగైకొండ చోళపురం అనేనగరాన్ని నిర్మించి దానిని తన నూతన రాజధానిగా చేసుకున్నాడు.

భారత ఉపఖండానికి వెలుపల ఉన్న మలయా ద్వీపకల్పంలో క్రీ.శ.10వ శతాబ్దం నాటికి శ్రీ విజయ సామ్రాజ్యం పునరుద్ధరించబడింది. ఇది సుమత్రా, జావా, తక్కిన సమీపపు దీవులపై అధికారం కలిగివుండేది. దీనిని పాలించిన శైలేంద్ర వంశస్థులు బౌద్ధమతాన్ని అనుసరించారు. ఈ రాజ్యం చోళ రాజ్యంతో సత్సంబంధాలు కలిగివుండేది. నాగపట్టణం వద్ద శైలేంద్ర పాలకులు బౌద్ధ ఆరామాన్ని నిర్మించాలని భావించినప్పుడు చోళ ప్రభువులు అందుకు అనుమతించి దాని నిర్వహణకు ఒక గ్రామాన్ని దత్తత ఇచ్చారు. ఐతే ఈ మలయా ప్రాంత సామ్రాజ్యం చైనాకు పోయే సముద్ర మార్గం మీద పట్టు కలిగివుండేది. భారత ఉపఖండం నుంచి చైనాతో సాగించే వాణిజ్యాన్ని అదుపు చేయగల శక్తి ఉండేది. అందుచేత చోళులు ఈ శైలేంద్ర సామ్రాజ్యం మీద యుద్ధానికి తలపడ్డారు. సముద్రం దాటి మలయా భూభాగంమీద దండెత్తి మలయా ద్వీపకల్పంలోను, సుమత్రా దీవులలోను కొంత భూభాగాన్ని కైవసం చేసుకున్నారు. ఇటువంటి విజయం సాధించగలిగిందంటే చోళుల నౌకాబలం ఎంత బలమైన శక్తిగా ఉండేదో ఊహించవచ్చు. బంగాళాఖాతాన్ని చోళ సరస్సు గా ఈ నౌకాబలం మార్చేసింది.

ఆ తర్వాత చైనాతో వ్యాపారాన్ని అభివృద్ధి చేయడం ప్రారంభించారు. క్రీ.శ.1077లో చైనాకు 70 మంది వర్తక ప్రముఖులతో ఒక బృందాన్ని పంపినట్టు, భారతీయ వర్తకులు తెచ్చిన గాజు వస్తువులు, కర్పూరం, జరీ వస్త్రాలు, ఖడ్గమృగాల కొమ్ములు, ఏనుగు దంతాలు వంటి సరుకులకు 81,800 రాగి నాణేలను చెల్లించినట్టు ( ఆ నాణేల విలువ నాలుగు లక్షల రూపాయలు) చైనాలోని లేఖకులు నమోదు చేసిన వివరాలు తెలియజేస్తున్నాయి.

పొరుగున ఉన్న చాళుక్యులతో చోళ రాజులు నిరంతరం యుద్ధాలకు తలపడుతూవుండేవారు. రాష్ట్రకూటుల్ని జయించిన మలినాటి చాళుక్యులు కళ్యాణి (నేటి మహారాష్ట్ర) రాజధానిగా పాలిస్తూవుండేవారు. తుంగభద్ర పరీవాహక ప్రాంతం, వేంగి ప్రాంతం (రాయలసీమ) , గాంగుల దేశం

(కృష్ణా– తుంగభద్ర నడుమ ప్రాంతం) వీటిపై ఆధిపత్యం కోసం ఈ రెండు రాజ్యాలూ తీవ్రంగా తలపడుతూవుండేవి. ఈ యుద్ధాలలో నిర్ణయాత్మకమైన విజయాన్ని ఎవరూ సాధించలేదు. అంతేగాక రెండు పక్షాలూ బాగా బలహీనపడ్డాయి. ఈ యుద్ధాలు రాను రాను క్రూర స్వభావాన్ని సంతరించుకున్నాయి. కళ్యాణి నగరంతో సహా పలు చాళుక్య నగరాలను, గ్రామాలను చోళ సైన్యాలు కొల్లగొట్టడం, పిల్లలు, మహిళలు, బ్రాహ్మణులుతో సహా ప్రజలను ఊచకోత కోయడం వంటి దుర్మార్గాలకు పాల్పడ్డారు. పాండ్యదేశంలో కూడా ఇదే విధంగా వ్యవహరించారు. అంతే గాక అక్కడ సైనిక స్థావరాలను కూడా ఏర్పాటు చేసి స్థానిక ప్రజలను భయభ్రాంతుల్ని చేశారు. దక్షిణాన శ్రీలంక లో అనూరాధపుర పట్టణాన్ని ధ్వంసం చేసి అక్కడి రాజును, రాణిని నీచంగా అవమానించారు. ఇవన్నీ చోళసామ్రాజ్య చరిత్రలో మాయని మచ్చలుగా నిలిచాయి. ఐతే, ఒకసారి ఒక ప్రాంతాన్ని జయించాక, అక్కడ పటిష్టమైన పాలనా వ్యవస్థను నెలకొల్పడం చోళ రాజుల ప్రత్యేకత. ముఖ్యంగా స్థానిక స్వపరిపాలనా విధానాన్ని చోళులు బాగా ప్రోత్సహించారు.

క్రీ.శ.12వ శతాబ్దం వరకూ విలసిల్లిన చోళ సామ్రాజ్యం 13వ శతాబ్దపు తొలి సంవత్సరాల్లో పతనం కావడం ప్రారంభించింది. మహారాష్ట్ర ప్రాంతంలోని చాళుక్య సామ్రాజ్యం కూడా దాదాపు ఇదే కాలంలో పతనం కాసాగింది. చోళుల స్థానంలో పాండ్యులు, హొయసలులు, తమ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. చాళుక్యుల స్థానంలో యాదవులు, కాకతీయులు తమ తమ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. ఈ రాజ్యాలు కూడా పరస్పరం యుద్ధాల్లో మునిగితేలుతూ పోయారు.

> **“ భూమి శిస్తు తో బాటు వ్యాపారస్తులనుండి సుంకాలు, వృత్తిదారులనుండి పన్నులు వసూలు చేసేవారు. వాటికి అదనంగా పొరుగు దేశాలను కొల్లగొట్టి తెచ్చిన సంపద కూడా ప్రభుత్వ ఆదాయంగా జమ అయేది. చోళ సామ్రాజ్యంలో స్థానిక స్వపరిపాలన గురించి ముందే ప్రస్తావించుకున్నాం. గ్రామాన్ని నిర్వహించడానికి మహాసభ జరిపేవారు. ”**

దానివలన అందరూ బలహీనపడ్డారు. ఈ ఘర్షణలలో భాగంగా వారు అనేక దేవాలయాలను ధ్వంసం చేశారు. 14వ శతాబ్దం నాటికి వీరినందరినీ డిల్లీ సుల్తానులు ఓడించి తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకోగలిగారు.

### చోళుల పాలనావిధానం

రాజు సర్వాధికారిగా ఉండేవాడు. అతడికి సలహాలనిచ్చేందుకు మంత్రిమండలి ఉండేది. రాజు స్వయంగా రాజ్యమంతటా పర్యటిస్తూ పరిపాలనను పర్యవేక్షించేవాడు. చోళుల సైన్యంలో గజబలం, అశ్వ దళం, పదాతి దళాలు –మూడూ ఉండేవి. పదాతి దళం సాధారణంగా ఈటెలను ఉపయోగించేది. రాజుకు రక్షణగా అంగరక్షక బృందం ఉండేది. వెనిస్ నగరం నుండి భారత ఉపఖండానికి పర్యటనకు వచ్చిన మార్కో పోలో (13వ శతాబ్దం) కథనం ప్రకారం రాజు మరణిస్తే, అతడి చితి మంటల్లోనే అంగరక్షకులందరూ ఆత్మాహుతి చేసుకునేవారు. ఇది మరీ అతిశయోక్తిగా కనిపిస్తోంది. కాని అంగరక్షకులు రాజు ప్రాణాలను కాపాడడమే అన్నింటికన్నా మిన్నగా ఎంచుకునేవారని మాత్రం నిర్ధారించవచ్చు. చోళుల వద్ద బలమైన నావికా దళం కూడా ఉండేది. మలబారు తీరం (పశ్చిమం, చోరమండల తీరం (తూర్పు) అంతా చోళుల ఆధిపత్యం నెలకొనడానికి నావికాదళమే ప్రధాన పాత్ర పోషించింది.

చోళ రాజ్యం అంతా మండలాలుగా పాలనా నిమిత్తం విభజించారు. ప్రతీ మండలాన్నీ మళ్ళీ వలనాడు అని, నాడు అని విభజించారు. మండలాలకు పాలకులుగా రాచకుటుంబపు వ్యక్తులు ఉండేవారు. అధికారులకు వేతనాల నిమిత్తం కొన్ని రెవెన్యూ గ్రామాలను కేటాయించేవారు. వాటిమీద వచ్చే శిస్తు ఆ అధికారులకు వేతనంగా ముట్టేది.

చోళ రాజ్యంలో రహదారుల వ్యవస్థ బాగా పెంపొందింది. దానివలన సైన్యాలను తరలించడం సులభతరం అవడమే కాక, వర్తక, వాణిజ్యాలు కూడా వేగం పుంజుకున్నాయి. జావా, సుమత్రా వంటి సుదూర ప్రాంతాలతో భారీ ఎత్తున వాణిజ్యాన్ని నిర్వహించే వ్యాపార కూటములు (గిల్డులు) ఏర్పడ్డాయి.

నీటిపారుదల విషయంలో కూడా చోళ రాజులు శ్రద్ధ వహించారు. కావేరి, ఇతర నదుల నీటిని ఇందుకోసం వినియోగించారు. అనేక చెరువులు తవ్వించి నీటిని నిల్వ చేయడానికి దోహదపడ్డారు. భూములను వివరంగా సర్వే చేయించి ఆ ప్రాతిపదికన ప్రభుత్వ శిస్తును నిర్ధారించారు.

భూమి శిస్తు తో బాటు వ్యాపారస్తులనుండి సుంకాలు, వృత్తిదారులనుండి పన్నులు వసూలు చేసేవారు. వాటికి అదనంగా పొరుగు దేశాలను కొల్లగొట్టి తెచ్చిన సంపద కూడా ప్రభుత్వ ఆదాయంగా జమ అయేది.

చోళ సామ్రాజ్యంలో స్థానిక స్వపరిపాలన గురించి ముందే ప్రస్తావించుకున్నాం. గ్రామాన్ని నిర్వహించడానికి మహాసభ జరిపేవారు. గ్రామంలోని యుక్తవయస్కులంతా దానికి హాజరయేవారు. విద్యావంతులు, ఆస్థిపరులు కార్యనిర్వాహక కమిటీ కి నియమించబడేవారు. వీరిని రొటేషన్ పద్ధతిన గాని, లాటరీ పద్ధతిన గాని ఎంపిక చేసేవారు. ప్రతీ మూడేళ్ళకీ పాత సభ్యులు రిటైర్ అయేవారు. ఈ కమిటీ గ్రామ పాలనా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేది. దీనితోబాటు శిస్తు వసూలుకు, శాంతి భద్రతల పరిరక్షణకు, చెరువు నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఉండేవి. ఈ వికేంద్రీకరణ విధానం చాలా ఉపయోగకరంగా ఉండేది. ఐతే, కాలక్రమేణా భూస్వామ్య వ్యవస్థ బలపడడంతో గ్రామ స్థాయి స్వపరిపాలన బలహీనపడింది.

### సంస్కృతి

పెద్ద పట్టణాలను నిర్మించగలిగేటంత వనరులు చోళ రాజులు వద్ద ఉండడం వల్ల తంజావూరు, గంగైకొండ చోళపురం, కంచి వంటి పెద్ద పట్టణాలను నిర్మించగలిగారు. పాలక వర్గాలకు చెందినవారు పెద్ద పెద్ద భవంతులలో విలాసవంతంగా జీవించేవారు. 5 లేదా 7 అంతస్తుల భవంతులు కూడా ఉండేవి. ఐతే అవేవీ నేటివరకూ నిలబడలేదు. గంగైకొండ చోళపురం నేడు తంజావూరు


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!


**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

సమీపంలో ఒక చిన్న గ్రామంగా ఉంది. ఆ నాటి పట్టణాల వైభవాలు అప్పటి సాహిత్యంలో మనకు లభిస్తున్నాయి.

దక్షిణాదిన దేవాలయాల నిర్మాణం ఉచ్ఛస్థితికి చోళుల కాలంలోనే చేరుకుంది. ఆనాడు ఉపయోగించిన శిల్ప, నిర్మాణ కళను ద్రావిడ కళ అంటారు. దేవాలయంలో దేవతను ప్రతిష్ఠించిన గర్భగృహం మీద పలు అంతస్తులను నిర్మించడం ఇందులో ఒక ప్రత్యేకత. అవి అయిదు, లేదా ఏడు అంతస్తులవరకూ ఉండేవి. దీనిని విమానం లేదా గోపురం అని అంటారు. దానికి ముందు విశాలమైన మండపాన్ని రాతి స్తంభాలమీద నిలబడేలా నిర్మించారు. ఇది ఎక్కువ మంది కూర్చొనడానికి, కళా, సాంస్కృతిక కార్యకలాపాలను జరపడానికి ఉపయోగంగా ఉండేది. ప్రధాన దేవాలయం చుట్టూ ఒక దారిని నిర్మించేవారు. ఆ దారి వెంబడి ప్రదక్షిణలు చేసేవారు. ఆ దారిలోనే పలు దేవతల శిలామూర్తులను ప్రతిష్ఠించారు. క్రమంగా దేవాలయ గోపురాల ఎత్తూ పెరుగుతూవచ్చింది. ప్రాంగణంలో గదుల సంఖ్యా పెరుగుతూవచ్చింది. పురోహితులు, ఆలయ సిబ్బంది కూడా అక్కడే నివసించేవారు. దేవాలయాలకు మాన్యం కింద భూమిని కేటాయించారు. దానికి తోడు ఎన్నో విలువైన కానుకలు కూడా లభించేవి. ఆ సంపద ఆధారంగా కొన్ని దేవాలయాలు వ్యాపారంలో కూడా ప్రవేశించాయి.

“ చాళుక్యరాజైన రాజరాజ నరేంద్రుని ఆస్థానంలో ఉన్న నన్నయ్య మహాభారతాన్ని తెనిగించడానికి పూనుకున్నాడు. దానిని తిక్కన 13వ వ శతాబ్దాంతానికి పూర్తి చేశాడు. ఇది అనంతర కాలంలో మరెన్నో రచనలకు తెలుగులో ప్రేరణగా నిలిచింది. సంస్కృత మూలాలమీద ఆధారపడకుండా చేసిన రచనలను దేశీయాలని గ్రామ్యాలని అనేవారు. ”



చోళుల అనంతరం పాండ్యులు, హొయసలులు కూడా ఇదే దేవాలయ సంస్కృతిని కొనసాగించారు. కర్నాటకలోని ధార్వార్, హలేబీడు వంటి ప్రదేశాలలో చాలా దేవాలయాలను నిర్మింపజేశారు. అక్కడ నిర్మించిన హొయసలేశ్వర దేవాలయం చాళుక్య శిల్పరీతికి ప్రతీకగా ఉంది. దేవతలతోబాటు, వారికి అనుచరగణంగా ఉండే యక్ష, యక్షిణుల విగ్రహాలను సైతం అందంగా ఆ దేవాలయాలలో ఏర్పరిచారు. సామాజిక జీవితం మతంతో సన్నిహితంగా ముడిపడివుండేది. ఆరాధనతోబాటు సాంఘిక. సాంస్కృతిక జీవితం కూడా దేవాలయాల చుట్టూ అల్లుకుంది.

దక్షిణాదిలో శిల్పకళ క్రీ.శ.8-12 శతాబ్దాల మధ్య కాలంలో ఉచ్ఛ స్థితిని అందుకుంది. శ్రావణబెళగొళ లో ఉన్న గోమఠేశ్వర విగ్రహం చాలా భారీ సైజు శిల్పం. శివుడిని నటరాజ రూపంలో కంచు తో తయారు చేసి ప్రసిద్ధి పొందినది ఈ కాలంలోనే. ఈ నమూనా నటరాజ విగ్రహాలు నేడు ప్రపంచంలో పలు చోట్ల లభిస్తున్నాయి.

ఈ కాలంలో పాలకులు సాహిత్యాన్ని, కళలను బాగా ప్రోత్సహించారు. శైవ భక్తులైన నయనార్లు, విష్ణు భక్తులైన ఆళ్వార్ లు క్రీ.శ.6 నుండి 9 శతాబ్దాల మధ్య కాలంలో తమిళనాట బాగా పెరిగారు. ఆ సన్యాసులు రచించిన సాహిత్యం 11 సంచికలుగా తిరుమురై అనే పేరుతో అయిదవ వేదంగా ప్రసిద్ధి చెందింది. రామాయణం రచించిన కంబన్ క్రీ.శ.11-12 శతాబ్దాల మధ్య కాలం నాటివాడు. మహాభారతాన్ని కూడా తమిళంలో రచించినది ఈ కాలంలోనే.

తమిళంతో పోల్చితే కన్నడ భాష వయస్సు తక్కువే. కాని రాష్ట్రకూటులు, చాళుక్యులు, హొయసలులు కన్నడ భాషను బాగా ప్రోత్సహించారు. జైన పండితులు కూడా కన్నడ భాష వృద్ధి చెందడానికి తోడ్పడ్డారు. కన్నడ భాష కవిత్వంలో పంప, పొన్న, రాణఅనేవి అమూల్య రత్నాలవంటివిగా పేరుపొందాయి.

చాళుక్యరాజైన రాజరాజ నరేంద్రుని ఆస్థానంలో ఉన్న నన్నయ్య మహాభారతాన్ని తెనిగించడానికి పూనుకున్నాడు. దానిని తిక్కన 13వ వ శతాబ్దాంతానికి పూర్తి చేశాడు. ఇది అనంతర కాలంలో మరెన్నో రచనలకు తెలుగులో ప్రేరణగా నిలిచింది. సంస్కృత మూలాలమీద ఆధారపడకుండా చేసిన రచనలను దేశీయాలని గ్రామ్యాలని అనేవారు.


మొత్తంగా చూస్తే క్రీ.శ.8 నుండి 12 వ శతాబ్దం మధ్య కాలంలో దక్షిణ భారతదేశంలో రాజకీయంగా వ్యవస్థీకరణ జరగడం, దానితోబాటు సాంస్కృతికంగా అభివృద్ధి చెందడం జరిగింది. వాణిజ్యం కూడా ఈ కాలంలో అభివృద్ధి చెందింది. దక్షిణ భారత దేశ చరిత్రలో ఈ కాలం ఘనంగా చెప్పుకోదగ్గ కాలం.

❃

**సంస్మరణ వ్యాసం**

# భారీపరిశ్రమలను కాపాడిన ఘనత ఏచూరిదే

**సీహెచ్.నరసింగరావు**



సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సీతారాం ఏచూరి అకాల మరణం కార్మిక వర్గానికి తీరని లోటు. యూపీఏ-1 ప్రభుత్వ ఏర్పాటు చేయడం, కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌ను భాగస్వాములతో అంగీకరింపజేయడం వామపక్షాల విజయం. దీనిలో సీతారాం ఏచూరి పాత్ర కీలకం. కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ ప్రకారం.. కేంద్ర ప్రభుత్వ భారీ పరిశ్రమల్లో ఒక్క శాతం వాటా కూడా అమ్మకూడదనే నిర్ణయం వల్ల ప్రభుత్వరంగ పరిశ్రమలు ఆ కాలంలో ఒక్క శాతం కూడా ప్రైవేటు కాకుండా కాపాడుకోగలిగాం. అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం లాంటివి కష్టజీవులకు నేడు వరాలుగా మిగిలాయి. నాటి ప్రభుత్వంతో ఆ చట్టాలు చేయించి అమలు చేయించడం వామపక్షాల ఘన విజయం. ఎస్ఈజెడ్ చట్టంలో కార్మిక చట్టాలు వర్తించకూడదనే ముసాయిదాను మార్పించి కార్మిక చట్టాలు వర్తించేలా చేయడంలో సీపీఎం పాత్ర, ఏచూరి కృషిని కష్టజీవులు మరువలేరు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పారిశ్రామిక కేంద్రమైన విశాఖ కార్మిక వర్గ పోరాటాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేకసార్లు కా॥ సీతారాం ఏచూరి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పార్లమెంట్ లోపల, బయట జరిగిన మహత్తర పోరాటాల ఫలితంగా విశాఖలోని స్టీల్‌ప్లాంట్, బీహెచ్‌పీవీ, హిందూస్థాన్ షిప్‌యార్డ్, డీసీఐ లాంటి భారీ పరిశ్రమలను కాపాడుకోవడం సాధ్యమైంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఒక్క శాతం కూడా వాటాలు అమ్మకుండా అడ్డుకోగలిగాం. దాదాపు ఎల్&టి చేతిలోకి వెళ్లిందనుకున్న బీహెచ్‌పీవీని మరో భారీ ప్రభుత్వరంగం బీహెచ్ఈఎల్‌లో పోరాడి విలీనం చేయించాం.

ప్రముఖ నౌకనిర్మాణం హిందూస్థాన్ షిప్‌యార్డ్‌ను నాటి నౌకాయాన మంత్రి "బాలు" బంధువులకు చెందిన జీఎంఎల్‌తో అమ్మకానికి కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేసి రక్షణరంగంలో విలీనం చేయడంలో సీతారాం కీలకపాత్ర వహించారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఇండియా (డీసీఐ) నూరు శాతం అమ్మాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకున్నాం. హిందూస్థాన్ జింక్‌లో తప్ప (ఇంటక్ నాయకత్వం వల్ల) మిగిలిన భారీ పరిశ్రమలను ప్రైవేటు కాకుండా కాపాడుకోవడంలో కార్మిక వర్గ పోరాటాలకు సీపీఎం నాయకత్వంలో ఏచూరి, వాసుదేవ ఆచార్య, పాంథే గార్ల పాత్ర కీలకం.

ఏచూరి విశాఖలో పలుసార్లు పర్యటించారు. సీపీఎం అఖిల భారత 21వ మహాసభలు సందర్భంగా వారం రోజులు విశాఖలోనే వున్నారు. 2015 మార్చి 19వ తేదీ మహాసభ ఆఖరి రోజు సీపీఎం ప్రధాన కార్యదర్శిగా మొదటిసారి విశాఖలోనే ఎన్నికయ్యారు. సాయంత్రం విశాఖ బీచ్‌లో జరిగిన భారీ బహిరంగ సభ నగర చరిత్రలోనే మరువలేని ఘట్టం.

విశాఖలో సీతారాం ఏచూరి 2023 అక్టోబరు 5వ తేదీన విశాఖ స్టీల్ రక్షణ కోసం జరిగిన స్కూటర్ యాత్ర ముగింపు బహిరంగ సభలో ప్రధాన వక్తగా పాల్గొన్నారు. విశాఖలో అదే ఆయన ఆఖరి సభ. ఆ సభలో "తెలుగు బిడ్డగా పుట్టా. తెలుగుబిడ్డగానే మరణిస్తా". "తెలుగుబిడ్డ గనుక తెలుగులోనే మాట్లాడతా" అని ఆయన ఉపన్యాసాన్ని ప్రారంభించారు. "విశాఖ స్టీల్‌ప్లాంట్ పోరాటాలతోనే పుట్టింది. ఆనాడు 32 మంది ప్రాణత్యాగాలు చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డితో సహా 53 మంది కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. త్యాగాలతో పుట్టిన పరిశ్రమ ఇది. కానీ నేడు బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ను నూరు శాతం అమ్మాలని నిర్ణయించింది. దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం యావత్తు దాదాపు మూడేళ్లుగా నిరవధికంగా పోరాడుతోంది. కేంద్రం విశాఖ స్టీల్‌ను అమ్మాలనే నిర్ణయాన్ని ఉపసంహరించేవరకూ పోరాటం కొనసాగుతుంది. ఈ పోరాటానికి సీపీఎం సంపూర్ణంగా మద్దతునిస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ లేకపోతే విశాఖపట్నం లేదు. విశాఖ స్టీల్‌ను 'సెయిల్'లో విలీనం చేసే విషయం కూడా పరిశీలిస్తాం. "ఇండియా" పార్టీలతో మాట్లాడతా. విశాఖ స్టీల్‌ను కాపాడుకోడానికి అందరం కలసి కృషి చేస్తాం. రైతు ఉద్యమం లాగా మీరు కూడా పోరాడండి. తప్పక విజయం సాధిస్తారు. విశాఖ ఉక్కు - మన అందరి హక్కు - ఇది దేశం హక్కు. మనం "అమృతకాల్"లో ఉన్నాం. అమృతం చెడ్డవారి చేతుల్లో ఉంది. దాన్ని మంచివారి చేతుల్లోకి తేవాలి. బీజేపీని అధికారంలో నుంచి దించి దేశ సంపదను కాపాడుకోవాలి'' సీతారాం అన్నారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, స్వంత గనులు కోసం 2001 ఆగస్టు 2వ తేదీన జరిగిన భారీ ధర్నాకు ఏచూరి మద్దతు తెలియజేశారు. దీనికి ముందు ఢిల్లీలోని సీపీఎం కేంద్ర కార్యాలయంలో కలసిన స్టీల్ పోరాట కమిటీ నాయకులకు అనేక సలహాలిచ్చారు.

కమ్యూనిస్టు ఎం.పి.లకు అరుదుగా దొరికే అవకాశం పార్లమెంట్ స్టాండింగ్ కమిటీల చైర్మన్ స్థాయి దక్కడం. 2009లో సీతారాం ఏచూరికి రవాణా, టూరిజం, కల్చర్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అవకాశం లభించింది. దీన్ని సీతారాం కార్మిక వర్గానికి సమర్థవంతంగా ఉపయోగించారు. 31 మంది హేమా హేమీ పార్టీల ఎంపీలున్న కమిటీ ఇది. వీరందరినీ ఒప్పించి విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్‌ను రక్షణ రంగంలో విలీనం చేయడానికి ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్స్ పంపారు. షిప్‌యార్డ్‌లోని షిప్‌ల రిపేర్ల విభాగం డ్రైడాక్ కీలకం. రక్షణ రంగానికి డ్రైడాక్ లేనందువలన ఆ లోటును షిప్‌యార్డ్ తీర్చగలదనే వాదన తిరుగులేనిది. దీనితో కేంద్ర ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించవలసి వచ్చింది. దీనికి ముందు హిందూస్థాన్ షిప్‌యార్డ్‌ను తమిళనాడుకు చెందిన గుడ్ ఎర్త్ మారిటైమ్ లిమిటెడ్‌కు అప్పగించాలని నాటి ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని రద్దు చేసుకొని రక్షణ

> **"కాలం చెల్లిన సాంప్రదాయాలను, సామాజిక నిబంధనలను ఆనాడే ఎదిరించి పోరాడిన యోధురాలు డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి, సంఘసంస్కర్త. సంఘంలో సంస్కరణల గురించి పరితపించి, తిరుగుబాటు బావుటా ఎగురవేసిన ఉద్యమ శీలి. ఈ తరానికి పెద్దగా తెలియకపోవచ్చు. చరిత్ర పొరలను తొలుచుకుంటూ పోయి అక్కడ తెరిపార చూస్తే దొరికే ఆణిముత్యమే డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి."**

రంగంలో విలీనం చేయడం ద్వారా ఆ పరిశ్రమను ప్రభుత్వం రంగంలో నేడు కొనసాగుతోంది. ఇటీవల 20 వేల కోట్ల రూపాయల వర్క్ ఆర్డర్లు వచ్చాయి.

దేశంలోని భారీ పరిశ్రమలకు రావల సిన విభాగాలను ఉత్పత్తి చేయడానికి చెక్ స్లోవాకియా సోషలిస్టు దేశ సహాయంతో 1960వ దశకంలో విశాఖలో స్థాపించబడింది. ఎల్&టికి పోటీగా ఉన్నదని, ఎల్&టికి అప్ప గించాలని వాజ్‌పాయ్ ప్రభుత్వం 2002లో నిర్ణయించింది. దీనికి వ్యతిరేకంగా భారీ పోరాటం జరిగింది. సిఐటియు, గుర్తింపు యూనియన్ నాయకత్వంలో ఎల్&టి ప్రతినిధులను కంపెనీలోకి రానివ్వకుండా 4 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలతో సహా అడ్డుకున్నారు. ఎల్&టి యాజమాన్యం తోకముడిచింది. 2004లో ఎన్నికల ముందు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కార్మికుల పోరాటాన్ని బలపర్చారు. యూపీఏ ఏచూరి నాయకత్వంలో పలు దఫాలుగా ప్రధాని డా॥మన్మహన్‌సింగ్ తో చర్చలు జరిపిన ఫలితంగా భారీ సంస్థ బీహెచ్ఈఎల్ (16యూనిట్లు)కు అదనంగా 17వ సంస్థగా బీహెచ్‌పీవీ 2008 మే 10వ తేదీన విలీనం జరిగింది. విశాఖలో జరిగిన ఈ సభకు కేంద్ర ప్రభుత్వం సీతారాం ఏచూ రిని, ఏపీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డిని ముఖ్య అతిథులుగా అహ్వానించింది. భారీ పరిశ్రమల



మంత్రి సంతోష్ మోహన్‌దేవ్, జయపాల్‌రెడ్డి హాజరయ్యారు. డీజిఐ ప్రభుత్వ రంగం లోనే కొనసాగ డానికి సిఐటియు నాయకత్వంలోనే పోరాటం జరి గింది. ఈ సంస్థ లో సిఐటియు యూనియన్ ఒక్క టే ఉంది. అధికా రులతో కలసి ఐక్యంగా ఉద్యమం నడిపింది. సీపీఎం నాయ కత్వంలో ఏచూరి పూర్తి మద్దతు తెలియజేశారు. పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను ఆపివేసింది.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విజయనగరంలో డీసిఐ కార్మికుడు వెంకటేష్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకు న్నాడు. అప్పుడే రాజకీయా ల్లోకి రావాలను కుంటున్న పవన్‌కల్యాణ్ ఆ కుటుంబాన్ని పరామర్శించే పేరుతో సిఐటియు నాయకత్వంలోని పోరాట శిబిరానికి హాజరయ్యారు.

సరళీకరణ విధానాలు పేరుతో ప్రైవేటీక రణకు పునాదులు వేసిన కాంగ్రెస్ పార్టీ. నేడు విశాఖ స్టీల్‌ను గానీ, అనేక ఇతర పరిశ్రమలను ప్రైవేటీకరణ వ్యతిరేకంగా నిలబడవలసిన పరిస్థితిని ఒకవైపున కార్మికుల పోరాటం, మరోవైపున పార్లమెంట్ వేదికపై సీతారాం వంటి నాయకుల పోరాటాలతో వారి విధానా లను మార్చుకోవలసి రావడం గత 30 సంవ త్సరాల్లో ఒక ముఖ్య పరిణామంగా గుర్తించాలి. ❋

# ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్

**(28వ పేజీ తరువాయి)**

తీర్మానాలు చేసింది. దీర్ఘకాలిక విజన్‌తో 2045వ సంవత్సరం నాటికి సాధించాల్సిన లక్ష్యా లతో రూపొందించిన, దేశవ్యాపితంగా ఆర్థికం గా విభజించిన ఆరు ప్రాంతాలలో జాతీయ రక్షణ, భద్రతకు హామీ ఇచ్చింది. భవిష్యత్ దృక్పథంతో మార్గదర్శకాలను, సమస్యలకు పరిష్కారాలను రూపొందించి, స్థిరమైన అభివృ ద్ధిని సాధించటం కోసం దూసుకుపోవటానికి కావలసిన లక్ష్యాలను నిర్దేశించింది. వియత్నాం ప్రజాస్వామిక రిపబ్లిక్ ఇప్పుడు వియత్నాం సోషలిస్టు రిపబ్లిక్‌గా మారింది. స్వాతంత్ర్యం సాధించిన శత వార్షికోత్సవాల నాటికి నిర్దే శించుకున్న లక్ష్యాలను సాధించటానికి పార్టీ నాయకత్వంలో కృషి చేస్తున్నది. 21 శతాబ్దం మధ్య నాటికి ఐదు ఖండాలలో ఉన్న అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా వియత్నాం కూడా అభివృద్ధి చెందిన దేశంగా మారి, హోచి మిన్ కలను సాకారం చేయడానికి కృషి జరుగు తున్నది. దేశం, పార్టీ విప్లవ లక్ష్యాల సాధన కోసం కామ్రేడ్ ఎన్‌గుయెన్ ఫూ ట్రాంగ్ తనను తాను అంకితం చేసుకున్నారు. ఎన్ని ఆటం కాలు వచ్చినా, కష్టాలు ఎదురైనా ఏ మాత్రం వెనుకంజ వేయకుండా ఉక్కు సంకల్పంతో తన కృషిని కొనసాగించారు. తాను ఒక గొప్ప వ్యక్తినని ఆయన రుజువు చేసుకున్నారు. "గౌరవం అత్యంత విలువైనదని, అత్యంత ఉన్నతమైనదని" భావించారు. ఉన్నతమైన సూత్రాలకు కట్టుబడి జీవించారు. దేశం కోసం, ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. ప్రజల పట్ల ప్రేమ, గౌరవం, సాధారణమైన జీవనశైలి, ప్రజాస్వామిక, అంకితభావంతో కూడిన శాస్త్రీయ పని పద్ధతులతో, "స్వచ్ఛంగా, నిష్పక్షపాతంగా ఉండటం" ద్వారా మచ్చలేని విప్లవ నైతికతకు అసలైన ఉదాహరణగా ఆయన జీవించారు. పార్టీ సభ్యులు, ప్రజలు, అధికారులు ఆయన పట్ల అత్యంత గౌరవం, ప్రేమ, విశ్వాసాన్ని చూపించేవారు. అంతర్జాతీ యంగా ఉన్న స్నేహితులు ఆయనను అత్యంత ఎక్కువగా గౌరవించేవారు.

పార్టీ నాయకత్వంలో మార్క్సిజం– లెనినిజం, హోచిమిన్ సిద్ధాంతాలను అన్వయి స్తామని, వాటిని సృజనాత్మకంగా అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. 'పార్టీని ఆధునీ కరించే విధానాలను జయప్రదంగా అమలు చేస్తామని మేం దృఢంగా విశ్వసిస్తున్నాం. జాతీయ స్వాతంత్ర్యా నికి, సోషలిజానికి, పార్టీ నిర్మాణ సూత్రాలకు గట్టిగా కట్టుబడి ఉంటాం. అవకాశాలను అందుకో వటానికి, ఆటంకాలను అధిగమించ టానికి పార్టీ, ప్రజలు, సైన్యం ఐక్యంగా ప్రయత్నం చేయాలి. అన్ని విధాలుగా బలమైన పార్టీని, రాజకీయ వ్యవస్థను నిర్మించాలి. దేశాన్ని సత్వరం, స్థిరంగా అభివృద్ధి చేయాలి. పితృదేశాన్ని శక్తివంతంగా కాపాడు కోవాలి. పార్టీ శత వార్షికోత్సవ సంవత్సరమైన 2030 నాటికి ఆధునిక పరిశ్రమలు, ఉన్నత మధ్య తరగతి ఆదాయాలతో వియత్నాంను అభివృద్ధి చెందిన దేశంగా చేయాలి. దేశం స్వాతంత్ర్యం సాధించిన శత వార్షికోత్సవ సంవత్సరం 2045 నాటికి సోషలిస్టు దృక్పథం తో కూడిన, అభివృద్ధి చెందిన, ప్రజలు ఉ న్నతమైన ఆదాయాలు పొందే దేశంగా మార్చ టానికి బలమైన పునాదులు వేయాలి.' అని వియత్నాం కమ్యూనిస్టు పార్టీ గుయెన్ ట్రాంగ్‌కు నివాళులర్పిస్తూ దీక్ష చేపట్టింది.

# తెలుగు సాహితిపై చెరగని ముద్ర ఆరుద్ర

(2వ పేజీ తరువాయి)

చేసింది అభ్యుదయ సాహిత్యం. అలాంటి సాహిత్య సృష్టిలో ఆరుద్ర పాత్ర నిరుపమానం. త్వమేవాహం, సినీవాలి, కూనలమ్మ పదాలు, ఇంటింటి పద్యాలు వంటి అనేక కావ్యాలతో పాటు వెన్నెల- వేసవి , దక్షిణవేదం, జైలు గీతాలు వంటి అనువాద రచనలూ చేశారు. రాదారి బంగళా, శ్రీకృష్ణ దేవరాయ, కాటమరాజు కథ వంటి అనేక రూపకాలూ రాశారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం (14 సంపుటాలు) ఆరుద్ర పరిశోధనాదృష్టికి, విస్తృత సాహిత్య చరిత్ర సృజనకీ నిలువెత్తు నిదర్శనం. దీనికోసం మేధస్సునే కాకుండా, ఆరోగ్యాన్ని కూడా ఖర్చుపెట్టాడు. వేమన వేదం, మన వేమన, వ్యాస పీఠం, గురజాడ గురుపీఠం, ప్రజాకళలూ ప్రగతివాదులు వంటివి ఆరుద్ర సాహిత్య విమర్శనా గ్రంథాలు. 'ప్రజాకళలూ ప్రగతివాదులు' పుస్తకాన్ని తనకు ఇష్టమైన పీడిత ప్రజల నేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు అంకితమిచ్చారు. రాముడికి సీత ఏమౌతుంది?, గుడిలో సెక్స్ వంటి రచనలు ఆరుద్ర పరిశీలనా దృష్టికి గొప్ప ఉదాహరణలు. సంగీతం పైనా, నాట్యం మీద రచించిన అనేక వ్యాసాలు ఇతర కళల్లో ఆరుద్ర అభినివేశాన్ని పట్టి చూపిస్తాయి. రచన, పరిశోధన రెంటినీ చెరో చేత్తో సమర్థవంతంగా నిర్వహించిన నిత్య నూతన శోభితుడు ఆరుద్ర.

తెలంగాణా పోరాటం నేపథ్యంలో 1948లో 'త్వమేవాహం' కావ్యం రాశాడు. ఇది ముఖ్యమైన తెలుగు రచనల్లో ఒకటి. రజాకార్ల అకృత్యాలను నిరసిస్తూ సాగే రచన ఇది. మృత్యువు ఒక వ్యక్తితో నువ్వే నేను (త్వమేవాహం) అంటుంది. ఈ పుస్తకానికి ఆరుద్ర తొలుత పెట్టిన పేరు 'తెలంగాణ'. ఈ కావ్యానికి భావస్ఫోరకంగా, ఔచిత్యంగా ఉంటుందని చెప్పి, శ్రీశ్రీయే 'త్వమేవాహం' అని నామకరణం చేశారు. 'నువ్వు ఎక్కవల్సిన రైలు జీవితం కాలం లేటు' వంటి మాటలు ఈ రచనలోవే!

### మధుర సినీ గీతాలు

ఆరుద్ర కథలూ కావ్యాలూ పరిశోధక రచనలు ఎంత ప్రసిద్ధమో, సినిమా పాటలు కూడా అంతే ప్రాచుర్యం పొందాయి. 1949లో బీదల పాట్లు అన్న చిత్రంలో .. 'ఓ చిలుకరాజా నీ పెళ్లెప్పుడు' అనే గీతంతో మొదలుపెట్టి దాదాపు నాలుగు వేల సినిమా పాటలు రాశాడు. పాటకు ఒక అర్థాన్నీ, పరమార్థాన్నీ ప్రసాదించి ప్రతి పాటలో తన ముద్రను కనిపింపచేశాడు. సినిమా పాటల్లో సైతం తన దృక్పథాన్ని చెక్కుచెదరనీయని సమర్థ రచయిత ఆయన. సినిమా పాటల్లో సంక్షిప్తంగా చరిత్రను నిక్షిప్తం చేయడం ఆరుద్ర ప్రత్యేకత. 'వేదంలా ఘోషించే గోదావరి – అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి', 'మహా బలిపురం మహా బలిపురం' వంటి పాటలు ఇందుకు ఉదాహరణలు. కొన్ని పాపులర్ గీతాల వివరాలు :

పెంకి పెళ్లాం : పదచుదనం రైలుబండి పోతున్నది.
ఉయ్యాల జంపాల : కొండగాలి తిరిగింది,
అందాల రాముడు ఇందీవర శ్యాముడు
మీనా : శ్రీరామ నామాలు శతకోటి
బందిపోటు : ఊహలు గుసగుసలాడే
బాలరాజు కథ : మహాబలిపురం మహాబలిపురం
ఆంధ్రకేసరి : వేదంలా ప్రవహించే గోదావరి
అందాల రాముడు : ఎదగడానికెందుకురా తొందర
గోరంతదీపం : రాయినైనా కాకపోతిని
ముత్యాల ముగ్గు : ఏదో ఏదో అన్నది మసక వెలుతురు,
ముత్యమంత పసుపు ముఖమెంతో చాయ
బాల భారతం : మానవుడే మహనీయుడు
ఇద్దరు మిత్రులు : హలో హలో అమ్మాయి
ఆత్మీయులు : ఓహో చిలిపి నవ్వుల శ్రీవారు

ఆరుద్ర తన మిత్రులకు వందలాది ఉత్తరాలూ రాశారు. ఆ ఉత్తరాల నిండా సాహిత్య శోభ, పరిశోధనా తపన నిండుగా కనిపిస్తాయి. సాహిత్యంలో ఏదైనా విషయంపై సందిగ్ధం, సందేహం ఉంటే అది నివృత్తి అయ్యేదాకా ఆయన విశ్రమించేవారు కాదు. ఎక్కడ సరైన సమాచారం దొరుకుతుందని భావిస్తే- ఆయా చోట్లకు ప్రయాణం అయ్యేవారు. అలా దేశంలో ఆయన అన్ని ప్రసిద్ధ గ్రంథాలయాలను సందర్శించారు. రోజుల తరబడి, ఆయా పట్టణాల్లో మకాం వేసి, పుస్తకాలను తిరగేసేవారు. ఈ విధంగా ఎన్నో అపరిష్కృత సాహిత్య అంశాలను ఒక కొలిక్కి తీసుకొచ్చారు. పూర్వ కవుల పుట్టుక, నివాసం, రచనలు వంటి అంశాలను నిర్ధారించటంలో ఆయన పరిశోధక దృష్టి, కృషి అద్భుతంగా దోహదపడ్డాయి. శ్రీశ్రీ పుట్టిన తేదీకి సంబంధించిన వివరణ కూడా ఆయన ఆవిధంగానే ఇవ్వగలిగారు. సాహిత్య సమాచారం తెలుసుకోవటమే ప్రధాన లక్ష్యంగా ఆయన వందలాది ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాయి. ఏ పుస్తకం ఎక్కడ దొరుకుతుందో, మూడు నాలుగు దశాబ్దాల క్రితం ఏ వ్యాసం ఎక్కడ ప్రచురితం అయిందో మిత్రులకు రాసిన ఉత్తరాల్లో ఆరా తీస్తూ, సమాధానాలు చెబుతూ ఆరుద్ర ఉత్తరాల నిండా సాహిత్య చర్చే ప్రవహిస్తుంది.

### ఆ రుద్ర భూములు నావే..!

ఎంతో మృదువుగా, నెమ్మదిగా మాట్లాడే ఆరుద్ర గొప్ప హాస్య సంభాషకుడు కూడా. ఓసారి ఆరుద్ర మిత్రుడితో కలిసి అలా వెళుతున్నారు కారులో. మిత్రుడు అడిగాడు .. 'మీరు ఇన్ని పాటలు రాశారు. కథలు రాశారు.. ఏమైనా సంపాదించారా?' అని. కారు ఆ సమయంలో శ్మశానికి సమీపంలోంచి వెళుతోంది. ఆరుద్ర నవ్వుతూ ఆ శ్మశానాన్ని చూపించి... 'ఆ రుద్ర భూములన్నీ నావే!' అన్నాడు. నిజంగానే ఆయన ఏమీ సంపాదించలేదూ అమూల్యమైన పుస్తకాలు తప్ప. ఆయన తాను సేకరించిన వేలాది విలువైన పుస్తకాలను సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి కానుకగా ఇచ్చారు.

### కూనలమ్మ పదాలు

చిన్ని చిన్ని పదాలతో గొప్ప అర్థాలు కూర్చటం ఆరుద్రకు తెలిసిన గొప్ప విద్య. అందుకే ఆయన రాసిన కూనలమ్మ పదాలు చాలా ప్రాచుర్యం పొందాయి. వాటిలో కొన్నింటిని దిగువన చూడండి..

సామ్యవాద పథమ్ము
సౌమ్యమైన విధమ్ము
సకల సౌఖ్యప్రదమ్ము
ఓ కూనలమ్మ

సర్వజనులకు శాంతి
స్వస్తి, సంపద, శ్రాంతి
నే కోరు విక్రాంతి
ఓ కూనలమ్మ

తెలివితేటల తాడు
తెంపుకొను మొనగాడు
అతివాద కామ్రేడు
ఓ కూనలమ్మ
ఇజము నెరిగిన వాడు
నిజము చెప్పని నాడు
ప్రజకు జరుగును కీడు
ఓ కూనలమ్మ
దహనకాండల కొరివి
తగలబెట్టును తెలివి
కాదు కాదిక అలవి
ఓ కూనలమ్మ
కూరుచుండిన కొమ్మ
కొట్టుకొను వాజమ్మ
హితము వినడు కదమ్మ
ఓ కూనలమ్మ
చెప్పి దేవుని పేరు
చెడుపు చేసెడివారు
ఏల సుఖపడతారు
ఓ కూనలమ్మ
కోర్టుకెక్కిన వాడు
కొండనెక్కిన వాడు
వడివడిగ దిగిరాడు
ఓ కూనలమ్మ
పరుల తెగడుట వల్ల
బలిమి పొగడుట వల్ల
కీర్తి వచ్చుట కల్లఓ కూనలమ్మ

ఆరుద్ర ఏం చేసినా, ఏం రాసినా అది తెలుగు సాహిత్యం పరిపుష్టం కావటానికే చేశాడు. కథ, కవిత, నవల, నాటిక, గేయం, పరిశోధన, అనువాదం ... అనేకానేక సరదా సరదా సాహిత్య విన్యాసాలూ ... ఇలా అన్నింటా ప్రవేశించి, రాణించి, తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చాడు. ప్రజల కోణంలోంచి సాహిత్యాన్ని సందర్శించే ప్రయత్నం పరిశోధన ద్వారా చేశాడు. ప్రజల స్వరాన్ని, దైనందిన జీవితాన్ని వినిపించే, వివరించే ప్రయత్నం తన విస్తారమైన సాహిత్య సృజన ద్వారా చేశాడు. 'కలం చిత్రాలు' పేరిట వేలూరి శివరామశాస్త్రి గారి గురించి ఆరుద్ర ఇలా రాశారు... : ''ఆంధ్రదేశంలోని చాలామంది అక్షరోపజీవులలాగే వారు కూడా కథ, కవిత, పరిశోధన, వ్యాసరచన, విమర్శ, ప్రాచీన గ్రంథ పరిష్కరణ మొదలైన ప్రక్రియలెన్నో చేపట్టారు. అయితే వారికీ, ఇతరులకు తేడా ఉంది. పట్టినదల్లా మేలిమి బంగారం చేయగలిగిన ప్రజ్ఞ శాస్త్రి గారి అజ్ఞాబద్ధం.".

ఈ మాటలు ఆరుద్రకు అక్షరాలా సరిపోతాయి. ఆయన చేపట్టిన ప్రతి సాహిత్య ప్రక్రియా తెలుగు సాహితికి గొప్ప వన్నె, విలువా చేకూర్చి పెట్టాయి. 73 ఏళ్లు జీవించిన ఆరుద్ర 1998 జూన్ 4వ తేదీన చెన్నయ్‌లో తుదిశ్వాస విడిచారు. తన సాహిత్య కృషే గొప్పది తప్ప చావు కాదని బతికి ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో అనేవారు. ఎలాంటి హడావిడి లేకుండా, ఎవరికీ తెలియకుండా, సాదాసీదాగానే తన అంత్యక్రియలు జరిగిపోవాలని ఆయన కోరుకున్నాడు. ఆవిధంగానే విలువైన, విస్తారమైన సాహిత్య నిధిని తెలుగు సాహిత్యానికి వదిలిపెట్టి, ఆయన వెళ్లిపోయాడు. ❊

---

# సైన్సు - సమాజం

(23వ పేజీ తరువాయి)

వాడడం. అర్యభట్టు ప్రాచీన భారత గణితానికి పితామహుడు. ఆయన క్రీస్తుశకం 476లో రాసిన ఆర్యభట్టీయంలో స్థాన-విలువ భావనను ప్రవేశపెట్టారు.

అయితే ప్రాచీన గ్రీకు సైన్సుకూ, ప్రాచీన భారతీయ సైన్సుకూ ఒక తేడా ఉంది. గ్రీకు శాస్త్రవేత్తలు ప్రధానంగా సిద్ధాంతాలు, సూత్రాలు, రుజువుల ఆధారంగా ప్రతిపాదనలు చేస్తే, భారతీయ శాస్త్ర వేత్తలు అనుభవ పూర్వక పద్ధతులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.

**కొత్త భావాలు-ఆధునిక సైన్సు**

గ్రీకు సైన్సు వెనుకపట్టు పట్టిన తర్వాత పశ్చిమ దేశాలను అజ్ఞాన తిమిరం ఆవరించింది. అక్కడ మౌఢ్యం రాజ్యమేలే కాలంలో తూర్పున భారత్, చైనాలలో సైన్సు వికసించింది. ఖగోళ శాస్త్రం, వైద్యం రసాయనిక శాస్త్రాలలో పరిశోధనలు కొనసాగాయి. నీటిమరలు, గాలిమరలు, గడియారం, నౌకాయాన దిక్సూచి, తెరచాప ఓడ, తుపాకిమందు, ఫిరంగి, కటకాలు, మద్యం తయారీ, కాగితం, ముద్రణ వంటివన్నీ తూర్పున కనుగొనబడి అరబ్బు శాస్త్రవేత్తల ద్వారా తుదకు పశ్చిమానికి చేర్చబడ్డాయి. అయితే తూర్పుదేశాలలో కూడా మధ్యయుగాల ఫ్యూడల్ వ్యవస్థలో క్రమంగా పనికీ, మేధస్సుకూ మధ్య సంబంధాలు తెగిపోవడంతో విజ్ఞాన శాస్త్ర పరిశోధనలను వెనకపట్టు పట్టాయి.

అలాంటి సమయంలో కొత్తగా ఆవిర్భవించిన ఇస్లామ్ మతం సైన్సును ప్రోత్సహించింది. మధ్య ప్రాచ్యానికి చెందిన అనేక మంది శాస్త్రవేత్తలు శాస్త్ర శోధనకు ప్రాధాన్యమివ్వడంతోపాటు అటు గ్రీకు సైన్సును, ఇటు తూర్పుదేశాల్లో విలసిల్లిన ఆవిష్కరణలను గ్రంథస్తం చేశారు.


అలాంటి సమయంలో క్రీస్తు శకం 14వ శతాబ్దంలో తొలుత ఇటలీలోనూ, తరువాత యూరప్‌లోని పలు దేశాల్లోనూ కొత్తగా ఆవిర్భవించిన పెట్టుబడిదారీ వర్గం కొత్త ఆలోచనలకు తెరలేపింది. 'సాంస్కృతిక పునరుజ్జీవనం' పేరుతో ప్రారంభమైన కొత్త ఆలోచనా ధోరణి శాస్త్ర పరిశోధనా శకానికి అంకురార్పణ చేసింది. సముద్ర వ్యాపారాల ద్వారా, మత యుద్ధాల ద్వారా పోగుపడిన ప్రాథమిక పెట్టుబడి పెద్ద ఎత్తున పోటీని పెంచింది. కొత్త సముద్ర మార్గాలకోసం, కొత్త కొత్త మార్కెట్ల కోసం ప్రారంభమైన పోటీ యూరోపియన్లు అన్ని ప్రాంతాలకూ విస్తరించేందుకు తోడ్పడింది. ఇవన్నీ వారి ఆలోచనల్లో వందల ఏళ్ల స్తబ్దతను పోగొట్టి కొత్త తార్కిక భావాల వ్యాప్తికి కారణమయ్యాయి. దాంతో వారు గ్రీకులు సృష్టించిన తార్కిక గ్రంథాల దుమ్ము దులిపి అధ్యయనం ప్రారంభించారు. తూర్పు దేశాల నుండి వచ్చిన విజ్ఞానాన్ని ఆసరాగా చేసుకున్నారు. ముఖ్యంగా నౌకాయాన దిక్సూచి, కాగితం, ముద్రణ యూరోపియన్ల వికాసానికి ఎంతగానో తోడ్పడింది. నౌకాయానంలో కొత్త సాంకేతికత వారు ఖండాంతరాలకు విస్తరించడానికి తోడ్పడితే, గూటెన్ బర్గ్ కనుగొన్న ఆధునిక ముద్రణా యంత్రం విజ్ఞాన విస్తరణకు తోడ్పడింది.

ఈ విధంగా యూరప్‌లో ఆర్థిక వ్యవస్థల్లో వచ్చిన మార్పులు కొత్త ఆలోచనా ధోరణి ప్రకృతిని సరికొత్త రీతిలో అర్థం చేసుకోడానికి మార్గం వేసింది. ఇది ప్రకృతి సూత్రాలకు సంబంధించి కొత్త ఆవిష్కరణలకు, కొత్త సాంకేతికతలకు దారితీయగా కొత్త సాంకేతికతలు ప్రకృతిని మరింత లోతుగా అధ్యయనం చేయడానికీ, మరిన్ని కొత్త ఆవిష్కరణలు చేయడానికీ కారణమయ్యాయి.

(2వ భాగం వచ్చే సంచికలో)

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 4 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# అన్యాయాన్ని సహించపోడమే విప్లవకారుని గొప్పలక్షణం



**- చె గువేరా**

ప్రపంచంలో ఎక్కడైనా, ఎవరికైనా అన్యాయం జరిగితే సహించబోకు. ఒక విప్లవకారునిలో ఉండే గొప్ప లక్షణం అదే.

...........

అన్యాయం జరుగుతుంటే చూసి ఆగ్రహంతో ఊగిపోతున్నావా? అయితే నువ్వే నా కామ్రేడ్‌వి.

...........

విప్లవ కారునిలో ప్రేమ అనే గొప్ప భావన నిక్షిప్తమై ఉంటుంది. ఈ లక్షణం లేని నిజమైన విప్లవకారుని ఊహించలేం.

...........

విప్లవం అనేది పండిపోయినాక రాలిపోయే ఆపిల్ పండు కాదు. నువ్వే దాన్ని రాలగొట్టాలి.

...........

మనం ఒక లక్ష్యం కోసం జీవిస్తున్నామంటే, దానికోసం చనిపోవడానికి కూడా సిద్ధపడాలి.

...........

ప్రపంచం నిన్ను మార్చనీ, అప్పుడే నీవు ప్రపంచాన్ని మార్చగలుగుతావు.

...........

నిశ్శబ్దం అనేది ఇంకో విధంగా చేసే వాదనే.

...........

విప్లవాన్ని తెచ్చేది మనుషులే, కానీ ప్రతి రోజు విప్లవ స్ఫూర్తిని పొందేవారే ఆ పని చేయగలరు.

...........

ప్రజా హీరోలు ప్రజల నుండి వేరుగా ఉండలేరు. ప్రజలకు దూరంగా పీఠాలమీద అధిష్టించబడ్డ వాళ్లు ప్రజా హీరోలు కారు.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

పోస్టు స్టాంపు

ఇంటి నెంబరు ......................................

వీధి ......................................

గ్రామం ......................................

మండలం లేదా పట్టణం ......................................

జిల్లా ......................................

email : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.